www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

గమనిక : సంక్రాంతి సందర్భంగా నేడు (మంగళవారం) మా కార్యాలయానికి సెలవు.
కావున బుధవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం గురువారం.

సంపుటి : 68 సంచిక : 203 | మంగళవారం 15-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

కత్తి కట్టారు...


రాయ్యూరులో...

జోరుగా కోడి పందేలు

- చేతులు మారిన రూ.200 కోట్లు
- ఓకే అన్న ప్రభుత్వం, తప్పుకున్న పోలీసు
- కృష్ణా, గోదావరి జిల్లాల్లో వెయ్యి బరులు
- మంత్రులే తెరవెనుక సూత్రధారులు
- ఎమ్మెల్యేల సమక్షంలోనే పందేల నిర్వహణ


కాకినాడలో....


ఐ.భీమవరంలో

కోళ్లకు కత్తులు కట్టారు. బరిలో రక్తం పారింది. పందేలరాయుళ్ల చేతుల్లో నోట్ల కట్టలు తెగాయి. సంప్రదాయం, డింకీ పందేల మాటున రాష్ట్రవ్యాప్తంగా భారీగా కోడి పందేలు జరిగాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలతోపాటు గుంటూరు, కడప, ఉత్తరాంధ్ర జిల్లాల్లో పండుగ తొలి రోజునే రూ.200 కోట్లపైనే డబ్బులు చేతులు మారాయి. ఈ ఏడాది సాధారణ ఎన్నికలు జరగనుండటంతో పలువురు మంత్రులు సీఎం చంద్రబాబుతో మాట్లాడి, మౌఖికంగా ఆదేశాలు జారీ చేయించారు. దీంతో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు దగ్గరుండి మరీ పందేలు వేయించారు. గతేడాది కోడి పందేలు నిర్వహించినందుకు నోటీసులు అందుకున్న ఎమ్మెల్యేలు ఈసారి దూరంగా ఉన్నారు. కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లోనే వెయ్యికిపైగా బరులలో కోడి పందేలు జరిగాయి. మూడు రోజులపాటు రేయింబవళ్లు పందేలు నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేశారు.

2లో

కన్నడనాట ఆపరేషన్ లోటస్





- బీజేపీ నేతలతో ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల భేటీ
- కమలం పట్ల సీఎం కుమారస్వామి మెతక వైఖరి
- కర్ణాటకమంత్రి శివకుమార్ ఆరోపణ
- ఫిరాయింపు వార్తలకు కుమారస్వామి ఖండన

9లో

ఇక 8 గంటలే...!

ఓటీకి అలవెన్సు.. వీక్లీ ఆఫ్

- నల్లగొండ జిల్లాలో ప్రయోగం సక్సెస్
- లోక్‌సభ ఎన్నికల తర్వాత పూర్తిస్థాయి అమలు
- తెలంగాణ ప్రభుత్వం కసరత్తు
- పోలీసులపై ఒత్తిడి తగ్గించడమే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్ :
సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో పీపుల్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న తెలంగాణ పోలీసు విభాగం ఇప్పుడు సిబ్బంది పనితనాన్ని పెంచేందుకు మరో కీలక నిర్ణయం వైపు అడుగులు వేస్తోంది. 8 గంటల పని విధానం..ఓటీ చేస్తే అలవెన్స్..వీక్లీ ఆఫ్స్ వంటి పలు కీలక నిర్ణయాలు అమలు చేసే దిశగా తెలంగాణ పోలీసు శాఖ యోచిస్తోంది. పంచాయతీ ఎన్నికల అనంతరం ఈ విధానం పాక్షికంగాను, లోక్‌సభ ఎన్నికల అనంతరం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే నల్లగొండ జిల్లాలో వీక్లీ ఆఫ్స్ విధానాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టి విజయవంతంగా కొనసాగించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ వారాంతపు సెలవుల విధానాన్ని రద్దు చేశారు. ఈ కొత్త విధానంతో పోలీసులకు పని ఒత్తిడి తగ్గే అవకాశముంది. వన్ స్టేట్, వన్ పోలీస్, వన్ ఎక్స్‌పీరియన్స్ టార్గెట్ అందుకోవాలంటే పోలీసులు ఆరోగ్యవంతమైన వాతావరణంలో పనిచేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే షిఫ్టులు..వీక్లీ ఆఫ్స్..8 గంటల డ్యూటీ వంటి పలు కీలక నిర్ణయాల అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పోలీసింగ్ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం కల్పించటంతో ఇప్పటికే 10వేల మంది ఎస్సై, కానిస్టేబుళ్లుగా నియమితులయ్యారు. మరో 18 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. పోలీసింగ్ మెరుగుపడాలంటే షిఫ్ట్ పద్ధతే సరైనదని బ్యూరో ఆఫ్ పోలీసు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్‌డీ), ఆస్కీ సంయుక్త అధ్యయనంలో తేలింది. సెలవులు లేకుండా నిరంతరంగా పనిచేయటంతో డ్యూటీని

- మిగతా 2 లో

కన్హయపై మరోకుట్ర

దేశద్రోహం కేసులో చార్జిషీటు బనాయింపు
1200 పేజీలతో కోర్టుకు సమర్పణ



న్యూఢిల్లీ :
మోదీ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ నాయకులపై మూడేళ్ల తర్వాత ఢిల్లీ పోలీసులు చార్జిషీటు బనాయించారు. దేశ ద్రోహం కేసులో జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్హయకుమార్, ఇతరులకు వ్యతిరేకంగా ఢిల్లీ పోలీసులు సోమవారం చార్జిషీటు దాఖలు చేశారు. విద్యార్థి నాయకులపై ఈ కేసు 2016 లో నమోదైంది. మూడేళ్ల తర్వాత ఢిల్లీ పోలీసులు చార్జిషీటు దాఖలు చేశారు. 2016 ఫిబ్రవరి 9న జేఎన్‌యూ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థి నాయకులు భారత వ్యతిరేక నినాదాలు చేసి దేశద్రోహానికి పాల్పడినట్టు పోలీసులు చార్జిషీటులో బనాయించారు. ప్రత్యేకించి కన్హయకుమార్ భారతవ్యతిరేక నినాదాలకు ఆద్యుడని అక్కసు వెళ్లగక్కారు. జేఎన్‌యూ మాజీ విద్యార్థులు ఉమర్ ఖలీద్, అనిర్బన్ భట్టాచార్య, అఖిబ్ హుస్సేన్, ముజీబ్

- మిగతా 2 లో

రాజకీయ దురుద్దేశంతోనే : సీపీఐ

2లో

రాజకీయ ప్రేరేపితం

– కన్హయకుమార్

మాపై చార్జిషీటు దాఖలు చేయడం నిజమే అయితే అందుకు పోలీసులు, ప్రధాని నరేంద్రమోడీకి ధన్యవాదాలు తెలుపుతున్నా. మూడేళ్ల తర్వాత .. ఎన్నికలకు ముందు చార్జిషీటు దాఖలు చేశారు. ఇది ముమ్మాటికీ రాజకీయ ప్రేరేపితమని స్పష్టమవుతోంది. నా దేశ న్యాయ వ్యవస్థపై నాకు పూర్తి విశ్వాసం ఉంది. మాకు కచ్చితంగా న్యాయం జరుగుతుంది. మోడీకి, మతవాదులకు ఎదురుదెబ్బ తప్పదు.

సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ నియామకంపై సుప్రీంలో సవాల్

9లో

ఇదీ లోకం!





తిరుగు ప్రయాణాలకు

మస్తుగా బస్సులు

- 3,020 అవసరమని గుర్తించిన అధికారులు
- 16 నుంచి 20 వరకు ప్రత్యేక సర్వీసులు తిప్పేందుకు ఏర్పాట్లు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి :
సంక్రాంతి సందర్భంగా సొంత ఊళ్లకు చేరుకున్న ప్రయాణికులను పండుగ తర్వాత తిరిగి తమ నివాస ప్రాంతాలకు చేర్చేందుకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు సన్నద్ధమైంది. ఉద్యోగ, ఉపాధి, ఇతర అవసరాల రీత్యా ఇతర రాష్ట్రాల్లో నివాసముండే రాష్ట్ర ప్రజలు పెద్దసంఖ్యలో సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత గ్రామాలకు తరలివచ్చిన విషయం తెల్సిందే. ఈ సందర్భంగా

- మిగతా 2 లో

సీబీఐ క్రతువులో

మోడీనే సమిధ..!

సుశీల్ కుట్టీ

- వచ్చే ఎన్నికల్లో రాఫెల్ ఎఫెక్ట్
- వర్మ ఉద్వాసనకు తప్పదు భారీ మూల్యం



సెలవు... పునర్నియామకం...బదిలీ.. ఎపిసోడ్‌లో విజేత ఎవరు? సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మా? ప్రధాని నరేంద్ర మోడీనా? సీబీఐ డైరెక్టర్ శిరచ్ఛేద క్రతువును మోడీ నిర్దాక్షిణ్యంగా నిర్వహించినా... భవిష్యత్తులో ఆయనకు మరింత శిరోభారం తప్పదు. ముఖ్యంగా రాఫెల్ కుంభకోణం ఆయన్ను కబళిస్తోందంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. రాఫెల్ కుంభకోణంపై అంతర్గత పోరును ప్రారంభించిన అలోక్‌వర్మ ఉద్వాసన నేపథ్యంలో అనేక అంశాలు పెనవేసుకున్నాయి. ఒక రకంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ ముందుగానే అలోక్‌వర్మపై వేటును గుర్తించారు. అలోక్‌వర్మ బయటకు వెళ్లక తప్పదనే భావన కల్పించారు. వర్మ తనను బదిలీ చేయటాన్ని సుప్రీంకోర్టులో ప్రశ్నించవచ్చు. కానీ ఫలితం ఉండదు. ఎందుకంటే ఆయన పదవీకాలం మరి కొన్ని రోజుల్లోనే ముగియనుంది. దీనికితోడు ఆయనపై వేటు వేసే బాధ్యతను మూడో నంబరు కోర్టు నుంచి ప్రధాని, కాంగ్రెస్ సభా పక్ష నేత, సుప్రీంకోర్టు న్యాయమూర్తి కలిసిన సెలక్షన్ కమిటీకి బదిలీ చేసింది. అయితే, ప్రతి వ్యక్తి గౌరవానికి భంగం కలగని రీతిలోనే అలోక్‌వర్మకు ప్యానల్ కమిటీ ఓ అవకాశం ఇచ్చింది. ప్యానల్ కమిటీ ముందు తన వాదన వినిపించాలని సూచించింది. అలోక్‌వర్మకు వ్యతిరేకంగా చీఫ్ విజిలెన్స్ కమిషనర్ ఇచ్చిన నివేదికకే ప్యానల్ కమిటీ కట్టుబడింది. ఓ వైపు కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే వ్యతిరేకించినా మోడీ మాత్రం వినలేదు. ఈ పంజరంలోని చిలుక (అలోక్‌వర్మ) ప్రధానికి వ్యతిరేకంగా పలికిన పలుకులే ఇందుకు ప్రధాన కారణం. 'చౌకీదార్ చోర్ హై...చౌకీదార్

- మిగతా 2 లో

ఫిబ్రవరి 1 నుంచి

కొత్త విధానం

రూ.153కే 100 పే లేదా ఫ్రీ ఛానళ్లు



న్యూఢిల్లీ :
బుల్లితెర ప్రేక్షకులకు ట్రాయ్ శుభవార్త తెలిపింది. వీక్షకులు 100 పే లేదా ఫ్రీ ఛానళ్లను రూ.153.40కే పొందవచ్చని ఉత్తర్వులు జారీ చేసింది. జీఎస్‌టీతో కలిపి ఈ మొత్తాన్ని చెల్లించాలని సూచించింది. కేబుల్/డీటీహెచ్‌లలో 100 ఛానళ్లను వీక్షించవచ్చన్న ట్రాయ్.. జనవరి 31లోపు 100 ఛానళ్లను ఎంపిక చేసుకోవాలని తెలిపింది. ఫిబ్రవరి 1 నుంచి కొత్త విధానం అమల్లోకి వస్తుందని, ఈ ప్యాక్‌లో హెచ్‌డీ ఛానళ్లు లభించవని స్పష్టం చేసింది. తమ సర్వీసు ప్రొవైడర్ల నుంచి వినియోగదారులు మరిన్ని తెలుసుకోవాలని ట్రాయ్ సూచించింది. కాగా, ఒక ఛానల్ గరిష్ఠ ధరను రూ.19గా నిర్ణయించింది.

ట్రంప్, రిపబ్లికన్ల వల్లే షట్‌డౌన్

మెజారిటీ అమెరికన్ల అభిప్రాయం



వాషింగ్టన్ : దేశ చరిత్రలోనే తొలిసారిగా సుదీర్ఘకాలం పాటు కొనసాగుతున్న ఫెడరల్ షట్‌డౌన్‌కు ప్రధానంగా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, రిపబ్లికన్లే కారణమని అత్యధిక మంది అమెరికన్లు అభిప్రాయపడ్డారు. ఏబీసీ న్యూస్, అమెరికన్ పోస్ట్ సంయుక్తంగా నిర్వహించిన పోల్ సర్వేను ఆదివారం ప్రకటించాయి. జూన్ 2015 ఎన్నికల్లో ట్రంప్ ఇచ్చిన హామీ ప్రకారం మెక్సికో-అమెరికా సరిహద్దు గోడ నిర్మాణానికి 42 శాతం మంది మద్దతు పలికారు. 53 శాతం మంది ట్రంప్, రిపబ్లికన్‌ల కారణంగానే షట్‌డౌన్ జరిగిందని తప్పుబట్టారు. ఇదిలా ఉంటే 29 శాతం డెమోక్రాట్లను తప్పుబట్టారు. వీరిలో మూడింట రెండొంతుల మంది అధ్యక్షుడు ట్రంప్‌ను, ఆయన పార్టీని విమర్శించారు. ఇదిలా ఉంటే, దక్షిణ సరిహద్దులో సంక్షోభం ఉందని, తక్షణమే గోడ నిర్మించటానికి నిధులు ఇవ్వాలనే ట్రంప్ వాదనను మూడింట రెండు వంతుల మంది వ్యతిరేకించారు. కొన్ని మాసాలుగా షట్‌డౌన్ కారణంగా తీవ్ర సంక్షోభం తప్పదని 79 శాతం మంది అభిప్రాయపడ్డారు. జనవరి 8 నుంచి 11 వరకూ దేశవ్యాప్తంగా ల్యాండ్ లైన్‌లు, సెల్‌ఫోన్ల ద్వారా ప్రజాభియాన్ని సేకరించారు. 788 మందితో మాట్లాడి ఈ సర్వే నివేదికను ప్రకటించారు.

ఇరాక్‌లో ఇరాన్ విదేశాంగ మంత్రి



బాగ్దాద్ : ఇరాన్ చమురు పరిశ్రమలు, రవాణా, బ్యాంకింగ్ సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించిన నేపథ్యంలో... ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి మొహ్మద్ జావద్ జరీఫ్ ఇరాక్‌లో పర్యటిస్తున్నారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంచుకునే రీతిలో ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత పటిష్ట పర్చాలనే ధ్యేయంతో ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి ఆదివారం బాగ్దాద్‌కు చేరుకున్నారు. ఇరాక్ విదేశాంగశాఖ మంత్రి మొహ్మద్ అల్ హకీం విమానాశ్రయంలో సాదర ఆహ్వానం పలికారు. ఇద్దరు మంత్రులు సెంట్రల్ బాగ్దాద్‌లోని గ్రీన్‌జోన్‌లో భేటీ అయ్యారు. విదేశాంగ శాఖ మంత్రి మొహ్మద్ జావద్ జరీఫ్ పర్యటన వివరాలను అంతక ముందు ఇరాన్ రాయభారి బాగ్దాద్‌లో వివరించారు. జరీఫ్ సోమవారం ఇరాన్ అధ్యక్షుడు బర్హాం సలీ, ప్రధాని ఆదేల్ అబ్దుల్ మహదీ, పార్లమెంటు స్పీకర్ మొహ్మద్ అల్ హాల్‌బౌసీతో భేటీ అయ్యారు. ఇరాక్ ఉన్నతాధికారులతోనూ భేటీ అయ్యారు. ఇక మంగళవారం జరీఫ్ కుర్దిస్థాన్ రాజధాని ఎర్బిల్‌కు వెళ్తారు. కుర్దిష్ నాయకులతో సంప్రదింపులు జరుపుతారు. బుధవారం దక్షిణ బాగ్దాద్‌లోని పవిత్ర నగరాలు కర్బాలా, నజఫ్‌ల్లో పర్యటిస్తారు.

విశాలాంధ్ర ప్రపంచం

రోజా లగ్సంబర్గ్ అమరులకు ఘన నివాళి...!

బెర్లిన్ : వందేళ్ల కిందట జరిగిన రోజా లగ్సంబర్గ్, కార్ల్ లీబ్ నెష్ట్ హత్యాకాండలో కమ్యూనిస్టు అమరులకు బెర్లిన్‌లో వేలాది మంది సోషలిస్టులు ఘన నివాళి అర్పించారు. జర్మనీ నలుదిక్కుల నుంచి, విదేశాల నుంచి తరలి వచ్చిన వేలాది మంది సోషలిస్టులు బెర్లిన్ నడి వీధుల్లో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. తూర్పు బెర్లిన్‌లోని ఫ్రీడ్ రిచ్ ఫీల్డ్ స్మశాన వాటికలో అమరుల సమాధుల ముందు ఎర్ర గులాబీలతో అంజలి ఘటించారు. 1919లో మొదటి ప్రపంచ యుద్ధానంతరం జర్మనీ లొంగుబాటు తరువాత తమ ఆయుధాలను స్వాధీన పర్చటానికి తిరస్కరించిన సైనికులు స్పార్టాసిస్ట్ తిరుగుబాటులో సోషల్ డెమోక్రాట్ పార్టీ నాయకులు ఫ్రీడ్‌రీచ్ ఎబెర్ట్, గుస్తవ్ నోస్కే ఆదేశాలతో జర్మనీలో అనేక మంది కమ్యూనిస్టు నేతలను అత్యంత క్రూరంగా చంపేశారు. ఈ హత్యాకాండలో అసువులు బాసిన అమరులకు ప్రతి ఏటా ఘన నివాళి అర్పించటం ఆనవాయితీ.



కాగ ఆదివారం పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టులు, సోషలిస్టులు బెర్లిన్‌కు తరలి వచ్చారు. అమరులకు నివాళి అర్పించటానికి వచ్చిన ప్రజల నినాదాలతో బెర్లిన్ దద్దరిల్లిపోయింది. టర్కీ అణిచివేతతో తల్లడిల్లుతున్న కుర్దులకు సంఘీభావం తెలిపారు. సుడాన్, ఇరాన్‌ల్లోని పాలకుల విధానాలతో అల్లాడిపోతున్న ప్రజలకు సంఘీభావం తెలిపారు. యూరోపియన్ యూనియన్, నాటోల నయా లిబరలైజేసన్ నశించాలని నినాదాలు చేశారు. జర్మన్ డెమోక్రాటిక్ రిపబ్లిక్ మాజీ ప్రధాని, కమ్యూనిస్టు నేత హాన్స్ మోడ్రోవ్, అనేక మంది వామపక్ష ఎంపీలు, జర్మన్ కమ్యూనిస్టు నేతలు, అంతర్జాతీయ అతిథులు, న్యూక్లియర్ డిస్ఆర్మమెంట్ జనరల్ సెక్రటరీ కేటీ హడ్సన్, బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ నేత రాబర్ట్ గ్రిఫిత్స్ తదితరులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఇదిలా ఉంటే, అంతక ముందు రోజా లగ్సంబర్గ్ లో భారీ సదస్సు జరిగింది. సుమారు 3500 మంది ఈ సదస్సులో పాల్గొన్నారు. పెట్టుబడిదారి విధానంతో సంక్షోభం, సామ్రాజ్యవాదం యుద్ధవాతావరణం, సోషలిస్టు విప్లవం లక్ష్యాలను ఈ సదస్సులో చర్చించారు.

ఇక 8 గంటలే...!

(మొదటిపేజీ తరువాయి)

సమర్థవంతంగా చేయలేక తీవ్ర ఒత్తిడితో పోలీసులు అనారోగ్యం పాలవుతున్నారని ఓ సర్వే తేల్చింది. ఓవర్ డ్యూటీ చేస్తే ఓటీ శాలరీతో పాటు ట్రాన్స్‌పోర్ట్ చార్జెస్ కూడా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. ఎనిమిది గంటల షిఫ్ట్‌తో ప్రజలకు మెరుగైన సేవలు అందిచ్చు వచ్చని..దీంతో మరింత క్వాలిటీ డ్యూటీకి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. పోలీసులు మానసిక ప్రశాంతతతో నిబద్ధతగా విధులు నిర్వహించవచ్చని పోలీస్‌శాఖ భావించింది. దీంతో పూర్తిస్థాయిలో అమల్లోకి తెచ్చేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించిన అన్ని వివరాలను కమిషనర్లు, ఎస్పీల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. బీపీఆర్‌డీ నివేదిక పూర్తిస్థాయిలో అమలు చేయడం సాధ్యమవుతుందా? లేదా ఆయా కమిషనరేట్లు, ఎస్పీల పరిధిలో ఎంతమంది సిబ్బంది ఉండాలి? వంటి వివరాలు సేకరిస్తున్నారు. వారి నుంచి పూర్తి నివేదిక అందిన తర్వాత 8 గంటల పని విధానం అమలు, అదనపు పని గంటలకు అలవెన్సుల చెల్లింపు, వారాంతపు సెలవుపై పోలీస్ శాఖ నిర్ణయం తీసుకోనుంది. బీపీఆర్‌డీ, ఆస్కీ దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాల్లో 319 పోలీసు స్టేషన్ల పరిధిలో 12,156 మంది కానిస్టేబుళ్లు, 1003 మంది స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, 962 మంది సూపర్‌వైజరీ స్థాయి అధికారుల అభిప్రాయాలను తమ సర్వే ద్వారా తెలుసుకున్నాయి. మెట్రోపాలిటన్, అర్బన్, అర్బన్-రూరల్ మిక్స్‌డ్, రూరల్, క్రైం, ట్రాఫిక్, ఉమెన్, ట్రైబల్ తదితర 9 రకాల పోలీసు స్టేషన్లను శాంపిల్‌గా తీసుకున్నారు. 8 గంటల షిఫ్ట్ విధానం అమలు చేయాలంటే ఎంతమంది సిబ్బంది అవసరమో బీపీఆర్‌డీ, ఆస్కీ లెక్కించింది. 24 గంటలూ పని ఒత్తిడితో పోలీసులు అనారోగ్యం పాలవుతున్నారని బీపీఆర్‌డీ, ఆస్కీ సర్వేలో తేలింది. షిఫ్ట్ విధానం అమలు చేస్తే పోలీసుల పనితీరును 1.68 రెట్లు మెరుగు పరచుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం దేశంలో పోలీసు స్టేషన్లలో 30 శాతం సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. దీన్ని పెంచేందుకు తెలంగాణ సర్కారు భారీగా రిక్రూట్‌మెంట్లు చేపడుతోంది. ఈ క్రమంలో పోలీస్ శాఖ తీసుకున్న నూతన విధానంతో మరింతగా పోలీసు సేవలు అందనున్నాయి.

మోడీనే సమిధ..!

(మొదటిపేజీ తరువాయి)

చోర్ హై" అంటూ చిలుక పదే పదే పలుకుతున్న నేపథ్యంలో... రాఫెల్ పాట ఊపందుకుంది. మరిన్ని చిలుకలు ఈ పాటను అందుకోవటంతో ముళ్ల మీద కూర్చునంత బాధ మోడీని వెంటాడింది. పైగా వర్మను సెలవుపై పంపించటం, ఆపైన ఉద్వాసన ఎపిసోడ్‌తో మోడీ మరిన్ని విమర్శలను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. రాఫెల్ కుంభకోణంలో వర్మ విచారణ జరుపుతాడనే భయంతోనే మోడీ ఈ చర్యలకు దిగాడని సర్వత్రా నమ్మే పరిస్థితి తప్పలేదు. అలోక్ వర్మపై అభియోగాలపై విచారణలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనా తీర్పు మాత్రం ఆయనకు వ్యతిరేకంగానే వచ్చింది. ఐతే, ప్రధాని మోడీ, కాంగ్రెస్ పక్షనేత మల్లిఖార్జున్ ఖర్గే, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గగోయ్, న్యాయమూర్తి సిక్రీ... ఎవ్వరూ ట్విట్టర్‌లో ట్వీట్‌లను ఆపలేక పోయారు. వీరందర్ని నెటిజన్లు తూర్పారబట్టారు. సంఘీ, చడ్డీలంటూ వీళ్లను నెటిజన్లు ట్రోల్ చేశారు. ఇక స్పెక్యూలేషన్ అనేది ప్రతి ఒక్కరి హక్కు స్పెక్యూలేషన్‌ను అడ్డుకునే అవకాశమే లేదు. ఇప్పుడు కాంగ్రెస్‌కు మంచి అవకాశం దక్కినట్టే. వాస్తవానికి సీబీఐ డైరెక్టర్‌గా వర్మ అభ్యర్థిత్వాన్ని మల్లిఖార్జున్ ఖర్గే తీవ్రంగా వ్యతిరేకించారు. అప్పట్లో మోడీ కావాలనే వర్మను తీసుకు వచ్చారు. అదే ప్రధాని ఇప్పుడు వేటు వేశారు. ప్రభుత్వం మీదనే దర్యాప్తు జరుపుతాననే తెగింపును ప్రధాని తట్టుకోలేక పోయారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఇదే రీతిలో వ్యవహరించారు. ఇంకో విషయమేమిటంటే... వర్మ చెంచాగిరి కోసం పోరాడలేదు. ఎందుకంటే ఇప్పటికే రాకేశ్ ఆస్థానా స్పెషల్ డైరెక్టర్ పేరిట మోడీ చెంచా సీబీఐలో చేరారు. వీరిద్దరి మధ్య స్పర్ధలు తారా స్థాయికి చేరుకోవటంతో మోడీ జోక్యం చేసుకోవటంతో...ఇద్దరూ న్యాయపోరాటాలకు తెరతీశారు. రాకేశ్ ఆస్థానా ఢిల్లీ హైకోర్టులో, అలోక్‌వర్మ సుప్రీంకోర్టులో తమ హక్కుల కోసం మొరపెట్టుకున్నారు. ఏది ఏమైనా వర్మ ఎపిసోడ్ రాబోయే ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఓటర్లు ఎవరిని నిజాయితీపరులో నిర్ణయిస్తారు. ప్రధాని మోడీ.. అలోక్ వర్మ...ప్రజల దృష్టిలో ఎవరు నిజాయితీపరులో తేలటానికి మరి కొన్ని నెలలు వేచి చూడాల్సిందే. ఇప్పటి వరకూ పరోక్ష పోరాటం చేసిన వర్మ ఇక ప్రత్యక్షంగా కత్తి దూయటం ఖాయమే.

శబరిమలలో మకరజ్యోతి దర్శనం

శబరిమల: కేరళలోని శబరిమలలో మకరజ్యోతి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. పంబానది, సన్నిధానం, హిల్‌టాప్, టోల్‌ప్లాజా వద్ద మకర జ్యోతి దర్శనం కోసం ట్రావెన్‌కోర్ దేవస్థానం ఏర్పాట్లు చేసింది. స్వామివారి తిరువాభరణాలను సాయంత్రం 6గంటలకు సన్నిధానానికి తరలించారు. సాయంత్రం 6.30గంటలకు దీపారాధనతో తిరువాభరణ ఘట్టం పూర్తయింది. అనంతరం పొన్నాంబలమేడు నుంచి అయ్యప్ప జ్యోతి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మకర జ్యోతిని కనులారా వీక్షించిన భక్తులు తన్మయత్వంతో పులకించి పోయారు. స్వామియే శరణం అయ్యప్ప అంటూ భక్తుల శరణుఘోషతో శబరిగిరులు మార్మోగాయి. భక్తులు ఈనెల 19వరకు అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు వీలు కల్పించారు. ఈనెల 20న పందళ రాజవంశీకులు స్వామివారి దర్శనం తర్వాత ఆలయం మూసివేస్తారు.

కత్తి కట్టారు

విశాలాంధ్ర - నెట్‌వర్క్ : సంక్రాంతి పండుగ కోడి పందేలతో కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో సందడి నెలకొంది. గ్రామాల్లోని రోడ్లన్నీ పందేల బరుల వద్దకే దారితీశాయి. కార్లు, బైక్‌లు, సైకిళ్లపై పందేలరాయుళ్లు తరలివెళ్లారు. రాజధాని విజయవాడసహా కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో సోమవారం భారీగా పందేలు నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా కొప్పాకలో ప్రభుత్వ విప్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమక్షంలో కోడి పందేలు ప్రారంభమయ్యాయి. ఐ భీమవరంలో జరిగిన కోడి పందేలకు ఉండి ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు హాజరయ్యారు. ఈ పందేలను మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, రఘురామకృష్ణంరాజు ప్రారంభించారు. ఐ భీమవరం బరిలోనే తొలి రోజున రూ.5 కోట్లపైనే పందేలు జరిగాయి. రూ.పది వేల నుంచి రూ.10 లక్షల వరకు పందేలు జరగటం గమనార్హం. ఇక జిల్లాలోని కాళ్ల, వెంప, భీమడోలు, శ్రీరామవరం, శ్రీనివాసపురం, జంగారెడ్డిగూడెం, ధర్మాజిగూడెం, చింతలపూడి, తణుకు తదితర ప్రాంతాలలో పెద్ద ఎత్తున పందేలు జరిగాయి.



ఐ.భీమవరంలో...

సంక్రాంతి కోడి పందేల కోసం నిర్వాహకులు పది రోజుల ముందు నుంచే మామిడితోటలు, కొబ్బరితోటలలో బరులు ఏర్పాటు చేసుకున్నారు. కానీ, ఎక్కడా పోలీసులు బరుల జోలికి వెళ్లలేదు.

పైపెచ్చు ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలే పందేల నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తుండటంతో పోలీసులు మిన్నకుండిపోయారు. ఒక్క పశ్చిమ గోదావరి జిల్లాలోనే తొలి రోజున సుమారు రూ.70 కోట్లు చేతులు మారినట్లు అంచనా. ఈ ఏడాది కృష్ణాజిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ కోడి పందేలు జరిగాయి. తొలి రోజున సుమారు రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్ల మేర డబ్బులు చేతులు మారాయి. విజయవాడ సమీపంలోని కొత్తూరు తాడేపల్లిలోని మామిడి తోటలో ఆరు బరులు ఏర్పాటు చేశారు. ఆ బరులలోకి వెళ్లి పందేలు చూసేందుకు నిర్వాహకులు రూ.300 ప్రవేశరుసుం వసూలు చేయటం గమనార్హం. గతంలో ఎన్నడూ ఇలా ప్రవేశ రుసుం వసూలు చేసిన దాఖలాలు లేవు. కృష్ణాజిల్లా పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆధ్వర్యంలో ఈడ్పుగల్లులో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో కోడిపందేలు నిర్వహించారు. గొడవర్రులోనూ భారీగా పందేలు వేశారు. బాపులపాడు మండలం అంపాపురంలో జాతీయ రహదారి పక్కనే భారీ ఎత్తున కోడి పందేలు, పొట్టేలు పందేలు నిర్వహిస్తున్నారు. నూజివీడు, ఆగిరిపల్లి, శోభనాపురం, చాట్రాయి, ముసునూరు, తిరువూరు, కైకలూరు, గుడివాడ, మచిలీపట్నం, బంటుమిల్లి తదితర ప్రాంతాల్లోనూ భారీగా పందేలు వేశారు. జిల్లాలో రూ.వెయ్యి నుంచి రూ.లక్ష వరకు పందేలు జరిగాయి. పందేలకు వచ్చే వారి వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. పంట పొలాలు, మామిడి తోటలలో వందలాది వాహనాలు పార్కింగ్‌లో కనిపించాయి. తూర్పు గోదావరి జిల్లాల్లో మధ్యాహ్నం 12 గంటల వరకు పోలీసులు పందేలకు అనుమతించలేదు.



దేవరపల్లిలో గుండాట

దీంతో జిల్లా మంత్రులు జోక్యం చేసుకోవటంతో మధ్యాహ్నం 12 గంటల తర్వాత నుంచి పందేలు జరిగాయి. పందేలరాయుళ్లు మాత్రం ఉదయం ఆరు గంటలకే బరులకు చేరుకున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో తొలి రోజున సుమారు రూ.40 కోట్ల నుంచి రూ.50 కోట్ల మేర పందేలు జరిగాయి. కోనసీమలోని ముమ్మిడివరం నియోజకవర్గం కొమరగిరితోపాటు గెద్దనపల్లిలో పెద్ద బరులను ఏర్పాటు చేశారు. తొలుత జిల్లాలో పందేలను కట్టడి చేసేందుకు పోలీసులు ప్రయత్నించినా, ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేసిందనే వార్త రావటంతో అక్కడ నుంచి ఖాకీలు నిష్క్రమించారు.

గుండాట, పేకాటకు వేలం

సంక్రాంతి పండుగ మూడు రోజుల్లో కోడి పందేల నిర్వహణ ఒక ఎత్తైతే, పేకాట, గుండాట మరో ఎత్తు. వీటి నిర్వహణకు బరుల వద్ద వేలం ప్రక్రియ నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లాలో గుండాట నిర్వహణకు ఒక వ్యక్తి ఏకంగా రూ.32 లక్షలకు వేలంపాట నిర్వహించాడంటే, జూదం ఏ విధంగా ఉంటుందో అంచనా వేసుకోవచ్చు. ఇక మద్యం ఏరులై పారింది. మహిళలు సైతం బరులకు క్యూ కట్టారు. ఉత్సాహంతో సెల్ఫీలు దిగారు.

ఎక్కడికక్కడ బెల్ట్ షాపులు ఏర్పాటు చేశారు. సాధారణంగా బెల్ట్ షాపులపై దాడులు చేసే ఎక్సైజ్‌శాఖ అధికారులుసైతం ఎక్కడా కనిపించలేదు.



రొయ్యూరులో...

మీడియాకు బెదిరింపులు

కోడి పందేల నిర్వాహకులు పలు జిల్లాల్లో మీడియాను అడ్డుకున్నారు. ఇందుకోసం బరుల వద్ద ప్రత్యేకంగా మనుషలతోపాటు ప్రైవేటు ఏజెన్సీలను ఏర్పాటు చేసుకోవటం విశేషం. ప్రెస్ అనే స్టిక్కరున్నా, ఫొటో, వీడియో కెమెరా ఉన్న వారిని ఏమాత్రం అనుమతించలేదు. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో నిర్వాహకులతోపాటు ప్రజాప్రతినిధులు సైతం మీడియా ప్రతినిధులకు వార్నింగ్ ఇచ్చారు. కెమెరా క్లిక్‌మంటే తర్వాత ఏం జరిగినా తమకు సంబంధం లేదంటూ బెదిరింపులకు దిగారు.

ఒకటీ రెండు చోట్ల పందేలకు వచ్చిన వాహనాలు, హాజరైన జనాల ఫొటోలు తీసుకునేందుకు మాత్రం అనుమతించగా, చాలాచోట్ల బరుల వద్దకు విలేకరులు, ఫొటోగ్రాఫర్లను అనుమతించలేదు. పందేలను ఎంతసేపైనా చూడండిగానీ, ఫొటోలు తీయవద్దని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో మీడియా సంస్థలు సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్‌లపైనే ఆధారపడ్డాయి.



కొత్తూరు తాడేపల్లిలో....

నేడు ఇతర రాష్ట్రాల పందెం రాయుళ్ల రాక

సంక్రాంతి కోడి పందేల కోసం ఇతర రాష్ట్రాల పందెంరాయుళ్లు కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలకు రానున్నారు. వారి కోసం పలు జిల్లాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సంక్రాంతి రోజున ఒక్కో జిల్లాలో రూ.300 కోట్ల నుంచి రూ.500 కోట్ల మేర డబ్బులు చేతులు మారే అవకాశాలు ఉన్నట్లు నిర్వాహకులే చెబుతున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, లండన్ నుంచి ఎన్‌ఆర్‌ఐలు కోడి పందేలకు తరలివచ్చారు. ఉభయ గోదావరి జిల్లాల్లో పండుగ రోజున మహిళలు పందేలు చూసేందుకు రానున్నారు. పందేలపై కోర్టు ఆదేశాలను ప్రస్తావించగా, ఏటా చూస్తూనే ఉన్నాం కదా అని వ్యాఖ్యానిస్తున్నారు.

రాజకీయ దురుద్దేశంతోనే : సీపీఐ

న్యూఢిల్లీ : జవహర్‌లాల్ నెహ్రు విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్హయకుమార్‌పై దేశద్రోహం ఆరోపణలపై చార్జిషీట్ దాఖలు చేసిన పోలీసుల చర్యను భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శివర్గం తీవ్రంగా ఖండించింది. కన్హయకుమార్‌పై తప్పుడు కేసు బనాయించిన వెయ్యి రోజుల తరువాత చార్జిషీట్ దాఖలు చేయడం మోడీ ప్రభుత్వ కక్షసాధింపు చర్యకు నిదర్శనంగా పేర్కొన్నది. రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడిందని సోమవారం ఇక్కడ విడుదల చేసిన ప్రకటనలో సీపీఐ విమర్శించింది. రాజకీయ దురుద్దేశంతోనే ఈ చర్యకు పాల్పడిందని పేర్కొన్నది. తన రాజకీయ అవసరాలను నెరవేర్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందనడాన్ని ఈ చర్య ప్రతిబింబిస్తోందని తెలిపింది. ప్రభుత్వ ఈ తప్పుడు చర్యను ప్రజలు గమనిస్తారని, తిప్పికొడతారని ఆ ప్రకటనలో సీపీఐ విశ్వాసాన్ని వ్యక్తం చేసింది.

ప్రజాకోర్టులో సవాల్ చేస్తాం : నారాయణ : దాదాపు మూడు సంవత్సరాల తరువాత కన్హయ కుమార్‌పై దేశద్రోహం నేరం ఆరోపణలతో చార్జిషీట్ దాఖలు చేయడాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టరు కె. నారాయణ తీవ్రంగా ఖండించారు. రాజకీయ దురుద్దేశంతో ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, వ్యక్తులను మట్టుపెట్టే పద్ధతిలో కాయకల్ప చికిత్స మాదిరి కల్పిత చార్జిషీట్ దాఖలు చేశారని ఆయన పేర్కొన్నారు. నిర్దోషిగా కన్హయకుమార్ బయటపడతారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో ప్రతిపక్ష పార్టీల నాయకులను అనైతికంగా జైళ్లలో పెట్టేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, మోడీ ప్రభుత్వ దిగజారుడుతనానికి ఇది నిదర్శనమని అన్నారు. ఈ చర్యను ఖండిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ చర్యను కోర్టులో చాలెంజ్ చేస్తామని, ప్రజాకోర్టులో కూడా సవాల్‌చేస్తామని నారాయణ పేర్కొన్నారు.

కన్హయపై మరోకుట్ర

(మొదటిపేజీ తరువాయి)

హుస్సేన్, మునీబ్ హుస్సేన్, ఉమర్ గుల్, రయాయా రసూల్, బషీర్ భట్, బషరత్ నిందితులుగా ఉన్నారు. షెహ్లా రషీద్, సీపీఐ జాతీయ కార్యదర్శి, ఎంపీ డి.రాజా కుమార్తె అపరాజిత రాజా పేర్లను సైతం చార్జిషీటులో పొందుపరిచారు.

ఐపీసీ సెక్షన్ 124 ఏ(దేశద్రోహం), 323(ఉద్దేశపూర్వకంగా మనసు గాయపర్చడం), 465(ఫోర్జరీ), 471(నకిలీపత్రాలు సమర్పించడం) 147(అల్లర్లు), 120 బీ(నేరపూరిత కుట్ర) ఆరోపణలపై చార్జిషీటును పోలీసులు కోర్టుకు సమర్పించారు. విద్యార్థి నాయకులపై ఢిల్లీ పోలీసులు 1200 పేజీల చార్జీషీటు తయారుచేశారు. భారత వ్యతిరేక నినాదాలు చేయడానికి కన్హయకుమార్ అక్కడి విద్యార్థులను ప్రోత్సహించారని చార్జిషీటులో ఆరోపించారు. ఈ చార్జిషీటును మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సుమిత్ ఆనంద్ మంగళవారం పరిశీలిస్తారు. బీజేపీ ఎంపీ మహేష్ గిరి, ఏబీవీపీ ఫిర్యాదు మేరకు వసంత్‌కుంజ్(నార్త్) పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

మస్తుగా బస్సులు

(మొదటిపేజీ తరువాయి)

రైళ్ళు,బస్సులు,టాక్సీలు, ప్రైవేటు బస్సులన్నీ ప్రయాణీకులతో కిటకిటలాడాయి. ఆర్టీసీ కూడా ప్రత్యేక సర్వీసుల పేరుతో ప్రయాణీకుల నుండి అదనపు ఛార్జీలు వసూలు చేయగా,ఇక ప్రైవేటు బస్సులు, కార్లు అయితే నిలువు దోపిడీకి పాల్పడ్డారు. ఈనేపధ్యంలో ఆర్టీసీ తరపున పండుగకు ముందు జరిగిన ఏర్పాట్ల లోపాలను గుర్తించి, ఈసారి మెరుగైన పద్దతిలో తిరుగు ప్రయాణ ఏర్పాట్లకు చర్యలు చేపడుతోంది. ప్రయాణీకుల డిమాండ్ కనుగుణంగా తిరుగు ప్రయాణానికి గాను వివిధ ప్రాంతాలకు 3020 బస్సులు నడపాలని సంస్థ నిర్ణయించింది. ఈ బస్సులు ఈ నెల 16వ తేదీ మొదలు 20వ తేదీ వరకు కొనసాగుతాయి.ఆంధ్రప్రదేశ్ లోని వివిధ జిల్లాల నుండి ప్రధానంగా చెన్నై , బెంగళూరు, హైదరాబాద్ వంటి రాష్ట్రేతర ప్రాంతాలకు, రాష్ట్రం లోపల విశాఖ, విజయవాడ, రాజమండ్రి, అమలాపురం మొదలైన ప్రాంతాలకు ఈ బస్సులు నడపనున్నారు. ప్రధానంగా హైదరాబాదు నగరానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి 1115 బస్సులు నడుపుతున్నారు. హైదరాబాద్‌కు విజయవాడ నుండి 275 బస్సులు, అలాగే గుంటూరు నుండి 150 , ఒంగోలు నుండి 160, తూర్పుగోదావరి జిల్లా నుండి 150, కర్నూల్ నుండి 100 ,వెస్ట్ గోదావరి నుండి 75 బస్సులు నడపనున్నారు. బెంగళూరుకు చిత్తూరు నుండి 200 బస్సులు కడప నుండి 110 బస్సులు కర్నూల్ నుండి 90 బస్సులు నెల్లూరు నుండి 55 బస్సులు అనంతపురం నుండి 50 బస్సులు, మిగిలిన ప్రాంతాల నుండి ఇంకొన్ని బస్సులు కలిపి మొత్తం 570 బస్సులు కేటాయించారు. చెన్నై నగరానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి 202 బస్సులు తిప్పనున్నారు. ఇందులో విజయవాడ నుండి 35 బస్సులు నెల్లూరు నుండి 35 బస్సులు, కడప నుండి 35 బస్సులు ఉన్నాయి.అలాగే విశాఖ పట్నానికి 219 బస్సులు నడుపుతుండగా ఇవి ప్రధానంగా విజయనగరం శ్రీకాకుళం నుండి 110 బస్సులు, తూర్పు గోదావరి రిజయన్ నుండి 72 బస్సులు నడుపు తున్నారు.విజయవాడ నుండి అమలాపురం రాజమండ్రి వైపు 175 బస్సులు నడపాలని సంస్థ నిర్ణయించింది అదేవిధంగా ఈస్ట్ గోదావరి రీజియన్ నుండి విజయవాడకు 123 బస్సులు నడపనున్నారు. ఇవిగాక మిగిలిన ప్రాంతాల్లో ప్రయాణీకుల రద్దీని దృష్టిలో వుంచుకొని మరికొన్ని బస్సులు తిప్పడానికి కూడా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఆ కాలేజీలపై వేటే !

- 25 శాతం సీట్లు భర్తీకాకపోతే...
- ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీల గుండెల్లో రైళ్లు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : ఇంజనీరింగ్, వృత్తివిద్యా కాలేజీలకు ఈ ఏడాది మరిన్ని కష్టాలు తప్పేలాలేవు. ఇప్పటికే సగానికి పైగా కాలేజీలు మూసివేతకు గురయ్యాయి. 2019-20 విద్యా సంవత్సరానికి సంబంధించి కాలేజీల అఫిలియేషన్ నిబంధనలు రాష్ట్రంలోని ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీల యాజమాన్యాలకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. వచ్చే విద్యా సంవత్సరానికి జేఎన్‌టీయూ రూపొందించిన నిబంధనల ప్రకారం వరుసగా మూడేళ్లు కనీసం 25 శాతం సీట్లు భర్తీ కాని కోర్సులకు అనుబంధ గుర్తింపు రద్దు చేస్తారు. గతేడాది నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఇంజనీరింగ్ సహా బీ ఫార్మసీ, ఫార్మా డీ కోర్సులు అందించే 307 కాలేజీలు పాల్గొన్నాయి. వీటిలో 45 కాలేజీల్లోనే 100 శాతం అడ్మిషన్లు జరిగాయి. ఏకంగా 55 కాలేజీల్లో 100 లోపు అడ్మిషన్లు, 29 కాలేజీల్లో 50 లోపు అడ్మిషన్లు వచ్చాయి. ఈ కాలేజీల్లో ఏ కోర్సులోనూ 25 శాతం అడ్మిషన్లు జరిగే అవకాశం లేదు. రెండేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగిన కాలేజీల్లోని కోర్సులపై వేటు ఖాయమనిపిస్తోంది. ఫలితంగా రాష్ట్రంలో మరోసారి కాలేజీలు, కోర్సులు భారీస్థాయిలో మూతపడే ప్రమాదం కనిపిస్తోంది. నిజానికి 25 శాతం నిబంధనను గతేడాదే అమలు చేయాలని జేఎన్‌టీయూ నిర్ణయించింది. కానీ యాజమాన్యాల ఒత్తిడితో ఈ నిర్ణయాన్ని వాయిదా వేసుకుంది. ఈసారి మాత్రం అనుబంధ గుర్తింపును నిబంధనల్లో చేర్చడం విశేషం. ఇంజనీరింగ్ తోపాటు పీజీ కోర్సులు అందించే కాలేజీలలో ఫ్యాకల్టీకి బయోమెట్రిక్ హాజరును కచ్చితంగా అమలు చేయాలనే నిబంధనను జేఎన్‌టీయూ ప్రవేశపెట్టింది. బయోమెట్రిక్ హాజరు లేకపోతే కాలేజీకి అనుబంధ గుర్తింపు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. ఇంజనీరింగ్ కాలేజీల్లోని బయోమెట్రిక్ అమలుపై జేఎన్‌టీయూ రెండేళ్లుగా కసరత్తు చేస్తోంది. ఈ నిబంధనను అతిక్రమిస్తున్న పలు కాలేజీలు ఫ్యాకల్టీ వేలిముద్రలను క్లోనింగ్ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నాయి. కాలేజీ, కోర్సు అనుమతి సమయంలో ఏఐసీటీఈకి, జేఎన్‌టీయూకు వేర్వేరు వివరాలు అందించేవి, ఫ్యాకల్టీ సంఖ్యను ఏఐసీటీఈకి శాంక్షన్ సీట్ల ప్రకారం అందించి.. జేఎన్‌టీయూకి మాత్రం అడ్మిషన్ల ప్రకారం చూపించేది. జేఎన్‌టీయూ తాజా ఆదేశంతో ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీలు ఫ్యాకల్టీలను భారీసంఖ్యలో నియమించుకో వాల్సి ఉంటుంది. కాలేజీలు తప్పించుకునే అవకాశం లేకుండా విద్యా సంవత్సరం ఎప్పుడైనా ఆకస్మిత తనిఖీలు చేపడతామని జేఎన్‌టీయూ తెలిపింది.



కామ్రేడ్ పూత్తూరి సుబ్బమ్మకు నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

సీనియర్ కమ్యూనిస్టు పొత్తూరి సుబ్బమ్మ మృతి

విశాలాంధ్ర-మద్దిపాడు : సీని యర్ కమ్యూనిస్టు నాయకులు పొత్తూరి సుబ్బమ్మ (85) ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం మార్లగుంట పాలెంలో సోమవారం తెల్లవారు జామున మృతిచెందారు. భర్త పొత్తూరి పేరయ్యతో పాటు 1942వ సంవత్స రంలో ఆమె భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)లో చేరారు. పెద్దకొత్తపల్లి పం చాయితీలో భూస్వాములకు, దళితులకు జరిగిన తాగునీటి చెరువు విషయంలో, కూలీలకు కూలీ విషయంలో అన్యాయమైనటువంటి విధానంలో తిండిగింజలు కొనుక్కునే విధంగా ఎదురు తిరిగి దళితుల పక్షాన నల్లూరి అంజయ్య, మన్నం పిచ్చయ్యలతో కలిసి సుబ్బమ్మ దంపతులు పోరాటం చేశారు. గ్రామ స్థాయిలో సీపీఐని బలోపేతం చేసేం దుకు ఎనలేని కృషి చేసిన మహిళా నాయకురాలుగా గుర్తింపు తెచ్చుకు న్నారు. మహిళల అభివృద్ధి కొరకు మహిళా సంఘాలను ఏర్పాటు చేయ దం, ప్రభుత్వ పాఠశాల పునరుద్ధరణ, గ్రామాలకు బస్సులు వచ్చే విధంగా పోరాటాలు చేశారు. యువకుల్లోను, మహిళల్లోను, పార్టీ విలువలను అం దించే విధంగా ప్రతి ఒక్కరినీ చైతన్య పరిచారు. పొత్తూరి సుబ్బమ్మ సేవ లను పలువురు నాయకులు కొనియా డారు. బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన దంపతులు పొత్తూరి పేరయ్య, సుబ్బమ్మ అని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) అన్నారు. సుబ్బమ్మ మృతివార్త తెలిసిన వెంటనే ఆల్ ఇండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ జిల్లా మాజీ కార్యద ర్శులు కె అరుణ, ఎం వెంకయ్య, కార్య వర్గ సభ్యులు కె వీరారెడ్డి, జిల్లా నాయ కులు ఉప్పుటూరి ప్రకాశరావు, కమ్యూ నిజం సంపాదకులు ఎంసీ వెంకటే శ్వర్లు, ఆసర అధ్యక్షులు చిడిపోతు వెం కటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు నాతాని భూపతిరావు, ప్రగతి మెడికల్ అధినేత రామయ్య, సీపీఐ నాయకులు నల్లూరి చంద్రశేఖర్, గోగినేని వెంకటేశ్వర రావు, నల్లూరి రామారావు, కాకి జాల య్య, నాతాని కోట్లింగం, పావులూరి అంజయ్య తది తరులు సుబ్బమ్మ భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె మృతికి సంతాపాన్ని తెలిపారు.

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పోచారం?



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ స్పీకర్ పీఠం కోసం పోటీ తీవ్రమైంది. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ ఎంపికపై గులాబీ దళపతి కసరత్తును మరింత ముమ్మరం చేశారు. ఈ నెల 18న స్పీకర్ ఎన్నిక జరుగనుంది. దీంతో గులాబీ దళపతి కేసీఆర్ అచితూచి అడుగులు వేస్తున్నారు. పార్టీలో సీనియర్ నేతతో పాటు శాసనసభలో, రాజకీయ జీవితంలో అత్యంత అనుభవం ఉన్న వ్యక్తికి స్పీకర్ పదవి కట్టబెట్టాలని సంకల్పించారు. సీనియర్ నేతలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్, డిప్యూటీ స్పీకర్, మెదక్ శాసనసభ్యురాలు పద్మా దేవేందర్‌రెడ్డి పేర్లు తెరపైకి వచ్చాయి. ఈ దఫా స్పీకర్ పీఠాన్ని ఓసీలకు కట్టబెట్టే ఆలోచన అధికంగా ఉంది. అందువల్ల అపార అనుభవం గల పోచారం శ్రీనివాస్‌రెడ్డి వైపు కేసీఆర్ మొగ్గుచూపే అవకాశం ఉంది. మహిళను పరిగణనలోకి తీసుకుంటే స్పీకర్ పీఠాన్ని పద్మా దేవేందర్‌రెడ్డికి ఇవ్వవచ్చు. పద్మాదేవేందర్‌రెడ్డికి స్పీకర్ పదవి కట్టబెట్టి రాజకీయంగా లబ్ధిపొందాలని కేసీఆర్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈటల రాజేందర్ పేరు సైతం పరిశీలనలో ఉంది. ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడు కావడంతో పోచారం శ్రీనివాస్‌రెడ్డి వైపే కేసీఆర్ మొగ్గుచూపే అవకాశం ఉంది. కేసీఆర్ టీడీపీలో ఉన్ననాటి నుంచి పోచారంతో సన్నిహిత సంబంధాలు ఉండటం, గులాబీ గూటికి చేరిన తరువాత అదే వరవడి కొనసాగడంతో వ్యవసాయ మంత్రిగా కేబినెట్‌లోకి తీసుకున్నారు. పోచారమే స్పీకర్ అయ్యే అవకాశం అధికంగా ఉంది.

పోషకాహార లేమి

వెక్కిరింత



- వేధిస్తున్న ఎదుగుదల, బరువు లోపాలు
- రెండేళ్లుగా రాష్ట్రంలో మారని గణాంకాలు
- నీతి ఆయోగ్

విశాలాంధ్ర - అమరావతి: చిన్నారుల్లో పోషకాహార లోపం నేటికి వెక్కిరిస్తూనే ఉంది. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా పూర్తిస్థాయిలో నియంత్రించలేక పోతుంది. ఐసీడీఎస్ వంటి పలు కార్యక్రమాలు నిర్వహణలో ఉన్నప్పటికీ ఆశించిన మేర ఫలితాలు రావటం లేదు. 2018 - 2019 బడ్జెట్‌లో ప్రత్యేక పోషకాహార కార్యక్రమాన్ని ప్రారంభించినా నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోలేక పోతోంది. పోషకాహార లోపంతో చిన్నారులు మృత్యువాత పడుతున్నా సర్కార్ పటిష్ట ప్రణాళికలు అమలు చేయడంలో విఫలమవుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏడాది గణాంకాలు నమోదు చేస్తున్నారే తప్ప పరిష్కార మార్గాలు అమలు చేయ డంలో శ్రద్ధ కనబరుస్తున్న దాఖలాలు కనిపించటం లేదు. పోషకాహార లోపంతో పిల్లల్లో ఎదుగుదల లోపించటమే కాక తక్కువ బరువు సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ రెండవ స్థానంలో ఉన్నట్లు గణాంకాలు తెలియ చేస్తున్నాయి. ఇటీవల విడుదల చేసిన గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ఎదుగుదల లోపం ఉన్న చిన్నా రులు 2015 -16 మధ్యన 31.4 శాతం ఉంటే 2018 నాటికి కూడా అదే సంఖ్యలో ఉంది గతేడాది డిసెంబర్ నాటికి కూడా 31 శాతంగానే ఉంది. గడి చిన కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథ కాలతో పెద్దగా మార్పు రాలేదని తెలుస్తోంది. పౌష్టికాహార లోపంతోనే 11.7 శాతం మంది చిన్నారులు మరణిస్తున్నారని నివేదికలో స్పష్ట మైంది. నీతి ఆయోగ్ ఇచ్చిన గణాంకాలు ప్రకారం రాష్ట్రంలో బరువు తక్కువగా ఉన్న చిన్నారులు 31.9 శాతం మంది ఉన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఎదుగుదల లోపం ఉన్నవారు 37.5 శాతం ఉంటే బరువు తక్కువగా ఉన్న చిన్నారులు కర్నూలులో 10.3 శాతం మంది ఉన్నారని తెలుస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఎదుగుదల లోపం ఉన్న చిన్నారులు 31 శాతం ఉంటే, బరువు తక్కువ ఉన్న 6.10 శాతంగా ఉన్నట్లు వెల్లడవు తోంది. ప్రభుత్వం పోషకాహారం అందించేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నా ప్రయోజనం చేకూ రకపోవడం శోచనీయం. అంగన్‌వాడీల ద్వారా గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికా హారం అందిస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల ప్రభుత్వం పౌష్టికా హారం అందించే అంశంపై విస్తృత స్థాయిలో కసర త్తులు చేస్తుందని అధికారులు తెలిపారు. ముందుగా పౌష్టికాహార లోపం అధికంగా ఉన్న ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే ఆర్టీజీ సర్వే ద్వారా సంతృప్తి శాతం పెంచేందుకు విస్తృతంగా కృషి చేస్తోంది. ఈ అంశంపై దృష్టి సారించి లోపం ఎక్కడ ఉందో గుర్తించి సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



'జగన్, షర్మిల'కు ఓట్లడిగే హక్కులేదు..

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ పోలీసులపై నమ్మకంలేదంటూ వ్యాఖ్యానిస్తున్న వైసీపీ అధినేత జగన్‌కు, షర్మిళకు ఇక్కడి ప్రజల ఓట్లు అడిగే హక్కులేదని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద్ పేర్కొన్నారు. విజయవాడ టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. షర్మిళపై సోషల్ మీడియాలో వచ్చిన అసభ్యకరమైన వ్యాఖ్యలపై ఏపీ పోలీసులకు ఫిర్యాదు చేయకుండా, తెలంగాణా రాష్ట్రంలోని హైదరాబాద్ పోలీసు కమిషనర్‌ను కలవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఆమెపై అసభ్యకర వ్యాఖ్యల్ని టీడీపీ ప్రోత్సహిస్తోందంటూ చెప్పడం వింతంగా ఉందని పేర్కొన్నారు. జగన్ చేసిన పాదయాత్రకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి భద్రత కల్పించిన విషయాన్ని ఆయన మరచిపోయారని ఎద్దేవా చేశారు. కోడికత్తి డ్రామాతో రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేదంటూ ఆయన చెప్పడం సముచితం కాదన్నారు. ఈయన పద్ధతిలోనే షర్మిళ వ్యాఖ్యానిస్తోందని, రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేదంటూ హైదరాబాద్‌లో ఫిర్యాదు చేయడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో బ్రాహ్మణ నాయకులు తుమ్మపల్లి హరికృష్ణ, వారణాశి దుర్గా సారథి పాల్గొన్నారు.

ఫిబ్రవరి 19న అమరావతిలో

'మాదిగ విశ్వరూప మహాసభ'

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ వర్గీకరణ చేయాలని డిమాండు చేస్తూ ఫిబ్రవరి 19న నవ్యాంధ్ర రాజధానిలోని కాజ గ్రామం వద్ద 10 లక్షల మందితో 'మాదిగ విశ్వరూప మహాసభ' నిర్వహించనున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు మందా కృష్ణమాదిగ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో షెడ్యూల్ కులాలు అంటే మాలలు మాత్రమే అనే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, మిగిలిన కులాలను గుర్తిం చడం లేదని ఆయన విమర్శించారు. సాంఘిక సంక్షేమశాఖ, ఎస్సీ కార్పొరేషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ వంటి కీలక పదవులు మాలలకు కట్టబె ట్టారని, మాదిగలకు ప్రాధాన్యత లేకుండా చేస్తు న్నారని ఆరోపించారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో ఎస్సీ రిజర్వేషన్ చేయాలని కోరు తున్న రాజకీయ పార్టీలు ఆంధ్రప్రదేశ్ విష యంలో ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నిం చారు. తెలంగాణలో మాల, మాదిగల జనాభాలో వ్యత్యాసం 20 లక్షలు ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో కేవలం రెండు లక్షల వ్యత్యాసం ఉందన్నారు. తెలంగాణలో షెడ్యూల్డ్ కులాలకు మూడు లోక్ సభ సీట్లు ఉన్నాయని, అందులో రెండు మాది గలకు ఒకటి మాలలకు ఇచ్చారని ఆయన వివ రించారు. ఏపీలో 4 సీట్లు ఉన్నా అన్ని మాలలకే ఇచ్చారన్నారు. చంద్రబాబు ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో ఎస్సీ రిజర్వేషన్ చేశారని, వైఎస్ సీఎంగా ఉన్న సమయంలో వర్గీకరణ చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి ఢిల్లీకి పంపారని గుర్తుచేశారు. వర్గీకరణకు ఇద్దరు సీఎంలు పూర్తి మద్దతు పలికినా, సాంకేతిక కార ణాలతో అవి రద్దు చేశారన్నారు. రెండు రాష్ట్రా లుగా విడిపోయిన తరువాత ఏపీ సీఎంగా ఉన్న చంద్రబాబు వర్గీకరణపై మాట్లాడ కపోవడం దారుణమన్నారు. అధికారంలో ఉన్న చోట ఒకరంగా అధికారంకోసం మరొక రకంగా వ్యవ హరిస్తున్న చంద్రబాబును ఏ విధంగా చూడాలని అని ప్రశ్నించారు. రాష్ట్రంలో తమకు జరుగు తున్న అన్యాయాన్ని ఈ నెల 20 నుంచి అన్ని రాజకీయ పార్టీలకు వివరిస్తామన్నారు. ఎంఆర్ పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, నాయకులు మందా వెంకటేశ్వరరావు మాదిగ, మానికొండ శ్రీధర్ మాదిగ , కంపాటి వెంకటేశ్వరరావు, విజయవాడ నగర అధ్యక్షులు లింగాల నరసింహులు మాదిగ పాల్గొన్నారు.



వర్గీకరణకు అనుకూలంగా రాజకీయ పార్టీలు ఇచ్చిన పత్రాలను చూపుతున్న మందా కృష్ణమాదిగ

భోగి సంబరాలు అదుర్స్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : వనితలు రంగవల్లులతో... పిల్లలు, పెద్దలు పతంగులతో... సంక్రాంతి మొదటిరోజైన భోగి పండుగను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. సోమ వారం ఉదయం భోగి మంటలతో పండుగను ప్రారంభించారు. పాత చీడలన్నీ పోయి, జీవితాల్లో కొత్త వెలుగులు రావాలని భగవంతుడిని ప్రార్థించారు. డూడూ బసవన్నలు, హరిదాసులు ఊరూరా తిరిగి సందడి చేశారు. ఇంటిముందు తీర్చిదిద్దిన రంగ వల్లులతో ప్రతిపల్లె కలర్‌ఫుల్‌గా కనపడుతోంది. సంక్రాంతి పండుగ స్పెషల్ కోడి పందాలు కూడా పల్లెల్లో జోరందుకున్నాయి. ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ లోని ఉభయ గోదావరి జిల్లాల్లో కనపడే కోడి పందాలు ఈసారి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల గ్రామాలకు దర్శనమి చ్చాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా మారుమూల గ్రామాలలో కోడి పందాలు జోరందుకున్నాయి. కౌటాల, బెజ్జూర్, చింతలమానే పల్లి మండలాలలో కోడిపందాల వాతావరణం ఏర్పడింది. పందెం రాయుళ్లు బెట్టింగ్‌లు కాస్తూ హోరెత్తిస్తున్నారు. భారీ బెట్టింగుల మధ్య హోరాహోరీగా పోటీలు నడుస్తున్నాయి. పందేలు జరుగుతున్న ప్రాంతాలు సందడిగా కనిపిస్తున్నాయి. ఇక నగరంలో ప్రతి ఏరి యాలో భోగి సంబరాలు జరుపుకున్నారు. ఎక్కడ చూసినా ఇళ్ల ముందు మహిళలు రంగురంగుల ముగ్గులు వేస్తూ కనిపించారు. వీధులన్నీ ముగ్గులతో రంగులమయంగా మారిపోయాయి. ఆయా ప్రాంతాల్లో జరిగిన భోగి సంబరాలలో నాయకులు పాల్గొని ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. గతాన్ని భోగి మంటల్లో కాల్చే ద్దాం, ఆశయాలను ఆహ్వానిద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. రైతు లతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఘనంగా జరుపుకునేది సంక్రాంతి అని పేర్కొన్నారు. భోగి సందర్భంగా ప్రజలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముషీరాబాద్, బోలక్‌పూర్‌లో ఉన్న మల్లికా ర్జునస్వామి దేవాలయం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సంక్రాంతి పండుగరోజు మల్లికార్జునస్వామి వివాహఘట్టం నిర్వహించడం ఈ దేవాలయంలో ఆనవాయితీగా వస్తుంది. పిల్లలు, పెద్దలు భవనాలు, మైదానాల్లో పతంగులు ఎగురవేశారు.

తెలుగు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : సంక్రాంతి పండుగ సందర్భంగా తెలుగు ప్రజానీకానికి గవర్నర్ ఈఎస్ఎల్.నరసింహన్, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ వెలుగులు ప్రతి కుటుంబంలోనూ వెల్లివిరియాలని ఆకాంక్షించారు. సకల శుభాలు జరగాలని కోరుకున్నారు. పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని, ప్రజలందరికీ మంచి జరగాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలిపటాల సందళ్లతో, రకరకాల వేడుకలతో కూడిన పండగే సంక్రాంతి అని గవర్నర్ పేర్కొన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్‌లు వేర్వేరు ప్రకటనల్లో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు శు భాకాంక్షలు తెలిపారు. భోగి పండుగ అందరికీ భోగభాగ్యాలు ప్రసాదించా లని, సంక్రాంతి తెలుగు రాష్ట్రాలలోను, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరి ముంగిళ్లలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

రిజర్వేషన్లకు తూట్లుపొడుస్తారా : కృష్ణయ్య

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : రాజకీయ లబ్ధికోసమే రిజర్వేషన్లకు తూట్లు పొడిచారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. బీసీ అభ్యున్నతి, సంక్షేమం, ఆర్థికాభివృద్ధి తమ లక్ష్యం, ధ్యేయ మంటున్న ప్రభుత్వం రాజకీయంగా బీసీలను తొక్కివేసేందుకు జరుగుతున్న కుట్రలో భాగంగానే రిజర్వేషన్లను కుదించిందని ఆరోపించారు. పంచాయతీలకు 34 నుంచి 23 శాతానికి కుదించి రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల హక్కులను కాలరాయడం అమానుషమని వ్యాఖ్యానించారు. బీసీల పట్ల రాజకీయ పార్టీలు దుర్మార్గంగా ఆలోచిస్తున్నాయని విమర్శించారు. అగ్రవర్ణా ల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఒకే ఒక్క రోజులో బిల్లు ప్రవేశపెట్టి, ఆమోదించారన్నారు. రిజర్వేషన్ల అమలు బిల్లుకు ఆమోదముద్ర వేయడం అన్యాయమని పేర్కొన్నారు. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించే బిల్లును ఆమోదించడానికి నెలరోజుల సమయం ఎందుకు తీసుకున్నారని ఆర్.కృష్ణయ్య నిలదీశారు. అవసరం లేకపోయినా అగ్రకులాల పేరుతో రిజర్వేషన్లు ప్రవేశపెట్టారని విమర్శించారు.

జల్లికట్టుకు సర్వం సిద్ధం



చెన్నై: తమిళనాడు సంప్రదాయ క్రీడ జల్లికట్టుకు సర్వం సిద్ధమైంది. సంక్రాంతి పండుగకు జల్లికట్టు నిర్వహించడం తమిళుల ఆనవాయితీగా వస్తోంది. వారం రోజుల పాటు ఈ క్రీడను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించను న్నారు. జల్లికట్టు నిర్వహణకు ప్రసిద్ధిగాంచిన అలంగనల్లూర్‌లో ఆటగాళ్లు ఎద్దులను సిద్ధం చేస్తున్నారు. ఇతర ప్రాంతాలైన అవనియాపురం, పాలమేడు వంటి ప్రాంతాల్లోనూ జల్లికట్టుకోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

అర్బన్ పరిధిలో గ్రామాలకు కొత్త ఇళ్లు

- రాష్ట్రానికి 1.28లక్షల ఇళ్లు మంజూరు
- రూ.3,205కోట్లు కేటాయింపు
- సంక్రాంతి తర్వాత పునాదుల నిర్మాణం
- శంకుస్థాపనలు చేయనున్న అధికారపార్టీ ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో అర్బన్ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో నూతన గృహాలు నిర్మించుకోవడానికి వీలుగా ప్రభుత్వం 1.28లక్షల గృహాలను నూతనంగా మంజూరు చేసింది. నిర్మాణాల నిమిత్తం రూ.3,205కోట్లు నిధులు కేటాయించింది. సంక్రాంతి పండుగ తర్వాత వీటి నిర్మాణాలు ఆరంభం కానున్నాయి. రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజలు నూరుశాతం గృహాలు కలిగి ఉండాలనే ఆశయంతో ప్రభుత్వం కేటాయింపులు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణాలలో నూతన ఒరవడి సంతరించుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్దఎత్తున గృహాలు మంజూరు అవుతున్నాయి. తాజాగా 1.28లక్షల గృహాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకం కింద వీటి నిర్మాణాలు చేపడుతున్నారు. ఒక్కొక్క గృహానికి కేంద్రప్రభుత్వం రూ.1.50లక్షలు ఇస్తుండగా, రాష్ట్రప్రభుత్వం రూ.50వేలు ఇస్తుంది. మరో రూ.50వేలు లబ్ధిదారులు తమ వాటా కింద వేయాల్సి ఉంది. సొంతంగా స్థలం కలిగిన లబ్ధిదారులు దీనికి అర్హులై ఉన్నారు. ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక జరిగిపోవడంతో సంక్రాంతి పండుగ తర్వాత నుంచి స్థానిక ప్రజాప్రతినిధులు వీటి నిర్మాణాలకు శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తూర్పుగోదావరిజిల్లాకు 2,311 ఇళ్లు మంజూరు చేశారు. వీటిని కడియం, రాజమండ్రి రూరల్, కోరుకొండ, రాజానగరం, సీతానగరం, మండపేటరూరల్, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, తాళ్లరేవు, ఆత్రేయపురం, తొండంగి ప్రాంతాలకు కేటా యించారు. అలాగే నెల్లూరు జిల్లాకి 18వేలు ఇళ్లు కేటా యించారు. వీటిని జిల్లాలో సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కావలి, సుళ్లూరుపేట, జమ్ములపాలెం, గూడూరు ప్రాంతాలలో నిర్మించనున్నారు. కర్నూలు జిల్లాకు 15,680 ఇళ్లను కేటాయించారు. వీటిని నంద్యాల, పత్తికొండ, దోనే, కొండమూరు, పన్యంలకు కేటాయిం చారు. అనంతపురం జిల్లాకు 6,677 ఇళ్లను కేటా యించారు. వీటిని జిల్లాలో ధర్మపురం, హిందూపురం, రాప్తాడు ప్రాంతాలలో నిర్మించనున్నారు. శ్రీకాకుళం జిల్లాకి 22,828 ఇళ్ల కేటాయించారు. వీటిని ఆముదా లవలస, నరసన్నపేటలకు కేటాయించారు. విశాఖ పట్నం జిల్లాకి 30.821 ఇళ్లను మంజూరు చేశారు. వీటిని అనకాపల్లి, పాయకరావుపేట, యలమంచిలి, పెందుర్తిలకు ఇచ్చారు. చిత్తూరు జిల్లాకి 3,300 ఇళ్ల కేటాయించారు. వీటిని తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి, నగరిలలో నిర్మించనున్నారు. గుంటూరు జిల్లాకి 6,458 ఇళ్లను మంజూరు చేశారు. వీటిని మంగళగిరి, పెదకూరపాడు, ప్రత్తిపాడు, సత్తెనపల్లి, తాడికొండ, చిలకలూరిపేట, పొన్నూరు, తెనాలి, వేమూరు ప్రాంతాలలో నిర్మించనున్నారు. కృష్ణాజిల్లాకి 4,223 గృహాలను కేటాయించారు. వీటిని గుడివాడ, అవనిగడ్డ, పామర్రు, మచిలీపట్నం, పెడన ప్రాంతాలలో నిర్మించనున్నారు.



సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో

వచ్చే ఫిబ్రవరినెలలో సార్వత్రిక ఎన్నికల నోటిఫి కేషన్ వచ్చే అవకాశం ఉన్నందున వీటి నిర్మాణాలకు సంబంధించిన శంకుస్థాపనలు ఆయా నియోజకవర్గ అధికారపార్టీ ఎమ్మెల్యేలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు సీఎం చంద్రబాబు అంతర్గ తంగా ఆదేశాలిచ్చినట్లు సమాచారం. శంకుస్థాపనలు పూర్తి చేసి పునాది నిర్మాణాలు ఆరంభిస్తే తొలిబిల్లు క్లియర్ చేసి ఓటు బ్యాంకుగా చేసుకోవాలని అధికార పార్టీ తహతహలాడుతుంది. ఈనేపథ్యంలో వీటి శంకుస్థాపనలపై అధికారులపై తీవ్ర వస్తున్నట్లు చెబుతున్నారు.

సంపాదకీయం

ఎన్నికలకు వేళాయె...

ఇంకా వేసవి కాలం రాకముందే దేశంలోనూ, రాష్ట్రంలోనూ, ఎన్నికల వేడి ప్రారంభమైంది. నిర్ణీత సమయానికన్నా రెండు నెలలు ముందుగానే సంక్రాంతి వేళ ఎన్నికల కోడి కూత వినిపించింది. ఎన్నికల మేళాకు తెరలేచింది. సార్వత్రిక ఎన్నికల కోసం మోడీ నేతృత్వంలోని పాలక బీజేపీ జమ్మిచెట్టుపై దాచిన "ఎన్నికల అస్త్రాలను" ఒక్కొక్కటీ కిందకు దింపటం ప్రారంభించింది. మోడీకి గట్టి పోటీ ఇస్తూ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు రాఫెల్ అస్త్రాన్ని సంధిస్తున్నాడు. లోక్‌సభ స్థానాల రీత్యా అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ), బహుజన్ సమాజ్‌పార్టీ (బీజేపీ) అధినేతలు అఖిలేష్ యాదవ్, మాయావతి రానున్న లోక్‌సభ ఎన్నికలకు సీట్ల సర్దుబాటు చేసుకుని మోడీ, అమిత్‌షా ద్వయానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. అందుకు ప్రతిగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా ఓటర్లను ఆకర్షించేందుకు వ్యూహాలు పన్నుతున్నారు. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి మహా కుంభమేళా జరుగుతుంది. 2013లో మహాకుంభ మేళా జరిగింది. ఆరేళ్ల తరువాత అర్ధ కుంభమేళా నిర్వహించడం ఆనవాయితీ. వాస్తవంగా ఈ ఏడాది అర్ధ కుంభమేళా నిర్వహించవలసి వుంది. అలహాబాద్‌లో అంతర్భాగంగా ఉన్న ప్రయాగలోని త్రివేణి సంగమం వద్ద పుణ్య స్నానాలు చేసేందుకు కోట్లాది మంది యాత్రికులు వస్తారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలకు తెర తీసింది. అర్ధ కుంభమేళాను మహాకుంభమేళాగా నిర్వహించాలని యోగి ఆదిత్యనాథ్ నిర్ణయించి, ఇందుకోసం రూ.4,236 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు. గత బడ్జెట్‌తో పోల్చితే ఇది భారీగా ఉండటం గమనార్హం. దీనికి ప్రధాన కారణం రానున్న లోక్‌సభ ఎన్నికలే అనడం నిస్సందేహం. ఈ నెల 14న ప్రారంభమైన కుంభమేళా మార్చి 4 వరకు 50 రోజుల పాటు జరుగుతుంది. సార్వత్రిక ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం సమాయత్తమవుతున్న దృష్ట్యా అధికారంలో వున్న పార్టీలు, లేని పార్టీలు కూడా హామీలను, తాయిలాలను కురిపిస్తున్నాయి. అగ్రవర్ణాలలోని పేదలకు (ఆర్థికంగా వెనుకబడిన) విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు, పౌరసత్వం, ట్రిపుల్ తలాక్ బిల్లులను మోడీ ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకొంది. 10 శాతం రిజర్వేషన్ల బిల్లు మాత్రం రాజ్యసభలో కూడా ఆమోదం పొందింది. మిగతా రెండు బిల్లులు రాజ్యసభలో పెండింగులో పడ్డాయి. దేశ వ్యాపితంగా లోక్‌సభ ఎన్నికల ప్రక్రియను మే చివరి వారం లోగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో రెండు దశల్లో తెలంగాణలో ఒకే దశలో ఎన్నికలు నిర్వహించే అంశంపై ఎన్నికల సంఘం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికల సన్నద్ధతను పరిశీలించడానికి ఈనెల 21 నుండి కేంద్ర ఎన్నికల సంఘం బృందాల వారీగా అన్ని రాష్ట్రాల్లో పర్యటించనుంది. ఆ తరువాత ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చి మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడానికి తుది నిర్ణయం తీసుకోవాలన్న ఆలోచనలో ఎన్నికల సంఘం ఉంది. లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతపై అన్ని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులతో కేంద్ర ఎన్నికల సంఘం రెండు రోజుల పాటు సమీక్షించింది. ఈ సందర్భంగా పలు మార్గదర్శకాలను జారీ చేయడం హర్షించదగ్గ పరిణామం. పోలింగ్ సమయంలో ఓట్ల గల్లంతుపై ఆరోపణలు ప్రతి ఎన్నికల సమయంలో వస్తున్నందున దీనిపై ఓటరులో చైతన్యం కోసం ఈ నెల 25, 26 తేదీల్లో దేశ వ్యాప్తంగా ప్రచారం నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో పూర్తి స్థాయిలో వీవీ ప్యాట్‌లను అందుబాటులోకి తెచ్చింది. అన్ని రాష్ట్రాల్లో మూడవతరం ఓటింగ్ యంత్రాలను వినియో గించింది. గత లోక్‌సభ ఎన్నికల (2014లో) సందర్భంగా మార్చి ఐదో తేదీన కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూలును ప్రకటించి, 14న ప్రకటన జారీ చేసింది. తొమ్మిది దశల్లో పోలింగ్ నిర్వహించింది. ఏప్రిల్ 7వ తేదీన తొలి దశ పోలింగ్ జరగ్గా, మే 12న తుది విడత పోలింగ్ జరిగి, మే 16న ఓట్ల లెక్కింపు చేపట్టి, 28వ తేదీన నాటికి ఎన్నికల ప్రక్రియను సంపూర్ణంగా పూర్తి చేసింది. ఈసారి కూడా మే 24 నాటికి పూర్తి చేయాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. అయితే, లోక్‌సభకుగానీ, రాష్ట్రాల శాసన సభలకు గానీ ఎన్నికలు జరిగిన ప్రతి సందర్భంలోనూ ఎలక్ట్రానిక్ ఓటింగు యంత్రాల (ఈవీఎంలు) పనితీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అటువంటి ఆరోపణలకు తావులేని విధంగా కేంద్ర ఎన్నికల సంఘం ముందస్తు చర్యలు చేపట్టవలసిన అవసరం, బాధ్యత ఉంది. మరో ముఖ్యమైన అంశం ఓటర్ల పేర్లు గల్లంతు కావడం. దీన్ని నివారించడానికి అన్ని రాష్ట్రాల్లో కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర విభాగాలు 1950 నంబరుతో కాల్ సెంటర్లు నిర్వహిస్తున్నాయి. ఈ నంబరుకు ఫోన్ చేస్తే ఓటుకు సంబంధించిన సమాచారాన్ని తెలియ జేయాలన్నది ఎన్నికల సంఘం వ్యూహం. ఆ వ్యూహాన్ని పకడ్బందీగా అమలు చేసి, ఓటర్లు వారి ఓటు హక్కును ఉపయోగించుకొనే విధంగా చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీతో ఓటర్లను ప్రలోభాలకు రాజకీయ పార్టీలు గురి చేయకుండా కేంద్ర ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి మాజీ ఎన్నికల ప్రధానాధికారి టిఎన్ శేషన్ హయాంను తలపించి, అభ్యర్థుల వెన్నులో ఒణుకు పుట్టించాలి. లోక్‌సభ ఎన్నికలతో పాటుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభకు కూడా ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటికే పాలక తెలుగుదేశం పార్టీ, వైఎస్ఆర్‌సీపీ, జనసేన పార్టీల ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాయి. సీపీఐ, సీపీఎం, ఇతర వామపక్ష పార్టీలు రాజకీయ ప్రత్యామ్నాయ సదస్సులు నిర్వహించి బూర్జువా రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయం కోసం రాజకీయాల్లో మార్పు రావాలని విస్తృతంగా ప్రచారం చేశాయి. ప్రస్తుత రాష్ట్ర శాసనసభలో వామపక్షాలకు ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల సభ నిర్వహణ తీరును రాష్ట్ర ప్రజలు గమనించారు. ప్రతిపక్ష నాయకుడు, వైసీపీ అధినేత తన పాత్రను సముచితంగా నిర్వహించలేక పోయాడన్న విమర్శ కూడా ఉంది. రాష్ట్ర శాసనసభ సమావేశాలు సమస్యలపై కేంద్రీకరణతో అర్థవంతంగా జరగాలంటే వామపక్ష పార్టీల ప్రాతినిధ్యం ఉంటేనే అది సాధ్యమని రాష్ట్ర ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి రావడం శుభపరిణామంగా చెప్పక తప్పదు.

చురక

అయోమయం కూటమంటూ
అసహనం మాటలు
గొంతునిండా మోడీగారి
గెలుపు భయం ఊటలు

అధికారం, విపక్షాలు
అన్ని ఐక్య ఫ్రంటులే
ఒకరినొకరు తిట్టుకున్న
ఓట్ల కొరకు స్టంటులే

- వేల్పుల నారాయణ

విశ్లేషణ

దేశభక్తిని ఓట్ల వ్యాపార సరకుగా మారుస్తున్న బీజేపీ!

ఎం కోటేశ్వరరావు

'ఒక దుర్మార్గుడి అంతిమ ఆశ్రయం (దిక్కు) దేశభక్తి ' అని 18వ శతాబ్దపు బ్రిటన్ రచయిత శామ్యూల్ జాన్సన్ చేసిన వ్యాఖ్య కొందరి విషయంలో నిజమే అనిపిస్తోంది కదూ! మన దేశాన్ని ఆక్రమించి మనలను పాలించిన మొఘలాయీ, బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన వారిని దేశభక్తులు, జాతీయ వాదులు అని పిలిచారు, జనం గౌరవించారు. స్వాతంత్ర్యం వచ్చి మనలను మనమే పాలించుకుంటున్నాం. బ్రిటీష్ వారి కాలంలో వారితో చేతులు కలిపిన వారి వారసులు ఇన్ని దశాబ్దాల తరువాత మేమే అసలు సిసలు జాతీయవాదులం, దేశభక్తిలో మాకు సాటి లేదు, దానిలో 24గంటలూ మునిగి తేలుతున్నాం, మాతో మునగని వారందరూ దేశద్రోహులే అంటున్నవారిని ఏమని పిలవాలి ?

అవును నిజం ! ఇప్పటి వరకు ఎస్ సర్ లేదా ఎస్ మిస్, ప్రెజెంట్ సర్ లేదా మిస్ లేదా మేడం అన్న అందరినీ వారికి తెలియకుండానే దేశద్రోహుల ఖాతాలో జమ చేసేందుకు పూనుకున్నారు. దానిలో భాగంగానే హాజరు వేసే సమయంలో జై హింద్ లేదా జై భారత్ అని చెప్పాలట. ఎస్ సర్ అన్న వారి కంటే జైహింద్ అన్న వారికే గుజరాత్ టీచర్లు రాబోయే రోజుల్లో సర్టిఫికెట్లు ఇవ్వాల్సి వుంటుంది. జై హింద్ అనని వారు దేశభక్తులు, భావి భారత పౌరులు కాదు, దేశవ్యతిరేకులు. పిచ్చి ముదురుతోంది. కొత్త భక్తుడికి పంగనామాలెక్కువ అన్నట్లు దేశభక్తి లేదా బ్రిటీష్ వ్యతిరేక జాతీయవాదంతో ఏమాత్రం సంబంధం లేని వారి వారసులు ఇప్పుడు కొత్త దేశభక్తుల అవతారం ఎత్తారు. తాజాగా గుజరాత్ బిజెపి సర్కార్ జైహింద్, జై భారత్ ఆదేశాలు జారీ చేసింది. చిన్న వయస్సు నుంచి పిల్లలకు జాతీయ వాదంలో తర్ఫీదునిచ్చేందుకు తామీ ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నది.

జైహింద్, భారత్ అంటే తప్పేమిటి అన్నది వెంటనే వచ్చే ప్రశ్న. తప్పేమీ లేదు. అనేక యుద్ధాల్లో ప్రాణాల ర్పించిన మన సైనికులు బడుల్లో హాజరు కోసం జై హిందు అనలే, అయినా సైన్యంలో చేరారా లేదా, వారికి దేశభక్తి లేకుండానే అలా నడుచుకుంటూ వెళ్లారా? సింధు నాగరికత వర్ధిల్లిన ప్రాంతాన్ని పరదేశీయుల పలుకు నుంచి వచ్చిన హిందు పదంతో ఎవరికీ అభ్యంతరం లేదు. హిందూ మతానికి దేశానికి పెడుతున్న లంకెతోనే వస్తున్న ఇబ్బంది. జర్మన్ హిట్లర్ కూడా తనది జాతీయ సోషలిస్టు కార్మిక పార్టీ అని చెప్పుకొని ఆ పేరుతో చరిత్రలో కనీవిని ఎరుగని మారణకాండకు పాల్పడ్డాడు. నాజీల మేడిపండు జాతీయ సోషలిజం అవగాహనను ప్రతి విద్యార్థి ఆమోదిం చాలని వత్తిడి చేశారు. వ్యతిరేకించిన పిల్లలను విడిగా వుంచి భయపెట్టారు. అతగాడి భావజాలాన్ని అరువు తెచ్చుకున్న ఆర్ఎస్ఎస్, దాని సృష్టి బీజేపీ, ఇతర సంస్థలన్నీ తాము జాతీయవాదులని తామే అసలు సిసలు జాతీయ వాదులమని, తమది హిందూత్వ జాతీయవాదమని, ఒక జీవన విధానమని ఒళ్లంతా రాసుకొని పూరేగుతున్నారు. దాన్ని వ్యతిరేకించే వారే కాదు, అంగీకరించని వారిని కూడా దేశద్రోహులని ముద్రవేస్తున్నారు కనుకనే అభ్యంతరం తెలియచేయాల్సి వస్తున్నది. 1947కు ముందు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా మనమంతా జాతీయవాదులం, ఇప్పుడు మనం భారతీయులమని గర్వంగా చెప్పుకోవచ్చు తప్ప భారత జాతీయవాదులం అంటే మిగతా దేశాలు ఒప్పుకోవు. ఈ తరహా జాతీయవాదంతోనే గతంలో జర్మనీ, ఇటలీ, జపాన్ వంటి దేశాలలో హిట్లరు, ముస్సోలినీ, టోజో వంటి నియంతలు తయారై ప్రపంచాన్ని నాశనం చేశారు. వారిని ఆదర్శంగా తీసుకున్న ఆర్ఎస్ఎస్ చెప్పే అఖండ భారత్ అంటే ఆఫ్ఘనిస్తాన్ నుంచి పాకిస్థాన్, బంగ్లాదేశ్,

> ఏది తినాలో ఏది తినకూడదో, ఏది ధరించాలో ఏదికూడదో, ఎవరిని వివాహం చేసుకోవాలో ఎవరిని కూడదో చెబుతున్న కాషాయ దళాలు ఇప్పటికే దేశంలో ఎక్కడ బడితే అక్కడ తామరతంపరగా పుట్టుకు వస్తున్నాయి. గుజరాత్ చర్యలు ఈశక్తులను మరింతగా రెచ్చిపోయేట్లు చేసేవి తప్ప వేరుగాదు. పిచ్చి మరింత ముదిరి పిల్లలందరూ జాతీయ జండా రంగులతో లేదా కాషాయ యూనిఫారాలు వేసుకోవాలని నిర్ణయించినా ఆశ్చర్యం ఏముంటుంది. దేశభక్తి, దేశ ద్రోహాన్ని కూడా ఓట్లవేటలో వ్యాపారంగా మార్చి వేస్తున్నారని గ్రహించటం అవసరం. అందుకే ఒక దుర్మార్గుడి అంతిమ ఆశ్రయం (దిక్కు) దేశభక్తి అన్న శామ్యూల్ జాన్సన్‌ను గుర్తు చేయాల్సి వచ్చింది.

శ్రీలంక, మయన్మార్ వరకు అన్నీ భారత్‌లో భాగమే.

మమ్మల్ని రాజకీయంగా వ్యతిరేకిస్తే అభ్యంతరం లేదుగానీ ప్రతి నిత్యం, ప్రతి సందర్భంలోనూ మీరు మాత్రం మేము చెబుతున్న తరహా దేశభక్తిని నిరూపించు కోవాలనే ఒక అప్రజాస్వామిక అభిప్రాయాన్ని ఆర్ఎస్ఎస్, బిజెపి శక్తులు వ్యాపింప చేస్తున్నాయి. పరిణితి చెందిన ఏ దేశంలోనూ ప్రతిక్షణం ప్రతి ఒక్కరూ దేశభక్తిని బహిరం గంగా ప్రదర్శించాలనే ధోరణి లేదు. అమెరికా విద్యా సంస్థలలో హియర్ (వున్నాను) అంటారు తప్ప జై యుఎస్ఏ లేదా లాంగ్ లివ్ అమెరికా అనరు. వారికి దేశభక్తి లేనట్లా, లేక నేర్పనట్లా ? జర్మనీలో నియంత హిట్లర్‌ను పొగిడే విధంగా టీచర్లను మలచారు. హై హై నాయకా అన్నట్లు టీచరు వచ్చీ రావటంతోనే హిట్లర్ నామ జపం చేయగానే పిల్లలందరూ పాలోమంటూ ప్రతిజ్ఞ చేసినట్లుగా పొగిడే వారు. ఏదైనా అతి చేస్తే లాభం కంటే నష్టమే ఎక్కువ. గోవులనే తీసుకోండి. గోమాత రక్షణ పేరుతో గోగూం డాలను ప్రోత్సహించిన వారిలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఒకరు. ఆ పెద్దమనిషి చర్యలతో పాలివ్వని పశువులకు గడ్డిపెట్టలేని రైతులు వాటిని రోడ్ల మీదకు వదలి వేశారు. ఇప్పుడవి మేతకోసం పంటపొలాల మీద పడుతున్నాయి. గగ్గోలు పెట్టిన రైతులు కొన్ని చోట్ల వాటిని తోలుకుపోయి ప్రభుత్వ పాఠశాలల్లో వుంచి తాళాలు వేశారని వార్తలు. అనేక చోట్ల అవి పంటలను నాశనం చేయకుండా రైతులు పొలాల చుట్టూ కంచెలు వేసుకోవటం, కాపాలా కాయటం చేయాల్సి వస్తోంది. సమాజాన్ని వెనక్కి నడపాలని చూసే వారికి ఇలాంటి అంశాలు ఎదురైనా వాటి నుంచి పాఠాలు తీసుకోకుండా మరింతగా వెనక్కు నడిపేం దుకు చూస్తారు.

సినిమా హాళ్లలో దేశభక్తి నింపేందుకు ఎలాంటి ప్రహసనం నడిచిందో చూశాము. ఎందుకు నిలబడాలని ప్రశ్నించిన వారిని దేశద్రోహులుగా చూసిన అనుభవాలను ఇంకా మరచి పోలేదు. తొలుత ప్రభుత్వ నిర్ణయంగా సినిమా హాళ్ల దేశభక్తిని సమర్ధించిన సుప్రీం కోర్టు తరువాత ఆ నిర్ణయం మీద దాఖలైన అప్పీళ్ల సంద ర్భంలో చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరమైనవి. కాళ్లూ, చేతుల మీద తమ దేశభక్తి ప్రదర్శన చేయాలని జనాన్ని బలవంతం చేయ లేము, జాతీయ గీతం పాడుతున్నపుడు ఒక వ్యక్తి లేచి నిలబడనప్పుడు అతనిలో దేశభక్తి తక్కువని అనుకోకూడదు అని పేర్కొన్నది. అంతే కాదు ప్రభుత్వం సినిమాలకు వచ్చేవారు టీ షర్టులు, పొట్టి నిక్కర్లు వేసుకోకూడదు, అలాంటి దుస్తులతో జాతీయ గీతాలాపన సమయంలో లేచి నిలవటం అవమానించటమే అని నిర్ణయిస్తే పరిస్థితి ఏమిటి అని కూడా సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ఇపుడు గుజరాత్ లేదా ఒకవేళ ఇదేదో ఓట్లు కురిపించేట్లుందే అని రేపటి నుంచి దాన్ని అనుసరించే ఇతర బీజేపీ రాష్ట్రాలలో కూడా అమలు చేస్తే ఇదే పరిస్థితి ఎదురవు తుంది. గతంలో కేరళ కేసులో జాతీయ గీతాలాపన సందర్భంగా నిబంధనల ప్రకారం లేచి నిలబడాలి తప్ప గీతాన్ని ఆలపించాలన్న నిబంధన ఎక్కడా లేదని, ఆలపించని కారణంగా ఎవరిమీదైనా చర్యలు తీసుకోవటం చెల్లదని సుప్రీం కోర్టు చెప్పింది. గుజరాత్ సర్కార్ లాజిక్కు ప్రకారం చూస్తే దేశంలో ఫోన్లు, ప్రతి కార్యాలయం, ఫ్యాక్టరీ, బజారుల్లో కూడా దేశభక్తిని నేర్పేందుకు జై హింద్, జై భారత్ అని పలకరిం చుకోవాల్సి వుంటుంది.

ఏది తినాలో ఏది తినకూడదో, ఏది ధరించాలో ఏదికూడదో, ఎవరిని వివాహం చేసుకోవాలో ఎవరిని కూడదో చెబుతున్న కాషాయ దళాలు ఇప్పటికే దేశంలో ఎక్కడబడితే అక్కడ తామరతంపరగా పుట్టుకు వస్తున్నాయి. గుజరాత్ చర్యలు ఈశక్తులను మరింతగా రెచ్చిపోయేట్లు చేసేవి తప్ప వేరు గాదు. పిచ్చి మరింత ముదిరి పిల్లలందరూ జాతీయ జండా రంగులతో లేదా కాషాయ యూనిఫారాలు వేసుకోవాలని నిర్ణయించినా ఆశ్చర్యం ఏముంటుంది. దేశభక్తి, దేశ ద్రోహాన్ని కూడా ఓట్లవేటలో వ్యాపారంగా మార్చివేస్తున్నారని గ్రహించటం అవసరం. అందుకే ఒక దుర్మార్గుడి అంతిమ ఆశ్రయం (దిక్కు) దేశభక్తి అన్న శామ్యూల్ జాన్సన్‌ను గుర్తు చేయాల్సి వచ్చింది.

ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీ పొత్తుతో

మోడీకి నిద్రలేని రాత్రులు..

సుశీల్ కుట్టి

ఉత్తరప్రదేశ్‌లో రాజకీయ బద్ధశత్రువులైన సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) సార్వత్రిక ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయించాయి. రాష్ట్రంలోని మొత్తం 80 లోక్‌సభ స్థానాలు ఉండగా చెరో 38 స్థానాలలో పోటీ చేయాలన్న ఏకాభిప్రాయానికి వచ్చాయి. బీజేపీని గద్దెదించాలని, మోడీకి నిద్రలేని రాత్రులు ఇవ్వాలని సంకల్పించాయి.

ఎస్పీ, బీఎస్పీ మహాగట్బంధన్‌తో ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఉత్సాహంగా ఉన్నారు. బీఎస్పీ అధినేత్రి మాయావతి ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోనప్పటికీ ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, ఏఐసీసీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న అమేథీ, రాయ్‌బరేలీ స్థానాల్లో పోటీ చేయబోమని ఎస్పీ, బీఎస్పీ ప్రకటించాయి.

గట్బంధన్‌లో స్థానం లభించకపోవడంపై కాంగ్రెస్ ఘాటుగానే స్పందించింది. తమను తక్కువగా అంచనా వేయొద్దంటూ స్పష్టం చేసింది. ఎస్పీ-బీఎస్పీలు గట్బంధన్ ఏర్పడే క్రమంలో తమ పార్టీకి ప్రాధాన్యత దక్కకపోవడంతో కాంగ్రెస్ అవమానంగా భావించినప్పటికీ 'మేం దీనిని అధిగమించగలం' అన్నట్లు వ్యవహరిస్తోంది. ఒంటరిగా ఎన్నికల బరిలోకి దిగేలా ప్రయత్నాలు చేస్తోంది. ఈ పరిణామాన్ని బీజేపీ ఊహించినప్పటికీ 'ఆందోళనపడాల్సిన పనిలేదు. గెలుపు ఆత్రుతతో పొత్తుపెట్టుకున్నారు' అంటూ పార్టీ శ్రేణులకు అభయమిస్తూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోంది.

ఈ పొత్తు ఎస్పీకి కలిసి వస్తుందన్న అంచనాలు ఉన్నాయి. అఖిలేష్ యాదవ్ ఇక్కడ విజేతగా కనిపిస్తున్నారు. ఎందుకంటే మాయావతి లేకపోతే 2014లో బీఎస్పీకి పట్టిన గతే ఈసారి ఎస్పీకీ పట్టేది. అత్త-అల్లుడి జోడి ఎదురులేని శక్తిగా ఆవిర్భవిస్తోందన్న అంచనాలు ఉన్నాయి. ఇందుకు గోరఖ్‌పూర్, ఫుల్‌పూర్ ఉప ఎన్నికల పరిణామాలే ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ రెండు స్థానాలు బీజేపీకి కంచుకోటలు. కాగా, ఓబీసీ-ఎస్సీ సంఘటితం అన్న దృఢమైన లక్ష్యమే ఎస్పీ, బీఎస్పీని ఎన్నికలనే ఈ నదిని దాటిస్తుంది. బీజేపీ ఏ మాయో చేస్తే తప్ప ఎస్పీ, బీఎస్పీ గట్బంధన్‌కు తిరుగు ఉండదు.

అఖిలేష్, మాయావతి ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. అవతలి ఒడ్డు కనిపిస్తుండటంతో తమ పడవకు ఎక్కడా చిల్లులు లేకుండా లీకేజీకి అవకాశం లేకుండా.. ఎవ్వరూ ఆక్రమించుకునే వీలు లేకుండా చూసుకుంటే చాలనుకుంటున్నారు. మరోపక్క మోడీ-షా-యోగీల స్టీమర్ స్తబ్ధ జలాల్లో ఉంది. ఈ నేపథ్యంలో ఈబీసీలకు 10శాతం కోటా తప్ప వారు చేయగలిసది ఏమీ లేదు. రాముడిపై పూర్తి భారం మోపేందుకు మోడీ సిద్ధంగా లేరు. నమ్మిన బంటు షా ఆయన మాటను కాదనరు. భక్తజనాన్ని ప్రేరేపించేందుకు మాత్రమే యోగి ఆదిత్యనాథ్ పనికొస్తారు.

ఎస్పీ, బీఎస్పీల "సమాన భాగస్వాములు" ఆలోచన బీహార్‌లో బీజేపీ-జేడీ(యూ) అనుసరించిన ఫార్ములా నుంచి వచ్చి ఉంటుంది. ఈ సర్దుబాటుతో ఇరు వర్గాలకు ప్రయోజనమే. ఎన్నికల ముందుగానీ, తర్వాతగానీ అసంతృప్తి వ్యక్తంచేసే అవకాశం ఉండదు. ఓట్ల బదిలీ నిజాయితీగా, పారదర్శకంగా సాగుతుంది. ఈ నేపథ్యంలో రెబల్ అభ్యర్థులు కూడా ఆచితూచి వ్యవహరిస్తారు.

ఈ క్రమంలో అజిత్ సింగ్‌కు చెందిన ఆర్ఎల్‌డీ పార్టీ పేరు వినిపించడం లేదు. అలలు లేక గాలి లేక ఆర్ఎల్‌డీ అనే ఈ చిన్న పడవకు పాట్లు తప్పవు. మరోవైపు ఎస్పీ-బీఎస్పీ గట్బంధన్ మంచి ఊపుమీద ఉంది. మోడీ ప్రభుత్వాన్ని కూల్చేస్తామన్న విశ్వాసంతో ముందుకు కదులుతోంది. తమ పొత్తు విషయాన్ని ప్రకటించిన ఇరు పార్టీల నాయకులు .. మోడీకి ఆయన శిష్యుడు అమిత్‌షాకు నిద్రలేని రాత్రులిస్తామంటూ దీమా వ్యక్తంచేశారు.

కాంగ్రెస్‌తో ప్రయోజనం ఉండదని భావించిన ఎస్పీ, బీఎస్పీ అధినేతలు ఆ పార్టీకి గట్బంధన్‌లో స్థానం కల్పించలేదు. యాదవ్, దళిత ఓట్ల తరహాలో కాంగ్రెస్ ఓట్ల బదిలీ సాధ్యం కాదు. ఆ రెండు వర్గాలు తమ నేతలు ఏది చెబితే అదే చేస్తాయి.

కాంగ్రెస్ పార్టీ పాలనతో ఎవరికీ ప్రయోజనం లేదని, కాంగ్రెస్ నుంచి ఓట్ల బదిలీ జరగదని, దాంతో ఎలాంటి లబ్ధి చేకూరదని, తమ రాజకీయ లక్ష్యాలను దెబ్బతీసేందుకు ఏ పార్టీని అనుమతించబోమని మాయావతి కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. తన రాజకీయ లక్ష్యం (ప్రధాని పదవి) గురించి సంకేతాలు ఇచ్చారు. అఖిలేష్ మాట్లాడుతూ 'మా కూటమి రాజకీయ విప్లవం. బీజేపీ మత, కులపరమైన రాజకీయాల నుంచి దేశానికి, రాష్ట్రానికి విముక్తి కల్పించేందుకే చేతులు కలిపాం. బీజేపీని, దాని అహంకారాన్ని మట్టికరిపించేందుకు ఈ కూటమి కీలకం. మా కార్యకర్తలలో చిచ్చు పెట్టేందుకు బీజేపీ తప్పక యత్నిస్తుంది' అని అన్నారు. అలాగే, 'మాయావతిని అవమానిస్తే నన్ను అవమానించినట్లే' అంటూ మాయవతి ప్రత్యక్షంగా బీజేపీ పరోక్షంగా వినేలా చెప్పారు.

2014లో యూపీలోని 80 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ 71 స్థానాలను గెలుచుకుంది. దాని మిత్రపక్షమైన అప్నాదళ్‌కు రెండు, ఎస్పీకి ఐదు, కాంగ్రెస్‌కు రెండు స్థానాలు దక్కాయి. బీఎస్పీ అసలు ఖాతా తెరవలేదు. ఈసారి ఎస్పీ, బీఎస్పీ 'గట్బంధన్' గేమ్‌ఛేంజర్‌గా పరిణమిస్తుందని, లెక్కలు తారు మారవుతాయన్న అంచనాలున్నాయి.

ఇ-మెయిల్

అయ్యప్ప మకరజ్యోతి మానవ కల్పితమే !!

దేశంలో ఎంతమంది పాతదేవుళ్లు వున్నా కొత్తకొత్త దేవుళ్లు పుట్టుకొస్తూనే వున్నారు. బ్రహ్మ, విష్ణు, శివుడునేడు పాపం పాతదేవుళ్లైపోయారు. పాతిక ముప్పయి సంవత్స రాలకి ముందు ఆంధ్రాలో ఈ అయ్యప్పలు, షిర్డిసాయిబాబా లను తలచుకున్న వాడే లేడు. మరి ఈరోజు ఎక్కడచూచినా ఆ ఇద్దరు దేవుళ్లే కనిపిస్తున్నారు.

జనవరి 14 సంక్రాంతిరోజు అయ్యప్ప మక్షర జ్యోతి రూపంలో కనిపిస్తాడని భక్తులు గుంపులుగా వెళ్ళి దర్శనం చేసుకుంటారు. శబరిమలైలో అయ్యప్ప గుడిదగ్గరలో ఆ రోజు సాయంకాలం చీకటి పడినతర్వాత జ్యోతిరూపంలో ఒక రెండు నిమిషాలు దగ్గరలోని పొన్నంబలమేడు కొండ మీద ఈ వెలుగు కనిపిస్తుంది. అదే అయ్యప్పజ్యోతి అనుకొని భక్తులు తరిస్తారు. ఈ జ్యోతిని చూడటానికి వెళ్ళిన భక్తులు 2011లో అక్కడ తొక్కిసలాట జరిగి వంద మందికిపైగా చనిపోయారు. వీరిలో 54 మంది మన ఆంధ్రావారే ! అసలు అయ్యప్పకథ ఇద్దరు మగవాళ్ళకి పుట్టాడని పురాణాలు ఘోషిస్తున్నాయి. మగవాళ్ళకి ఎలా పుట్టాడనేది పక్కన పెడదాము. అసలు ఈ జ్యోతి నిజమేనా? గుడి దగ్గరలో గల పొన్నం బలమేడులో గిరిజనులు జీస్తున్నారు. రాత్రివేళల్లో చలి కాచుకోటానికి మంటలు వేసుకునేవారు. అప్పట్లో ఈ మంటలు దేవస్థానం వారికి అర్థం కాలేదు. తరువాత గుడివారు అక్కడి గిరిజనులను ఖాళీ చేయించి, దేవస్థానంవారు, ఎలక్ట్రికల్ డిపార్టుమెంటువారు కలసి ఒకటైం అనుకొని ఈ తంతు ఏర్పాటు చేశారు. దానికి అయ్యప్పజ్యోతి అనిపేరుపెట్టి భక్తులను మోసం చేస్తూ వచ్చారు. ఈ విషయాన్ని అక్కడి హేతువాదులు డెబ్బై ప్రాంతంలోనే బయటపెట్టారు. అయితే తప్పనిసరి పరిస్థితులలో 2008లో కేరళ దేవాదాయశాఖా మంత్రి, గుడికమిటీ వారు కలసి ఆ జ్యోతి మానవకల్పితమేనని పత్రిక ప్రకటన చేశారు. జోతి గుట్టుకాస్త రట్టు అయింది. అయినా కూడా మానవకల్పితమేనని ఒప్పుకుంటూనే, మరలా గుళ్లోహారతి ఇస్తే కళ్ళకి అద్దు కోవటంలేదా అలాగే ఇది అని సర్దించుకుంటూ తమ పబ్బం గడుపుకుంటున్నారు గుడి కమిటీవారు. మకరజ్యోతి చూడాలనితపన పడేవారికి ఒక్కటే విజ్ఞప్తి మీరు చూసేది మనుషులు వెలిగించే మంటలు మాత్రమే. ఒకసారి ఏమిజరిగిందంటే ! గుడివారు జ్యోతివెలిగించారు. భక్తులు దండాలు పెట్టుకున్నారు. బాగానేవుంది. అయితే గుడివారువెలిగించిన స్థలానికిదగ్గరలోనే, హేతువాదులు వెంటనే అవ్వాయ్ సువ్వాయిలు కాల్చి మంటలు వేశారు. గుడికమిటీ వారికి అర్థంకాక, భక్తులకు ఏమిచెప్పాలో అర్థంకాక దేవుడు వివిధరూపాలలోదర్శనం ఇస్తున్నాడని చెప్పు కున్నారు. కనుక భక్తులు అలోచించండి.మిమ్ములను గుడివారు తమ ఆదాయంకోసం ఎలామోసంచేస్తున్నారో చూడండి. కళు తెరవండి.

- మేఘమాల, ఒంగోలు.



"సైనికుల త్యాగాలు ఎనలేనివి, అజరామరం"

కామిడి సతీష్‌రెడ్డి

ఫీల్డ్ మార్షల్ కేఎం కరియప్ప 1899 జనవరి 28న జన్మించారు. భారతీయ సైనికులతో కూడిన మొదటి బ్యాచ్‌లో చేరి 1942లో లెఫ్టినెంట్ కల్నల్ అయ్యారు. 1949లో కమాండర్ ఇన్ చీఫ్ అయిన తొలి భారతీయుడు. అప్పటికీ కమాండర్ ఇన్ చీఫ్‌గా ఉన్న బ్రిటిష్ దేశస్థుడు సర్.రాయ్ బాచల్ నుండి 1949 జనవరి 15న కమాండర్ ఇన్ చీఫ్‌గా కరియప్ప బాధ్యతలు స్వీకరించారు. అందుకు గుర్తుగా జనవరి 15వ తేదీన భారతీయ సైనిక దినోత్సవంగా నిర్వహిస్తారు. ఆ రోజున దేశ రాజధానిలో ఆరు ఆర్మి కమాండ్ ప్రధాన కార్యాలయాలలో పెరేడ్లు, ఇతర మిలటరీ షోలు నిర్వహిస్తారు. 2010 జనవరి 15న ఢిల్లీలో 62వ ఇండియన్ ఆర్మీడేని నిర్వహించారు. మన దేశ ప్రజల పరిరక్షణ కోసం జీవితాలు త్యాగం చేసిన అమరసైనికులకు ఈ సందర్భంగా నివాళులు అర్పిస్తారు. భారతదేశ ప్రజాస్వామ్యం కోసం స్వాతంత్ర్య సమరయోధులు ఎలాంటి పాత్రను పోషించారో, భారతసైన్యం కూడా అంతే పాత్ర పోషించింది. జనరల్ మాదప్ప కరియప్ప స్వదేశీయులతోను, బ్రిటిషర్లతోనూ సత్సంబంధాలు కల్గివుండి జనరల్ రాయ్ బచ్చర్ నుండి తొలి కమాండర్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సైన్యం సరిహద్దులలోనూ, ప్రకృతి వైపరీత్యాలలోనూ అనేకవిధాలా పోరాడింది. పోరాడుతూనే ఉంది. భారతీయ సైన్యం చరిత్ర గొప్పదే. మహాభారత కాలంలో కురుక్షేత్ర సంగ్రామంలో దాదాపు నాలుగు లక్షల మంది యుద్ధంలో పాల్గొన్నారు. అశ్వాలు, ఏనుగులు, రథాలపై యుద్ధాలు కొనసాగించడమేకాక నేలపై నుండి కూడా యుద్ధం చేశారు. పురాతన కాలంలో విశ్వశాంతి, ధర్మపరిరక్షణకోసం అనేక యుద్ధాలు జరిగేవి. భారతీయ రాజకీయ చరిత్రలో చెప్పుకోదగ్గ తొలి చొరబాటు క్రీ.పూ 327 లో అలెగ్జాండర్ ఆధ్వర్యంలో గ్రీకులది. చంద్రగుప్తుల మౌర్యులు కాలంలోని సైన్యాన్ని గుర్తుకు తెచ్చు కోవాలి. ఆనాటి సైనిక చరిత్రకు అర్థశాస్త్రం ఓ దర్పణంగా నిలుస్తుంది. కలింగ రాజుల కాలంలో యుద్ధభూమిలోకి ఏనుగులు వచ్చాయి. ఇవి 17వ శతాబ్దిదాకా సాగాయి. మౌర్యులు కాలంలో శాంతిస్థాపన జరిగింది. గుప్తుల కాలంలో మన దేశానికి ప్రపంచ గుర్తింపు వచ్చింది. ఈ విధంగా రాజ్యాల కోసం, రక్షణ కోసం సైన్యం, సైనిక అవస రాలు, ఆయుధాలు పెరుగుతూ వచ్చాయి.

తదనంతరం బ్రిటిష్ ఆధిపత్యం జరిగింది. స్వాతంత్ర్యం అనంతరం భారతీయసైన్యం శక్తిగా ఎదిగింది. మన సైన్యానికి ప్రతిభా పాటవాలు మెండు. శత్రు దేశాలతో పోరాడడంలో మన భారతీయ సైన్యం అసమాన ధైర్యసాహసాలను ప్రదర్శిస్తుంది. పాకిస్తాన్, శత్రుదేశాలతో జరిగిన పోరాటాలలో అనేకమంది సైనికులు అమరులవుతున్నారు. అధునాతన ఆయుధాలతో, నిత్యం అప్రమత్తంగా, దేశాన్ని కంటికి రెప్పలాగా కాపాడుతున్న భారతీయ సైనికుల శక్తి ఎనలేనిది, వెలకట్టలేనిది. వారిని గౌరవిద్దాం, వారి సేవలను స్మరిద్దాం వారి కుటుంబాలకు (అమరులు) అండగా నిలుద్దాం.

(నేడు భారతీయ సైనిక దళం (ఆర్మీ) దినోత్సవం సందర్భంగా)

విశాలాంధ్ర

బతుకు
The Life

మంగళవారం
15 జనవరి 2019

భారతదేశంలో సంక్రాంతి పండుగ గురించి తెలియని వారుండరేమో బహుశా. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఈ పండుగను వారి వారి సంప్రదాయాలకి అనుగుణంగా పెద్ద ఎత్తున జరుపుకుంటారు. కారణం పంట చేతికి రావడంతో నట్టింట్లో ఉన్న ధాన్యరాసులను చూసుకొని మురిసిపోతూ వారి సంప్రదాయాలను ప్రతిబింబించేలా జరుపుకుంటారు. హిందువులు జరుపుకునే పండగల్లోనే సంక్రాంతికి విశిష్ట స్థానం ఉంది. సంక్రాంతి అంటే సంక్రమణం. సంవత్సర కాలంలో సూర్యడు నెలకి ఒక రాశిలో సంచరిస్తాడు. అదే విధంగా ఆంగ్ల సంవత్సరం జనవరి వచ్చేసరికి మకర రాశిలో ప్రవేశిస్తాడు. అందుకే ఈ పండుగను మకర సంక్రాంతి లేదా మకర సంక్రమణం అంటారు. దేశంలోని అన్ని రాష్ట్రాల వారు ఈ పండుగను రకరకాల పేర్లతో జరుపుకుంటారు. మరి ఆ పండగలేంటో వాటి విశేషాలేంటో తెలుసుకుందాం.

సంక్రాంతి - సంప్రదాయాలు





భోజ్

మకర సంక్రాంతి రాజస్థానీలు జరుపుకునే పండుగల్లో ముఖ్యమైనది. పండగరోజున రాజస్థానీ ప్రత్యేక వంటకాలైన పీనీ, టిల్ పత్తె, గాజక్, ఖీర్, గీర్వర్, పకోడి, పువా, టిల్ లడ్డులను తయారు చేస్తారు. పెళ్ళయిన ఆడపిల్లలను వారి తల్లిదండ్రులు ఈ పండగకు ఆహ్వానించి అందరు కలిసి భోజనం చేస్తారు. దీన్ని సంక్రాంతి భోజ్ అంటారు. యువకులు, పిల్లలకు ఇక్కడ పతంగుల పోటీలు నిర్వహిస్తారు.

వాసి ఉత్తరాయణం

మకర సంక్రాంతిని గుజరాత్‌లో ఉత్తరాయణం అంటారు. మొదటి రోజును ఉత్తరాయణం, రెండవ రోజును వాసి ఉత్తరాయణం అంటూ పతంగుల పండుగలు జరుపుకుంటారు. ఉత్తరాయణాన్ని అస్వాదిస్తూ రకరకాల కూరగాయలతో వంటకాలు తయారు చేస్తారు. పెద్ద నగరాల్లో పతంగుల పోటీలు నిర్వహిస్తారు.

మాఘ సాజీ

సిమ్లా జిల్లాలో మకర సంక్రాంతిని మాఘ సాజీ అని పిలుస్తారు. ఈ పండుగ రోజున హిందువులు ఉదయన్నే సంప్రదాయ పద్ధతిలో స్నానమాచరించి బంధువు లతో కలిసి నెయ్యితో తయారు చేసిన కిచిడిని తీసుకుంటారు. జానపద గీతాలు ఆలపిస్తారు.

సిదా...మనానా!

ఈ రాష్ట్రాల వారు సంక్రాంతిని ముఖ్యమైన పండుగగా జరుపుకుంటారు. ఈ పండుగనాడు నెయ్యితో చూర్మా, హల్వా, ఖీర్‌లను ప్రత్యేకంగా తయారు చేస్తారు. ప్రతి సోదరుడు కూడా వారి తోడబుట్టిన అక్కచెళ్ళెలను పిలిచి కొత్త వస్త్రాలను బహుకరిస్తారు. ఈ సంప్రదాయాన్ని వాళ్ళు 'సిదా' అన్ని పిలుస్తారు. మహిళ తన అత్తమామలకు బహుకరించే కానుకలను మనానా అంటరు. ఈ పండుగ సమయంలో జానపద గీతాలకు, పతంగులకు విశిష్ట స్థానం ఉంటుంది.





పౌష్

బెంగాలీలు మకర సంక్రాంతిని పౌష్ సంక్రాంతి అని పిలుస్తారు. తాజాగా పండించిన ధాన్యాన్ని పిండిగా మార్చి రకరకాల వంటకాలు తయారు చేస్తారు. దీనితో పాటు బియ్యం, కొబ్బరి, పాలుతో తయారు చేసిన వంటకాన్ని పితా అని పిలుస్తారు. కలకత్తాలో వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతుల ఇస్తారు.

సాక్రాత్

బీహార్ జార్ఖండ్ రాష్ట్రాల్లో మకర సంక్రాంతిని సాక్రాత్ అని పిలుస్తారు. ఈ సమయంలో పవిత్ర నదుల్లో స్నానమా చరిస్తారు. ఈ సమయంలో దహీ చౌడా అనే వంటకాన్ని తయారు చేస్తారు. దీన్ని మహిళలు గుంపులుగా కూడా ఎక్కువగా తయరు చేస్తారు. రాత్రి సమయంలో కిచిడి తయారు చేస్తారు.

మాంగీ

పంజాబ్‌లో మకర సంక్రాంతిని మాంగీ అని పిలుస్తారు. ఈ పండగ రోజును అందరూ సూర్యోదయానికి ముందే నదిలో స్నానం చేయడం వీరి సంప్రదాయం. ఈ రోజున ఇంటిని నువ్వుల నూనెతో చేసిన దీపాలతో అలంకరిస్తారు. ఇలా చేయడం వల్ల పాపాలు తొలుగుతాయని వారి నమ్మిక. ఈ మాంగీ రోజున శ్రీముక్‌స్తర్ సాహెబ్ మేళాను నిర్వహిస్తారు. ఈ మేళాలో వారి సంప్రదాయ నృత్యమైన బాంగ్రాను ప్రదర్శిస్తారు. పాలు, చెరుకురసం, బియ్యంతో ప్రత్యేకమైన ఖీర్‌ను తయారు చేస్తారు.

థాయ్, మట్టు

తమిళులు ఈ పండుగను పొంగల్‌గా పిలుస్తారు. వీరు ఈ పండుగను నాలుగు రోజుల జరుపుకుంటారు. మొదటి రోజును భోగి, రెండవ రోజు థాయ్ పొంగల్, మూడోవ రోజున మట్టు పొంగల్, నాల్గవ రోజున పొంగల్‌గా నిర్వచిస్తారు. ఈ పండుగ రోజుల్లో బియ్యంతో తయారు చేసిన పిండి వంటలను సూర్యుడుకు సమర్పిస్తారు.

పక్షుల పలకరింపు....

కుమావున్ ప్రాంతంలో మకర సంక్రాంతిని ఎక్కువగా జరుపుకుంటారు. ఈ పండుగ రోజుల్లో తియ్యటి వంటకాలను తయారు చేస్తారు. ఈ పండుగ సమయంలో వేల సంఖ్యలో పక్షులు కొండ ప్రాంతాలకు తరలి రాస్తాయి. వాటి కిలకిలారావాలు ఈ పండుగ శోభను మరింత పెంచుతాయి.

సుగి

ఈ రాష్ట్రంలో సుగి లేదా రైతుల పండుగగా భావిస్తారు. ఈ పండగ రోజును చాలా గొప్పగా చేస్తారు. ఆడపిల్లలు పట్టు బట్టలు ధరించి వారికి ప్రియమైనటువంటి వారి ఇంటికి వెళ్ళి సంప్రదాయ వంటలను ఇస్తారు. ఈ సంప్రదాయాన్ని ఇల్లు బిరోధు అంటారు. పంటలు చేతికి రావడంతో రైతులు చాలా ఆనందంగా ఈ పండుగను జరుపుకుంటారు. ఈ రాష్ట్రంలో అక్కడక్కడ ముగ్గుల పోటీలు నిర్వహిస్తారు. ఈ పండుగ సమయంలో ఆవులను అలంకరిస్తారు. ఈ విధానాన్ని కించు హాయ్‌శివుడు అంటారు.



మాగ్ బిహు

సంక్రాంతిని అస్సాంలో మాగ్ బిహు లేదా భోగాలి బిహు అని పిలుస్తారు. పంట చేతికి వచ్చే నెల కావడంతో ఈ పండుగను ఆనందంగా చేసుకుంటారు. ఈ పండుగను వారు విందులు, మంటలకు చిహ్నంగా భావిస్తారు. అస్సామిల సంద్రాయ ఆటల పోటీలు నిర్వహిసారు. అస్సాం నృత్యం బిహును ప్రదర్శిస్తారు.

హల్దీ, కుంకుమ


మకర సంక్రాంతి రోజున మహారాష్ట్రలో మల్టీకలర్డ్ హల్వాను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటారు. దీని అర్థం తియ్యటి జ్ఞాపకాలను ఒకరికొరకు ఇచ్చి పుచ్చుకోవడం అన్ని అర్థం. ఈ పండగనాడు శరీరానికి నువ్వుల నూనెను పట్టించి తలస్నానం చేస్తారు. ప్రత్యేకంగా గోవాలోని మహిళలు హల్దీ, కుంకుమ కారక్రమాన్ని నిర్వహిస్తారు.

కిచెరీ

మకర సంక్రాంతిని ఉత్తరప్రదేశ్‌లో కిచెరీ అని పిలుస్తారు. వారణాసి, అలహాబాద్, హరిద్వార్ వంటి స్థానాల్లో ప్రజలందరు చేరి నదిలో స్నానాలు చేస్తారు. ఈ స్నానాన్ని ఉపవాసంతోనే చేయాలంటున్నారు. లడ్డు, భోజ్‌పురి లడ్డులను తయారు చేస్తారు. పతంగులు ఎగురవేయడం ఈ పండగలో భాగంగా భావిస్తారు.

మకర చౌలా

ఒడిశా ప్రజలు మకర సంక్రాంతిని మకర చౌలా అని పిలుస్తారు. కొత్తగా పండించిన ధాన్యం, అరటి, కొబ్బరి, బెల్లంతో తయారుచేసిన వంటలను సూర్యుడికి సమర్పిస్తారు. ఈ రాష్ట్రంలో ముఖ్యమైన సూర్యదేవాలయం కోణార్క్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



పర్వదిన పలహారాలు!

నెలరోజుల ధనుర్మాసం ముగింపు దశకు వచ్చింది. సంక్రాంతి వేడుక సమయం ఆసన్నమైంది. పండగ అంటే ముందుగా గుర్తుకొచ్చేది వంటలు. మరి ఈ పర్వదినాల్లో ఏం వండాలో నిర్ణయించకున్నారా? పండగ కదా చేసేందుకేముంటాయి సంప్రదాయ వంటలేగా అంటారా! సంప్రదాయ వంటలతో పాటు సరదాగా కొత్త వంటలూ ప్రయత్నించండి. పిల్లల్ని అలరించండి. పెద్దల మెప్పు పొందండి. మరి ఎంత కొత్తవైనా పండగకు తగ్గ వంటలు ఉండాలి కదా! మరి వైరెటీగా ఉంటూనే పండగ రోజున చేసుకోదగ్గ కొన్ని వంటలు నేర్చుకుందామా!

పన్నీర్ క్యూబ్స్



ఇది చాలా సులభంగా చేసుకునే వంట. ఇది మనకు కొత్త వంట గానీ బెంగాలీలకు సంప్రదాయ మిఠాయే. మరి ఈ వంటకం తయారీ విధానం తెలుసుకుందామా.

కావలసిన పదార్థాలు

200 గ్రాములు పన్నీర్, ముప్పావు కప్పు పంచదార, ముప్పావు కప్పు నీళ్ళు, ఒక టీ స్పూన్ రోజ్ వాటర్

తయారీ విధానం

పన్నీర్‌ను చిన్నచిన్న ముక్కలుగా చేసుకుని పక్కన పెట్టుకోవాలి. యాలకులు చితక్కొట్టి పక్కన ఉంచుకోవాలి. ఇప్పుడు వెడల్పాటి పాన్ తీసుకుని ఇందులో పంచదార, నీళ్ళు పోసి పంచదార కరిగేవరకూ ఉంచండి. తీగపాకం వచ్చేవరకూ మరగనివ్వండి. ఇందులో యాలకుల పొడి, పన్నీర్ ముక్కలు వేసి బాగా కలపండి. అతి సన్నని మంట మీద ఏడు నిముషాలు ఉంచండి. చాలు ఇక స్టవ్ కట్టేసుకోవచ్చు. చివరగా రోజ్‌వాటర్ వేయండి. రోజ్‌వాటర్‌ను ఇష్టమైనవాళ్ళు వేసుకోవచ్చు, అక్కర్లేనివాళ్ళు మానేయవచ్చు. పంచదార పాకాన్ని పన్నీర్ ముక్కలు పూర్తిగా పీల్చుకునేవరకూ ఉంచండి. అంతే పన్నీర్ క్యూబ్స్ రెడీ. ఆనందంగా లాఘించేయడమే తరువాయి. తీపితీపి పన్నీర్ మిఠాయిలను పిల్లలే కాదు పెద్దలూ ఇష్టపడతారు. ఒక్కసారి తినిచూడండి. మళ్ళీమళ్ళీ కావాలంటారు.

బొబ్బట్లు



ఇది మన సంప్రదాయ వంటకమే. దాదాపుగా ఏటా పండగ సమయంలో వీటిని చేస్తూనే ఉంటారు. అయినా సరిగ్గా కుదరడం లేదని, చెయ్యడం రావడం లేదని, మంచి రుచి కుదరడం లేదని మదనపడేవారే ఎక్కువ. దీనికి సరైన పాళ్ళే ముఖ్యం. మరి ఈసారి రుచికరమైన బొబ్బట్లు తయారుచేస్తారా!

కావలసిన పదార్థాలు

పావుకిలో మైదా, పశ్చిశనగపప్పు పావుకిలో, బెల్లం పావుకిలో, యాలకుల పొడి కొద్దిగా, నెయ్యి బొబ్బట్లు కాల్చటానికి సరిపడ.

తయారీవిధానం

మైదాలో నీళ్ళు పోసి బాగా కలిపి ముద్దగా చేసి గంట సేపు నాననివ్వాలి. పశ్చిశనగపప్పును కుక్కర్లో ఉడికించి దానిలోని నీరు వంచేయాలి. ఇందులో ముందుగా తురిమి పెట్టుకున్న బెల్లం కలపాలి. పప్పు, బెల్లం బాగా కలిశాక, బాగా గట్టిపడిన తర్వాత చిన్నచిన్న ఉండలుగా చేసుకోవాలి. ఇప్పుడు మైదాపిండిని చిన్నచిన్న ఉండలుగా చేసుకుని చేతితో పలచగా చేసి శెనగపప్పు ముద్దను మధ్యలో పెట్టి మళ్ళీ ఉండలుగా చేసి కాస్త మందంగా చపాతీలా చేసి అట్ల పెనం మీద నెయ్యి వేసి కాల్చుకోవాలి. అంతే ఎంతో రుచికరమైన బొబ్బట్టు రెడీ. బొబ్బట్లు చేసేటప్పుడు మైదాలో కొద్దిగా చక్కెర, చిటికెడు వంటసోడా కలిపి పిండిలా నానబెట్టుకోవాలి. ఇలా చేస్తే బొబ్బట్లు మెత్తగా వస్తాయి.



బొబ్బర్ల పొంగలి

బొబ్బర్ల పొంగలి ఎప్పుడైనా చేశారా? అసలు విన్నారా? పొంగలిలో ఎన్నో రకాలు విని ఉంటారు, చేసి ఉంటారు. ఈసారి కొంచెం విభిన్నంగా బొబ్బర్లతో పొంగలి చేసి చూడండి. కొత్త రుచిని ఆస్వాదించండి. పండగకి కొత్త రుచులు అద్దండి.

కావలసిన పదార్థాలు

బొబ్బర్లు ఒక కప్పు, బియ్యం ఒక కప్పు, బెల్లం తురుము ఒక కప్పు, యాలకుల పొడి ఒక స్పూన్, నెయ్యి రెండు టేబుల్ స్పూన్‌లు, జీడిపప్పు, కిస్‌మిస్‌లు కొద్దిగా, ఉప్పు చిటికెడు.

తయారీ విధానం

ముందుగా బొబ్బర్లు వేయించాలి. చల్లారిన తర్వాత తిరగలిలో వేసి పప్పులా ఇసరాలి. ఇలా చేసిన పప్పును శుభ్రం చెయ్యాలి. ఇప్పుడు బియ్యం బొబ్బర్ల పప్పు కడిగి విడివిడిగా అరగంట నానబెట్టాలి. స్టవ్ వెలిగించి నెయ్యి వేడి చేసి జీడిపప్పు, కిస్‌మిస్‌లు వేయించి పక్కన పెట్టుకోవాలి. దీనిపై కుక్కర్ పెట్టి నానబెట్టిన బొబ్బర్ల పప్పు, బియ్యం వేసి నాలుగు కప్పుల నీళ్ళు పోసి కుక్కర్‌తో మూతపెట్టాలి. కుక్కర్ రెండు విజిల్స్ వచ్చేవరకూ ఉడికించాలి. ఇప్పుడు స్టవ్ ఆపి ఆవిరి పోయేంతవరకూ ఆగాలి. ఇప్పుడు మూతతీసి బెల్లం తురుము వెయ్యాలి. దీనిని బాగా కలపాలి. ఇక చివరగా స్టవ్ మీద మరో ఐదు నిముషాలు ఉడికిస్తే చాలు. పొంగలి రెడీ. దీనిలో చిటెకెడు ఉప్పు, నేతిలో వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్‌లు వేసి కలపి స్టవ్ ఆపాలి. అంతే ఎంతో రుచిగా ఉండే బొబ్బర్ల పొంగలి రెడీ. వేడివేడిగా తినేయడమే తరువాయి.



ఇవీ పతంగులే!

ఇవీ పతంగులే...వాటిని ఒకసారి తేరిపార చూడండి....పతంగులేనన్న విషయం అర్థమవుతుంది. సంక్రాంతి పతంగుల పండగ. ఈ నేపథ్యంలోనే ఏటా పండగ రోజుల్లో అంతర్జాతీయ స్థాయి కైట్ ఫెస్టివల్‌ను గుజరాత్‌లో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాదీ 6 నుంచి 13 వ తేదీ వరకూ ఎనిమిది రోజులపాటు రాష్ట్ర రాజధాని అహ్మదాబాద్‌లో నిర్వహించారు. అక్కడ కనిపించిన పతంగులే ఇవి. వివిధ ఆకారాలు, పరిమాణాలు, రంగుల్లో ఆకాశాన్నంటిన ఈ గాలిపటాలు చూసినవారందరి చేతా బౌరా అనిపించాయి, అబ్బురపరిచాయి. ఇవి మిన్నుకే కొత్త మెరుపుని అందించాయి.







నేను - సుడిగుండం (నవల) 16



పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575

నిన్నటి సంచిక తరువాయి

"అది కాదు అల్లుడూ..." అంటూ నన్ను ఒప్పించ బోయాడు. ఆయన దగ్గర్నుండి లేచి వచ్చేసాను.

****

విశాఖలో సముద్రం ఒడ్డున నేనూ, అమిత నడుస్తున్నాం. నా చూపులు నేల మీద వున్నాయి. ఇప్పుడు కూడా నాకు సముద్రం మరొక కానుకని అందిస్తుందేమోనని చూస్తున్నాను.

"ఇప్పుడు చెప్పు రామూ... ఏం చెయ్యబోతున్నావు?"

"మావయ్య పీ.జీ. చేయమంటున్నాడు. ఇంటి దగ్గర పరిస్థితులు మారిపోయాయి. మావయ్య తన అమ్మాయిల గురించి అస్సలు పట్టించుకోవటం లేదు. నేనయితే గట్టిగా చెప్పాను. ఇంక చదవటం కుదరదని..."

"ఇంతకుముందు చదువుతాను అన్నావు"

"ఉద్యోగం చేస్తూ చదువుతాను అన్నాను. ఈ సారి మాత్రం సైన్స్ తీసుకోను. నాకయితే ఉద్యమాలలో పనిచేయాలి అనిపిస్తుంటుంది. పట్టుమని ఆరేడు సంవత్సరాలు కూడా కాపురం చేయకుండానే నాన్న చనిపోయాడు. అప్పట్నుంచి నన్ను చూసుకుంటూ అమ్మ బతుకుతోంది. ఇవన్నీ దృష్టిలోకి తీసుకున్నాక ప్రపంచానికి ఏదయినా చేసేముందు నా వాళ్ల కోసం చేయాల్సిందీ వుందనిపించింది అమితా"

తన నుండి దీర్ఘమైన నిశ్వాసం.

మా ఇద్దరి మధ్య కొంతసేపు మాటలు లేవు.

ఇద్దరం సముద్రం కేసి చూస్తున్నాం.

నేను అమితని అడిగాను.

"మీ ఇంట్లో ఏమంటున్నారు అమితా?"

"అప్పుడే పెళ్లి ప్రసక్తి తీసుకొచ్చారు"

"నువ్వేమన్నావు"

"ఇంకో రెండు సంవత్సరాలు రెసిస్ట్ చేయగలననుకుంటు న్నాను. ఆ తర్వాత ఏం జరుగుతుందో చూద్దాం"

"ఎప్పటికయినా ఘర్షణ తప్పదా?"

"ఏమో... ఏమైనా జరగవచ్చు"

"అమితా... నాకు ఇప్పుడు అర్జెంట్‌గా ఓ ఉద్యోగం కావాలి. అది ఎంత చిన్నదయినా ఫర్వాలేదు. ఇంటి దగ్గర ఖాళీగా వుండలేకపోతున్నాను. నేను కనిపించిన పోస్టులకి అప్లై చేస్తున్నాను. కనీసం ఇంటర్వ్యూకి రమ్మని కూడా పిలవటం లేదు. నాలాంటి వారు ఈ దేశంలో చాలామంది వున్నారు కదా" అన్నాను.

"అవును" అంది.

"నేను వెంటనే బయలుదేరాలి అమితా"

"మంచిది రామూ" అంది.

****

పది రోజులు గడిచిపోయాయి.

మావయ్య ముభావంగా వుంటున్నాడు. నేను కనిపించినప్పుడు పలకరింపుగా నవ్వుతాడు. తర్వాత తలదించుకుని వెళ్లిపోతాడు. ఆ రోజు నేను మా ఊర్లో చిన్ననాటి స్నేహితుడిని కలిసాను. అతను పదో తరగతిలో చదువు మానేసాడు.

అతను వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. అర ఎకరం భూమి వుంది. అందులో కూరగాయలు పండిస్తారు.

"ఎలా వుంది జీవితం?" అన్నాను.

"ఒకరి కింద పని చేయటం కంటే ఇలా బతకటం బాగుంది" అన్నాడు. నా మనసు చివుక్కుమంది.

నేను ఎవరో ఒకరి దగ్గర పని చేయాలనుకుంటున్నాను. మావయ్యకి అప్పులున్నా పొలం వుంది. అందులో పని చేయటానికి ఒప్పుకోడు. అదలా వుంచితే ఇంతకుముందు కొందరు కూడా ఒకరి కింద పని చేయటం నాకు ఇష్టం వుండదు అన్నారు.

మనం ఎవరి దగ్గరా పని చేయకుండా వుండటం సాధ్యం అవుతుందా! అర ఎకరం భూమి వున్నా ఇంత ఆత్మవిశ్వాసం వస్తుందా!

అయినా మావయ్యలు తమ భూమి చూసుకునే అహంకారం పెంచుకున్నారు. ఆ భూముల్లో కూలీలు పనులు చేస్తారు. వాళ్లు పని చేస్తేనే పంట. అయినా ఎవరీ కింద ఎవరు చేస్తున్నట్లు అనుకుంటూ అతని దగ్గర సెలవు తీసుకున్నాను.

ఇంటి దగ్గరకు వెళ్లేటప్పటికి ఆశ్చర్యం.

అమిత ప్లాస్టిక్ స్టూల్ మీద కూర్చుని వుంది. అమ్మ



కంగారు పడుతోంది. నన్ను చూడగానే ఎక్కడికి పోయావు. నీ కోసం చూస్తున్నా అంది అమ్మ

"అమిత అని నా ఫ్రెండ్. మేం విశాఖలో చదువుకున్నాం"

"ఆ అమ్మాయి చెప్పింది. మీరు మాట్లాడుకోండి. ఇప్పుడే వస్తాను" అని హడావుడిగా బయటకు వెళ్లింది.

"ముందు చెప్పకుండా ఇలా వచ్చావేంటి అమితా" అన్నాను.

నా మనసులో మాత్రం ఇంటి దగ్గర అమ్మా-నాన్నల్లో ఏదయినా గొడవ జరిగి వుంటుంది అనిపించింది.

"సుపు వచ్చేముందయినా మా ఇంటికి రమ్మనలేదు. ఆ తర్వాత నువ్వు కనిపించవని వచ్చాను" అంది నవ్వుతూ..

"అలా అంటావా.... నన్ను అర్థం చేసుకో. ఆ రోజు నేను నా గోలలో వున్నాను. నిన్ను మా ఇంటికి రమ్మని మాట వరసకయినా అనాలనిపించలేదు. ఏమయినా మా ఇంటికి వచ్చినందుకు సంతోషం. నువ్వు ఒక్కదానివే వచ్చావా?"

"ఇంకెవరన్నా వస్తే కనిపించేవారు కదా"

అప్పుడు నవ్వు వచ్చింది.

ఇల్లంతా చూస్తోంది. ఇంతలో అమ్మ రెండు గ్లాసుల్లో కాఫీ తీసుకు వచ్చింది.

"ఎందుకండీ" అని మొహమాట పడింది అమిత.

"ఇంట్లో పాలు లేవమ్మా.. ఇప్పుడే వస్తాను"

"నా గురించి మీరు ఏ ఏర్పాట్లూ చేయవద్దు" అంది

అమ్మ తలూపి బయటకి వెళ్లిపోయింది.

"ఇప్పుడు చెప్పు అమితా... మమ్మల్ని చూడటానికి వచ్చావా? ఇంకేదయినా విశేషం వుందా?"

"ఉంది. అది అంత గొప్ప విశేషం కాకపోవచ్చు" అనగానే నాలో ఉత్కంఠ మొదలయింది.

"హైదరాబాద్‌లో ఓ ఉద్యోగం వుంది రామూ. అది మందుల ఫ్యాక్టరీ. స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ. రెండు వేల రూపాయలు జీతం యిస్తాం అన్నారు. కనీసం మూడు వేలయినా ఇస్తే బాగుంటుంది అన్నాను...."

నా ముఖంలో భావం చూడకుండానే చెబుతోంది.

"ముందు మనకో షెల్టర్ కావాలి. ఇప్పుడు ఎవరయినా నీ ఎక్స్‌పీరియన్స్ ఎన్ని సంవత్సరాలని అడుగుతున్నారు. నిన్ను అక్కడే వుండమని అనటం లేదు. మంచి ఆఫర్ వస్తే ఎప్పుడయినా బయటకి వెళ్లవచ్చు" అని నన్ను చూసింది. .

"నీకు నచ్చుతుందా?"

"నాకు నచ్చటాలూ, నచ్చకపోవటాలు లేవు అమితా... అవసరం. అయినా నువ్వు ఇంత శ్రమ తీసుకోవాలా! టెలిగ్రామ్ యిస్తే నేను విశాఖ వచ్చేవాడిని"

"ఇది శ్రమ కాదు. నా స్థానంలో వుంటే నువ్వయినా ఇలానే చేస్తావు" అని... "రెండు రోజుల్లో నువ్వు బయలు దేరాలి. పనిలో పని మీ ఊరుని చూసినట్లవుతుందని వచ్చాను"

"చాలా సంతోషం అమితా... నీకు కృతజ్ఞతలు ఎలా చెప్పుకోవాలో తెలియటం లేదు"

"ఏంటి రామూ... మన మధ్య అలాంటివి అవసరమా" అని "నేను బయలుదేరుతాను" అంటూ లేచింది.

"అప్పుడేనా.... నువ్వు భోజనం చేయకుండా వెళ్లే మా అమ్మ బాధ పడుతుంది"

"తప్పదంటావా?" అంది. "మీ ఇంటికి వస్తే నన్ను భోజనం పెట్టకుండా పంపిస్తావా?" అన్నాను. నవ్వేసి "టైమ్ అవుతోంది కదా" అంది.

"భోజనం చేసాక బస్ వుంది. ఈలోగా మనం ఇంకోపని చేయాలి. నువ్వు మా మావయ్యని చూడాలి" అన్నాను.

"నేను వెన్నెల్ని చూస్తాను" అంది అమిత.

మావయ్యకు అమితని పరిచయం చేసాను.

హైదరాబాద్‌లో ఉద్యోగం గురించి చెప్పాను.

"నేను ఇంకా చదువుకోమంటున్నాను. అల్లుడు నా మాట వినటం లేదు. నువ్వన్నా చెప్పమ్మా" అన్నాడు.

"రామూ చేస్తోంది సరయిందే లెండి" అంది.

అప్పుడే బయట నుండి వస్తున్న వెన్నెల మమ్మల్ని చూడగానే ఆగిపోయింది. "ఈ అమ్మాయి వెన్నెల కదూ" అంది అమిత. "నా పేరు సుచిత్ర. బావ వెన్నెల అని పిలుస్తాడు" అంది కాస్త రోషంగా.

హాయిగా నవ్వి "ఈ విషయం ఇప్పుడే తెలిసింది సుచిత్రా. నిన్ను చూడటం కోసం నేను వచ్చాను" అని తన పక్కన కూర్చోబెట్టుకుంది.

అత్తయ్యనీ, అర్చననూ పరిచయం చేసాను.

అందరి దగ్గర సెలవు తీసుకుని బయలుదేరబోతుంటే "నేనూ వస్తాను" అంది వెన్నెల.

"వాళ్లు వెళ్తారు. రోజూ అత్తయ్య దగ్గరకు వెళ్తావు కదా" అంది అత్తయ్య.

వెన్నెల ముఖం చిన్నబోయింది. "ఫర్వాలేదండి. వెన్నెల సారీ సుచిత్రను మాతో పంపండి" అంది అమిత. అత్తయ్య మాట్లాడలేకపోయింది. అందరం బయలుదేరాం. అప్పటికి వంట పూర్తవుతోంది. కబుర్లు చెప్పుకుంటున్నాం. "భోజనాలకు లేవండి" అంది అమ్మ. "నేను ఇంటి దగ్గర తింటాను" అంది వెన్నెల "నీ ముఖం. మాట్లాడకుండా వాళ్లతో తిను" అంది భోజనాలు పూర్తి అయ్యాయి. అమిత బయలుదేరటానికి సిద్ధం అయింది "నేను కూడా మీతో వస్తాను బావా" అంది వెన్నెల. "రా సుచిత్రా... అందుకు మీ బావ పర్మిషన్ కావాలా" అంది అమిత.

ముగ్గురం బయలుదేరాం.

మా ఊర్లో వారు మమ్మల్ని ఆశ్చర్యంగా చూడటం గమనించాను. "మంచి భోజనం పెట్టారు మీ అమ్మ" అంది అమిత. "పేదవారి భోజనం. నీకు నచ్చటం సంతోషం" అన్నాను.

"డబ్బున్నవారి భోజనాలు ఖరీదుగా వుంటాయి. అందులో రుచి గురించి పట్టించుకోరు. అందులోనూ స్పైసీగా వుంటాయి. నిజంగానే మీ అమ్మ వంట బాగా చేస్తారు" అంది.

వెన్నెల మా ఇద్దర్నీ చిత్రంగా చూస్తోంది. బస్ కోసం చూస్తున్నాం. అప్పుడు తన హ్యాండ్ బ్యాగ్ నుండి ఓ కవర్ తీసి నాకు ఇచ్చింది అమిత. "ఏంటిది అమితా!"

"నీకు ఉత్తరం రాసాను. మెల్లగా చదువుకో" అంది. వెన్నెలని చూస్తూ "నువ్వు ఎక్కువ మాట్లాడవా" అంది.

వెన్నెల సిగ్గుపడింది.

"నువ్వు కూడా మీ బావలా బాగా చదువుకోవాలి. అలాగే చక్కగా మాట్లాడాలి. ముందు ముందు నువ్వు ఈ ఊరి నుండి బయటకు వస్తావు. కొత్త ఫ్రెండ్స్ పరిచయం అవుతారు. అవునా?" వెన్నెల మాట్లాడలేదు.

"గుడ్ గర్ల్" అంది.

బస్ వచ్చింది.

(ఇంకా ఉంది)

ఉద్యోగం దక్కాలంటే మెలకువలు తప్పనిసరి


ఉద్యోగం కోసం వెళ్లిన అభ్యర్థికి 'మళ్లీ కబురు చేస్తాం... అయిపోయింది ఇక మీరు వెళ్లొచ్చు... సారీ మీరు సెలెక్ట్ కాలేదు...' వంటి మాటలు వినిపిస్తే చాలా బాధగా ఉంటుంది. కొంతమంది ఇక తాము ఎందుకు పనికిరామేమో అన్నంత ఆత్మన్యూనతకు గురవుతుంటారు. రెజ్యూమెను ఎంత జాగ్రత్తగా తయారుచేసినా... సబ్జెక్టు గురించి బాగా చెప్పినా... హెచ్‌ఆర్ రౌండులో అంతా బాగానే చేసినా... ఆఫర్ లెటర్ అందదు. తెలియకుండానే జరిగే కొన్ని పొరపాట్లతో తిరస్కరణకు గురికావాల్సి వస్తుంది. అలాంటివి తప్పాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. లోపాలను సవరించుకోవాలి.

రెజ్యూమె రిజెక్ట్ కాకుండా జాగ్రత్త పడాలి

తొలిదశ తడబాటు

ఉద్యోగ దరఖాస్తుకు మొదటి మెట్టు రెజ్యూమెనే. అభ్యర్థిపై మొదటి అభిప్రాయాన్ని కలిగించేది ఇదే. కాబట్టి, దీన్ని రూపొం దించుకునేటపుడే జాగ్రత్తలు తీసుకోవాలి. ఒక సంస్థ అభ్యర్థిలో ఉద్యోగానికి సంబంధించిన అర్హతలతోపాటు కొన్ని నైపుణ్యాలనూ చూస్తుంటుంది. అవి ఆ వ్యక్తిలో లేనపుడు తిరస్కరిస్తుంది.

కొందరు ఒక రెజ్యూమెను తయారుచేసుకుని అన్ని ఉద్యోగా లకూ దాన్నే పంపుతుంటారు. చక్కగా తయారు చేసుకున్నామని భావిస్తుంటారు. నిజమే... మీ నైపుణ్యాలు, ఆసక్తులు అన్నింటితో రెజ్యూమెను తయారుచేశారు. కానీ అవి సంస్థకూ ఉపయోగపడాలి కదా! అక్కడే అభ్యర్థి దరఖాస్తు బుట్టదాఖ లవుతుంది. కాబట్టి దరఖాస్తు చేసుకుంటున్న సంస్థకు తగ్గట్టుగా రెజ్యూమె, కవర్ లెటర్లను ఎప్పటికప్పుడు తాజాగా సిద్ధం చేసుకోవాలి. అలాగే ఉద్యోగ వివరాల్లో అడిగిన నైపుణ్యాలు ఉన్నాయో లేదో కూడా చూసుకోవాలి.



ఉదాహరణకు- ఒక సంస్థ డిగ్రీ అర్హత ఉన్నవారికి ఉద్యోగ ప్రకటన ఇచ్చిందనుకుందాం. ఒక్కో ఉద్యోగావసరాల్ని వివరిస్తూ.. కంప్యూటర్ పరిజ్ఞానం ఉం డాలి అని కూడా అన్నారనుకుందాం. మీరు డిగ్రీ అర్హత ఉంది కదా అని దరఖాస్తు చేసుకున్నారు. దీంతో సంస్థ మీకన్నా కంప్యూటర్‌పరిజ్ఞానం ఉన్నవారినే ఎంచుకోవడానికే మొగ్గు చూపుతుంది. రెజ్యూమెలో సాధించిన విజయాలను కూడా చేర్చాలి. అయితే అవి ఎక్కువ నిడివితో ఉండకూడదు. ఎక్కువ రాస్తేనే అధికారుల దృష్టిలో పడతారనే అపోహతో పేజీలు నింపుతుంటారు. కానీ అదంతా చదివి, సంస్థకు తగిన నైపుణ్యాలు ఉన్నాయేమో తెలుసుకునే ఓపిక, సమయం అధికారులకు ఉండదు. తక్కువ పదాల్లో విషయం అర్థమయ్యేలా లేకపోయినా అభ్యర్థికి నష్టం కలుగుతుంది. రెజ్యూమెలో అక్షరదోషాలు కూడా అభ్యర్థిపై వ్యతిరేక భావాన్ని తెప్పిస్తాయి. అభ్యర్థి ఉద్యోగ విషయంలో సిన్సియర్‌గా లేడన్న భావన సంస్థ అధికారులకు కలుగుతుంది. కాపీ చేయడం లాంటివి కూడా చేయకూడదు.

ఇవన్నీ సరిగా ఉన్నా.. కొన్ని సంస్థలు రెఫరెన్స్‌ను ఆశిస్తాయి. ఇది ప్రకటనల్లో తెలిసే అవకాశముండదు. కాబట్టి, దరఖాస్తు చేసుకునే సంస్థలో తెలిసినవారెవరైనా ఉంటే వారి దగ్గరి నుంచి సమాచారం సేకరించుకోవచ్చు.

ఇంటర్వ్యూలో చేసే పొరపాట్లు

రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, టెక్నికల్ ఇంటర్వ్యూలు దాటినా.. చివరి మెట్టు అయిన హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలో కొందరు వెనుదిరుగుతుంటారు. సంస్థకు కావాల్సిన పరిజ్ఞానం అంతా ఉన్నా.. అభ్యర్థికి 'నో' చెబు తున్నారంటే.. ఇంకా కొన్ని ముఖ్యమైన అంశాలు కొరవడుతున్నట్టే!

రూపురేఖలు : చాలామంది ఎంతసేపూ అడిగే ప్రశ్నలు, చదవాల్సిన అంశాలపైనే దృష్టి పెడతారు. వేసుకునే దుస్తులు, రూపురేఖలకు అంత ప్రాధాన్య మివ్వరు. నిజానికి అభ్యర్థిపై ఏర్పడే మొదటి అభిప్రాయం వీటిపైనే ఉంటుంది. క్యాజువల్స్ లోనో, ఫంక్షన్‌కు వెళ్లినట్లో హాజరైతే అభ్యర్థికి ఉద్యోగం పట్ల ఆసక్తి లేదనే అభిప్రాయం అధికారులకు కలుగుతుంది. కాబట్టి, హుందాగా కనపించే ప్రయత్నం చేయాలి.

పరిశోధన : అభ్యర్థి ఉద్యోగం, సంస్థ, పరిశ్రమపై అవగాహన పెంచుకోవడానికి సమయం కేటాయించలేదని తెలుసు కోవడానికి ఇంటర్వ్యూ చేసేవారికి ఎంతో సమయం పట్టదు. ఇంటర్నెట్ అందు బాటులోకి వచ్చాక సమాచారమంతా అరచేతిలోకి వచ్చింది. కాబట్టి, సంస్థ గురించి కనీస వివరాలు సులువుగానే తెలుసు కోవచ్చు. స్నేహితులు, నిపుణులు, అందులో ఉద్యోగం చేసే వారూ ఈ విషయంలో సహాయపడతారు. ఇన్ని సదుపా యాలున్నా సంస్థ గురించిన కనీస వివరాలను తెలుసుకునే ప్రయత్నం చేయనపుడు అభ్యర్థిలో తగినంత శ్రద్ధ లేదని భావిస్తారు.



ప్రశ్నలేమీ లేకపోవడం : హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలో భాగంగా అధికారి అభ్యర్థిని సంస్థ గురించిన సందేహాలేమైనా ఉన్నాయా అని అడుగుతుంటారు. అభ్యర్థి దగ్గర అడగడానికి ఏ ప్రశ్నలూ లేవంటే.. అభ్యర్థి సన్నద్ధం కాని విషయాన్ని సూచిస్తుంది. అలాగే వెబ్‌సైట్‌లో దొరికే ప్రాథమిక అంశాల



గురించి అడిగే ప్రశ్నలూ ఇదే విషయాన్ని నిర్ధరిస్తుంది. దరఖాస్తు చేసిన ఉద్యోగానికి సంబం ధించి సమాచారమంతా దరఖాస్తు సమయంలోనే తెలిసే అవకాశ ముండదు. కాబట్టి వాటికి సంబంధించిన ప్రశ్నలను ముందుగానే సిద్ధం చేసుకోవాలి.

రెజ్యూమె విషయాలనే ప్రస్తావించడం : ఇంటర్వ్యూ అధికారి ఏదైనా ప్రశ్నను అడిగినపుడు దానికి సంబంధించిన విషయాలు రెజ్యూమెలో ఉంటే వాటినే ఉన్నది ఉన్నట్టుగా దింపేయకూడదు. ఇంటర్వ్యూ వరకు వచ్చారంటే మీ రెజ్యూమెను పూర్తిగా కాక పోయినా కనీసం చూస్తారు. అయినా ఆ ప్రశ్నను అడిగారంటే.. రెజ్యూమెను అప్పజెప్పేయొద్దు. అలా చేస్తే.. దాన్ని బట్టీపట్టిన భావన తెప్పించగలరు కానీ, అవి నిజంగా మీ నైపుణ్యాలే అని ఒప్పించలేరు. కాబట్టి, ఆ లక్షణాలు, నైపుణ్యాలను కాస్త వివరంగా చెప్పే ప్రయత్నం చేయాలి.

మొహమాటం : విద్యార్థి దశలో చిన్నచిన్నవే అయినా ఏవో కొన్ని విజయాలుం టాయి. చాలామంది అభ్యర్థులు వాటిని చెప్పడానికి సంకోచిస్తుంటారు. నిజానికి వాటి ఆధారంగా అభ్యర్థి నాయకత్వ లక్షణాలు, బృందంతో పనిచేయగల నైపుణ్యాలను అధికారులు అంచనా వేస్తారు. మీరు వాటిని చెప్పడానికి ఇబ్బంది పడితే.. మీకు ఆ నైపుణ్యాలు లేకపోయినా రెజ్యూమెలో పొందు పరిచారనే అభిప్రాయానికి అధికారులు వచ్చే అవకాశముంది. అలాగే సంస్థకు అవసరం లేని విజయాల గురించి ప్రస్తావించొద్దు. మీరు సాఫ్ట్‌వేర్ సంస్థకు దరఖాస్తు చేసి, 'పాటల పోటీలో ఎప్పుడూ ఫస్ట్ వస్తా' అని చెబితే దానివల్ల వారికొచ్చే లాభమేం ఉండదు కదా! మీరు చెప్పే విజయాలు సంస్థకు తోడ్పడగలిగేలా ఉండాలి.

కెరియర్ విషయంలో అస్పష్టత : కెరియర్‌పై స్పష్టమైన అవగాహన ఉన్నవారిని ఎంచుకోవడానికి సంస్థలు ఆసక్తిని చూపు తాయి. ఎందుకంటే.. వారు వాటిని సాధించే క్రమంలో సంస్థ అభివృద్ధికీ తోడ్పడుతారనే అభిప్రాయం అధికా రుల్లో ఉంటుంది. సాధారణంగా ఇంటర్వ్యూ సమయంలో 'అయిదేళ్లలో మిమ్మల్ని మీరు ఎక్కడ చూడాలను కుంటున్నారు?' అన్న ప్రశ్న ఇందుకు సంబంధించిందే. సమాధానం ఇవ్వాలన్నట్లుగా కాకుండా మనస్ఫూర్తిగా మీరేం చేయాలనుకుంటున్నారో ఆలోచించుకుని సమా ధానం ఇవ్వాలి. అసాధ్యమన్న భావన కలిగించేలా కూడా ఉండకూడదు.

లక్ష్యమా? అవసరమా? : అభ్యర్థి ఉద్యోగాన్ని పొంద డానికి ఎంతవరకూ ఉత్సాహం చూపుతున్నా దన్నదాన్నీ హెచ్‌ఆర్ అధికారులు చూస్తారు. అది పని విషయంలో మీరు చూపే ఆసక్తి, లక్ష్యాలను బట్టి అంచనా వేస్తారు. అలాకాకుండా తప్పనిసరిగా ఎలాగైనా ఈ ఉద్యోగాన్ని చేరాలన్న ధోరణో, అవసరమన్న ఉద్దేశమో ప్రదర్శిస్తే తిరస్కరణ తప్పదు. ఏ సంస్థ అయినా దీర్ఘకాలం తమతో నడిచేవారినే ఎంచుకోవా లనుకుంటుంది. అవసరం కోసం వస్తున్నారనిపిస్తే.. తీరా అది తీరాక వేరేదానికి వెళ్లిపోతారు అని భావిస్తుంది. 'మిమ్మల్నే ఎందుకు ఎంచుకోవాలి?', 'సంస్థకు మీరే తగినవారని ఎలా చెబుతారు?' వంటి ప్రశ్నలు ఈ విషయంపై స్పష్టత కోసమే అడుగుతారు.

సంస్థల కోణంలోనూ..

దరఖాస్తు చేసుకున్నాక అయినా, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ అయ్యాక అయినా సంస్థ నుంచి పిలుపు రాకపోతే అది పూర్తిగా అభ్యర్థి లోపమే అని చెప్పలేం. ఒక్కోసారి సంస్థ తీసుకునే నిర్ణ యాలూ కారణమవొచ్చు. వాటిలో..

- ఒక్కోసారి సంస్థలు తమ కొత్త ప్రాజెక్టుల కోసం ఉద్యోగ ప్రకటనలిస్తాయి. అవి రద్దు అవ్వడమో, ఆలస్యమవడమో జరిగినపుడు స్పందించవు. సాధారణంగా ఈ సమాచారం సంస్థలో ఉండే లోపలి వ్యక్తుల ద్వారానే తెలుస్తుంది. వెబ్‌సైట్లలోనూ ఉండదు. ఎప్పుడో మనం ఇచ్చిన రెజ్యూమెకు కొన్ని నెలల తర్వాత ఫోన్ వస్తుండటం గమనిస్తుంటాం కదా! అది ఇందులో భాగమే.
- కొన్నిసార్లు సంస్థలకు తక్షణం పనిలో చేరగలిగేవారు అవసరమవుతారు. దీర్ఘకాలం శిక్షణనిచ్చి ఉద్యోగంలోకి తీసుకునే వారికన్నా నేరుగా లేదా కొద్దిపాటి శిక్షణ సరిపోయే వారు అవసరమవుతుంటారు. అలాంటప్పుడు కూడా కాల్ రాదు. కొత్త విద్యార్థులైనా.. ఇంటర్న్‌షిప్‌లు, పార్ట్‌టైం ఉద్యోగానుభవం ఉన్నవారు అసలు అనుభవం లేనివారికంటే సంస్థలకు మేలే కదా!
- ఉద్యోగాల జాబితా తక్కువగా ఉన్నపుడు రాతపరీక్ష, బృందచర్చలు, ఇంటర్వ్యూలు ఇలా ఎక్కువ సమయం, డబ్బు వృథా చేయడానికి సంస్థలు ఇష్టపడవు. ఇలాంటపుడు సంస్థలోని వారికి అర్హులైనవారిని సూచించమంటాయి. బయటినుంచి వచ్చిన వేలాది దరఖాస్తుల్లో నుంచి ఎంచుకోవడం కంటే లోపలి వారి దగ్గర్నుంచి వచ్చిన పదుల సంఖ్యలో దరఖాస్తులను చూసి ఎంచుకోవడం వారికి సులువు. వారిలో అర్హులైనవారికి నేరుగా ఇంటర్వ్యూ నిర్వహించి తీసుకుంటారు.
- అడిగిన దానికంటే ఎక్కువ అర్హత ఉన్నవారిని తీసుకోవ డానికీ సంస్థలు సంకోచిస్తాయి. ఇప్పుడు అవసరం కాబట్టి, దీనికి దరఖాస్తు చేసుకున్నారు. ఇంతకంటే మంచి అవకాశం వస్తే.. తప్పకుండా వెళ్లిపోతారనుకున్నపుడూ పక్కన పెట్టేస్తాయి.

ఉద్యోగావకాశాలు

ఏపీపీఎస్సీ 308 డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 308 డిగ్రీ లెక్చరర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

డిగ్రీ లెక్చరర్లు : 308

అర్హతలు : సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీతో పాటు నెట్/స్లెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణత.

దరఖాస్తు ప్రారంభతేదీ : ఫిబ్రవరి 5, 2019.

ఫీజు చెల్లించడానికి చివరితేదీ : ఫిబ్రవరి 25, 2019.

దరఖాస్తుకు చివరితేదీ : ఫిబ్రవరి 26, 2019.

వెబ్‌సైట్ : https://psc.ap.gov.in

ఎయిమ్స్-జోధ్‌పూర్‌లో 37 ఉద్యోగాలు

జోధ్‌పూర్ (రాజస్థాన్)లోని ఆలిండియా ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 37 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు...

1. అప్పర్ డివిజన్ క్లర్క్ (యూడీసీ) : 3
2. డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఈఓ) : 2
3. లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ) : 32

అర్హత : ఇంటర్, డిగ్రీ, ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానం, టైపింగ్ సామర్థ్యం ఉండాలి.

వయస్సు : పోస్టును బట్టి 18-30 ఏళ్ల మధ్య ఉండా లి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు : జనరల్, ఓబీసీలకు రూ.1000టీ ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, మహిళా అభ్యర్థులకు రూ.200.

ఎంపిక : రాత పరీక్ష ఆధారంగా.

దరఖాస్తుకు చివరితేదీ : జనవరి 27, 2019

పూర్తి వివరాలకు వెబ్‌సైట్ : www.aiimsjodhpur.edu.in

ఏపీపీఎస్సీలో 405 పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 405 పాలిటెక్నిక్ లెక్చరర్లు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

పాలిటెక్నిక్ లెక్చరర్లు : 405

అర్హత : పోస్టును బట్టి సంబంధిత సబ్జెక్టులు/ బ్రాంచుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత. కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ లెక్చరర్ పోస్టులకు కామర్స్‌లో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, ఇంగ్లిష్ టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ హయ్యర్ గ్రేడ్ ఉండాలి.

దరఖాస్తు ప్రారంభ తేదీ : ఫిబ్రవరి 6, 2019.

ఫీజు చెల్లించుటకు చివరితేదీ : ఫిబ్రవరి 26, 2019.

దరఖాస్తుకు చివరితేదీ : ఫిబ్రవరి 27, 2019.

వెబ్‌సైట్ : https://psc.ap.gov.in

నేవీలో 102 ఉద్యోగాలు

ఇండియన్ నేవీ ఎగ్జిక్యూటివ్/టెక్నికల్ బ్రాంచీలో పర్మినెంట్ ప్రాతిపదికన 102 పోస్టుల భర్తీకి అర్హులైన అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు...

ఎగ్జిక్యూటివ్ బ్రాంచీ- బ్రాంచీ/కేడర్ వారీ ఖాళీలు..

నేవల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్షన్ కేడర్ : 12

జనరల్ సర్వీస్/హైడ్రోగ్రఫీ సర్వీస్ కేడర్ : 30

టెక్నికల్ బ్రాంచీ :

ఇంజినీరింగ్ బ్రాంచీ (జనరల్ సర్వీస్) : 28

ఎలక్ట్రికల్ బ్రాంచీ (జనరల్ సర్వీస్) : 32

అర్హత : సంబంధిత బ్రాంచీల్లో ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత. నిర్దిష్ట శారీరక, వైద్య ప్రమాణాలుండాలి. ఇంజనీరింగ్ డిగ్రీ చివరి ఏడాది చదువుతున్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు : జనవరి 2, 1995 నుంచి జులై 1, 2000 మధ్య జన్మించి ఉండాలి. ఈ రెండు తేదీలను పరిగణలోకి తీసుకుంటారు.

ఎంపిక : ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా. ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ రెండు స్టేజ్‌లలో ఉంటుంది. స్టేజ్-1లో ఇంటెలిజెన్స్ టెస్ట్, పిక్చర్ పర్‌సెప్షన్, డిస్కషన్ టెస్ట్, స్టేజ్-2లో సైకలాజికల్ టెస్టింగ్, గ్రూప్ టెస్టింగ్, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తులు ప్రారంభం : జనవరి 12, 2019.

దరఖాస్తుకు చివరితేదీ : ఫిబ్రవరి 1, 2019.

వెబ్‌సైట్ : www.joinindiannavy.gov.in

ఓఎన్‌జీసీలో 36 పోస్టులు

సూరత్‌లోని ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమి టెడ్ (ఓఎన్‌జీసీ) హజీరా ప్లాంట్‌లో ఖాళీగా ఉన్న 36 టెక్నికల్ (ఏ-1, ఏ-2 లెవల్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు... అసిస్టెంట్ టెక్నీషియన్ (ఏ-2 లెవల్) : 12

విభాగాలు : మెకానికల్-10, ఎలక్ట్రికల్-2.

అర్హత : సంబంధిత విభాగంలో మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా ఉండాలి.

జూనియర్ అసిస్టెంట్ టెక్నీషియన్ (ఏ-1 లెవల్) : 21

విభాగాలు : ఫిట్టింగ్-9, డీజిల్-5, ఎలక్ట్రికల్-3, ప్రొడక్షన్-4.

అర్హత : పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులో సర్టిఫికెట్ కోర్సు ఉండాలి.

జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ : 3. **విభాగం :** కెమిస్ట్రీ

అర్హత : బీఎస్సీ (కెమిస్ట్రీ)

వయసు : 18-43 సంవత్సరాల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్ ద్వారా.

ఎంపిక : రాత పరీక్ష, అకడమిక్ ప్రతిభ, అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్, మెడికల్ టెస్ట్ ద్వారా. **దరఖాస్తుకు చివరితేదీ :** జనవరి 24, 2019. **ఆన్‌లైన్ పరీక్ష (సీబీటీ) తేదీ :** ఫిబ్రవరి 24, 2019.

వెబ్‌సైట్ : www.ongcindia.com

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
156.28 ▼	57.35 ▼	100 ▲	30,770	0	41,400	70.93
35,853.56	10,737.60	30,050	ప్రొద్దుటూరు 30,760	40,400	ప్రొద్దుటూరు 42,631	
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఎస్-బ్యాంక్	195.35	6.02
ఇన్ఫోసిస్	701.90	2.69
సన్‌ఫార్మా	450.85	1.45
బజాజ్ ఫైనాన్స్	2,552.90	1.22
మారుతిసుజుకి	7,443.35	1.20

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
విప్రో	312.55	-4.91
గెయిల్	324.90	-4.05
ఇండియాబుల్స్	790.95	-3.09
టెక్ మహీంద్ర	703.10	-2.77

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	71.68	70.93
యూరో	81.51	81.13
పౌండ్	90.67	90.99
ఆస్ట్రేలియా డాలర్	51.78	51.03
సింగపూర్ డాలర్	52.29	52.37

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	30,880	32,026
చెన్నై	30,880	32,026
బెంగళూరు	30,140	32,235
ముంబై	31,560	33,754
విజయవాడ	-	33,400
విశాఖపట్నం	30,770	32,200
ప్రొద్దుటూరు	30,760	32,300
ముడి చమురు	60.48	

జీఎస్టీలో పరోక్ష దోపిడీ

- కష్టమర్ల నుంచి అధిక శాతంలో జీఎస్టీ వసూలు
- ప్రభుత్వానికి చెల్లించని వైనం
- గుర్తించిన ఆర్థిక మంత్రిత్వ శాఖ
- కొనుగోలుదారులకు ఊరటనిచ్చే దిశగా యోచన



న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను మరింత సరళతరం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఇప్పటికే వివిధ రకాల వస్తువులు, సేవలపై జీఎస్టీని తగ్గిస్తూ అటు వ్యాపారులకు, ఇటు వినియోగదారులకు ఉపశమనాన్ని కలిగిస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ.. ఇప్పుడు కస్టమర్ల నుంచి జీఎస్టీ చార్జీలను వసూలు చేయకుండా కంపోజిషన్ డీలర్లను నిరోధించే చర్యలకు శ్రీకారం చుట్టాలని యోచిస్తున్నది. ఇందులో భాగంగానే కొనుగోలుదారుల నుంచి ఏ పన్నునూ తీసుకోకుండా ఇన్వాయిస్‌ల్లో జీఎస్టీ రిజిస్ట్రేషన్ స్టేటస్‌ను కంపోజిషన్ డీలర్లు, సర్వీస్ ప్రొవైడర్లు తప్పక పేర్కొనేలా నిర్ణయం తీసుకోవాలని రెవిన్యూ శాఖ భావిస్తున్నది. ఈ మేరకు పరోక్ష పన్నులు, కస్టమ్స్ కేంద్ర బోర్డు (సీబీఐసీ) కూడా ప్రతిపాదనల్ని పరిశీలిస్తున్నది. ఒక్కసారి గనుక ఇది అమల్లోకి వచ్చినైట్లెతే కస్టమర్ల నుంచి కంపోజిషన్ డీలర్లు వసూలు చేస్తున్న జీఎస్టీకి అడ్డుకట్ట పడినట్లేనని ప్రభుత్వం అనుకుంటున్నది. ఇలా వసూలవుతున్న జీఎస్టీ ఖజానాకు రావడం లేదంటున్న ఓ అధికారి.. అదంతా కూడా అక్రమంగా కంపోజిషన్ డీలర్లకే ప్రయోజనకరంగా మారిందని చెబుతున్నారు. అందుకే కస్టమర్లకు లబ్ధి చేకూరేలా కంపోజిషన్ డీలర్ల జీఎస్టీ వసూళ్లకు చెక్ పెట్టాలని భావిస్తున్నట్లు సదరు అధికారి చెప్పారు. అలాగే వినియోగదారులకూ ఈ విషయంలో అవగాహన కల్పించాలని రెవిన్యూ శాఖ అనుకుంటున్నది. కొనుగోలుదారుల నుంచే జీఎస్టీని వసూలు చేయాల్సిన అవసరం డీలర్లకు లేదన్న దానిపై స్పష్టత వచ్చేలా ప్రచారం చేపట్టాలని చూస్తున్నది. జీఎస్టీ కంపోజిషన్ పథకం కింద ట్రేడర్లు, తయారీదారులు గూడ్స్‌పై ఒక్క శాతం మాత్రమే జీఎస్టీని చెల్లించాల్సి ఉన్నది. ఇందులో లేనివారు 5, 12, 18 శాతం పన్నులను చెల్లించాల్సి ఉంటున్నది. వీరికి కూడా కొనుగోలుదారుల నుంచి జీఎస్టీ చార్జీలను వసూలు చేయడానికి అనుమతి లేదు. అలాంటిది తక్కువ జీఎస్టీని చెల్లిస్తున్న కంపోజిషన్ డీలర్ల దోపిడి ఇటు వినియోగదారులకు ఇబ్బందికరంగా, అటు ప్రభుత్వానికి నష్టదాయకంగా పరిణమించింది. కస్టమర్ల నుంచి అధిక శాతంలో జీఎస్టీని వసూలు చేస్తున్న కంపోజిషన్ డీలర్లు.. అందుకు అనుగుణంగా మాత్రం ప్రభుత్వ ఖజానాకు డిపాజిట్ చేయడం లేదని ఓ అధికారి పీటీఐకి తెలిపారు. కాగా, జీఎస్టీ కింద 1.17 కోట్ల వ్యాపారులు నమోదై ఉన్నారు.వీరిలో దాదాపు 20 లక్షల మంది కంపోజిషన్ స్కీంను వర్తింపజేసుకున్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలోని జీఎస్టీ మండలి ఈ నెల 10న జరిపిన 32వ సమావేశంలో జీఎస్టీ కంపోజిషన్ స్కీం కింద టర్నోవర్ ఆధారంగా చిన్న వర్తకులు, వ్యాపారులు చెల్లిస్తున్న 1 శాతం పన్ను రూ.1.5 కోట్ల వార్షిక టర్నోవర్ దాటిన వారికే వర్తిస్తుందని నిర్ణయించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ పన్ను వార్షిక టర్నోవర్ కోటి రూపాయలు దాటితే పడుతున్నది. ఏప్రిల్ 1 నుంచి మార్పు వర్తిస్తుందని నాడు జైట్లీ పేర్కొన్నారు. అలాగే రూ.50 లక్షలదాకా వార్షిక టర్నోవర్ ఉన్న సేవలు లేదా, వస్తు, సేవల కల్పనదారులు, సరఫరాదారులూ కంపోజిషన్ స్కీంను ఉపయోగించుకోవడానికి అర్హులని చెప్పిన సంగతీ విదితమే.

సుశీల్ మోదీ సారథ్యంలో కమిటీ

జీఎస్టీ అమలు తర్వాత ఆయా రాష్ట్రాలు ఆదాయాన్ని కోల్పోతున్న నేపథ్యంలో బీహార్ డిప్యూటీ సీఎం సుశీల్ మోదీ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో ఏర్పాటైన కమిటీ అందుకుగల కారణాలను పరిశీలించ నున్నది. గత నెల 22న జరిగిన జీఎస్టీ మండలి సమావేశంలో ఈ కమిటీని మండలికి నాయకత్వం వహిస్తున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ నియమించారు. ముఖ్యంగా పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, జమ్ముకశ్మీర్, ఒడిషా, గోవా, బీహార్, గుజరాత్, ఢిల్లీ రాష్ట్రాల ఆదాయం గణనీయంగా పడిపోయింది. గతేడాది ఏప్రిల్-నవంబర్ వ్యవధిలో కనిష్ఠంగా 14 శాతం నుంచి గరిష్ఠంగా 37 శాతం వరకు ఆదాయాన్ని ఈ రాష్ట్రాలు కోల్పోయినట్లు గణాంకాలు రుజువు చేస్తున్నాయి. పుదుచ్చేరి ఏకంగా 43 శాతం రెవిన్యూ నష్టాన్ని చవిచూసింది. ఈ రాష్ట్రాలకు జీఎస్టీ నష్టపరిహారం కింద రూ.48,202 కోట్లనూ కేంద్రం విడుదల చేసింది. అంతకుముందు ఏడాది ఇది రూ.48,178 కోట్లుగా ఉన్నది. దేశంలోని మొత్తం 31 రాష్ట్రాల్లో దక్షిణాది రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాలైన మిజోరాం, అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, సిక్కిం, నాగాలాండ్‌లు మాత్రమే జీఎస్టీ వచ్చాక రికార్డు స్థాయిలో ఆదాయాన్ని అందుకోగలుగుతున్నాయి. ఈ క్రమంలో మిగతా రాష్ట్రాల ఆదాయాన్నీ పెంచి జీఎస్టీ నష్టపరిహారం చెల్లింపులను తగ్గించుకోవాలని కేంద్రం భావిస్తున్నది. ఇప్పటికే వివిధ రకాల వస్తువులు, సేవలపై జీఎస్టీ రేట్లను తగ్గించడంతో నెలసరి వసూళ్లు పడిపోవడం, వ్యాపారుల అక్రమాలతో జీఎస్టీ చెల్లింపులు తగ్గిపోయిన నేపథ్యంలో నష్టపరిహారం భారాన్ని సర్కారు మోయలేకుండా ఉన్నది. 2017 జూలై 1న దేశవ్యాప్తంగా వస్తు, సేవల పన్ను అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే.

విజ్ఞానం

ఫైబర్‌తో పలు ప్రయోజనాలు



పీచుపదార్థాల వినియోగంతో అంటు వ్యాధులు(నాన్ కమ్యూనికబుల్) త్వరగా వ్యాప్తిచెందవని తెలుస్తోంది. ప్రపంచ ఆరోగ్యసంస్థ చేపట్టిన తాజా అధ్యయనం ప్రకారం, డైటరీ ఫైబర్, తృణధాన్యాల వినియోగం, అరటిపండ్లు, కమలాలు, ఏపిల్స్, మామిడి, స్ట్రాబెర్రీలు, రాస్‌బెర్రీలు, బీన్స్,లెగ్యూమ్, ముదురురంగు కూరగాయల్లో ఫైబర్ అధికంగా ఉండటంతో ఆరోగ్యానికి దోహదకారి అన్ని తెలుస్తోంది. బాదం, పిస్తా, గుమ్మడి, పొద్దుతిరుగుడు విత్తనాల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. 40ఏళ్లకుపైగా చేపట్టిన అధ్యయనంలో రోజుకు 25గ్రాముల నుండి 29గ్రాముల ఫైబర్ ఆహారంతో కొరొనరీ గుండెవ్యాధులు తగ్గుతున్నట్లు తెలుస్తోంది. టైప్ 2 డయాబెటిస్, కొలొరెక్టల్ కేన్సర్ 16 నుండి 24శాతం తగ్గుతోందని తెలుస్తోంది. ఫైబర్ ఆహారంతో శరీరబరువు, కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుందని న్యూజిలాండ్‌లోని యూనివర్సిటీ ఈఫ్ ఒటాగో వెల్లడించింది.

ప్రధాన సమస్యగా వెన్నునొప్పి



ప్రపంచవ్యాప్తంగా వేధించే సమస్యల్లో వెన్నునొప్పి ఒకటి. కెనడాలోని క్రెంబిల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ ఇన్ టొరంటో విశ్వవిద్యాలయం చేపట్టిన అధ్యయనంలో భాగంగా 12,782 మందిపై 16 ఏళ్లపాటు పరీక్షించారు. వీరితో 45.6 శాతం మంది బ్యాక్‌పెయిన్ బాధితులను తెలుస్తోంది. వీరిని నాలుగా భాగాలుగా విభజించారు అప్పుడప్పుడు బ్యాక్‌పెయిన్ ఎదుర్కొంటున్నవారు 33.4శాతం, నిరంతరం నొప్పి ఉన్నవారు 18శాతం, నొప్పి పెరుగుతున్నవారు 28.1శాతం, పుంజుకున్నవారు 20.5శాతం కాగా యాంటిడిప్రెసెంట్స్, ఒపియాడ్స్ వినియోగంతో ఈ సంఖ్య రికవర్ అవుతున్నట్లు తెలుస్తోంది. ఐదుమందిలో ఒకరు బ్యాక్‌పెయిన్ నుండి విముక్తులవుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి ఐదుమందిలో ఒకరు బ్యాక్‌పెయిన్ నిరంతరం ఉన్నట్లు తెలుస్తోంది.

నెల కనిష్ఠానికి చేరిన రూపాయి

ముంబై: డాలర్ మారకంతో రూపాయి విలువ నెల కనిష్ఠానికి చేరింది. దేశీయఈక్విటీలు సన్నగిల్లడం, అమెరికా డాలర్ విలువ బలపడటంతో రూపాయి విలువ దిగజారింది. ఇంటర్‌బ్యాంకుఫారెన్ ఎక్స్‌చేంజిలో రూపాయి అత్యంత కనిష్ఠంగా 70.50కి చేరింది. శుక్రవారం రూపాయి 8పైసలుదిగజారి 70.49కి చేరింది. మధ్యాహ్నం ట్రేడింగ్‌లో రూపాయి 70.81 చేరింది. అంతర్జాతీయ కరెన్సీలతో రూపాయి బలపడినట్లు ఫారెక్స్ ట్రేడర్లు వెల్లడించారు. డిసెంబరులో 18నెలల కనిష్టానికి దిగజారిన రూపాయి అంతర్జాతీయ ముడిచమురు ధరలతో రూపాయి వత్తిడికి లోనైనప్పటికీ 20శాతం పుంజుకుంది. చమురు ధరల బ్యారెల్ 60 డాలర్లకు చేరింది.



మళ్లీ 33వేలకు చేరిన పసిడి

న్యూఢిల్లీ: దేశీయ మార్కెట్లో పసిడికి మళ్లీ గిరాకీ పెరిగింది. అంతర్జాతీయ పరిణామాలు కూడా సానుకూలంగా ఉండటంతో బులియన్ మార్కెట్లో బంగారం ధర మళ్లీ రూ. 33వేల పైకి చేరింది. సోమవారం 10 గ్రాముల పుత్తడి ధర రూ. 225 పెరిగి రూ. 33,100గా ఉంది. అమెరికా కరెన్సీ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మళ్లీ బలహీనపడటంతో పసిడిలో పెట్టుబడులు పెట్టడమే శ్రేయస్కరమని మదుపర్లు భావించారు. దీనికి తోడు దేశీయంగా నగల వ్యాపారుల నుంచి కూడా కొనుగోళ్లు పెరగడంతో ధర పెరిగిందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. వెండి కూడా నేడు బంగారం బాటలోనే పయనించింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో బులియన్ మార్కెట్లో కేజీ వెండి ధర రూ.250 పెరిగి రూ. 40,100కు చేరింది. అంతర్జాతీయంగానూ ఈ లోహాల ధరలు స్వల్పంగా పెరిగాయి. న్యూయార్క్ మార్కెట్లో ఔన్సు పసిడి ధర 1,290.22 డాలర్లు, ఔన్సు వెండి ధర 15.73డాలర్లు పలికింది.

14 నుంచి బంగారం బాండ్ల విక్రయం

ముంబై: బంగారం బాండ్ల మలి విడత విక్రయం ఈ నెల 14న ప్రారంభం కానుంది. 18వ తేదీ వరకు కొనసాగుతుంది. గ్రాము బంగారం ధర రూ.3,214గా ఆర్‌బీఐ ఖరారు చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, డిజిటల్ రూపంలో చెల్లించే వారికి గ్రాము బంగారంపై రూ.50ను తగ్గింపు ఇవ్వనున్నట్లు తెలిపింది. దీంతో గ్రాము బంగారాన్ని రూ.3,614కే ఇవ్వనుంది. బ్యాంకులు, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్, ఎంపిక చేసిన పోస్టాఫీసులు, ఎన్ఎస్ఈ, బీఎస్ఈ ద్వారా వీటిని కొనుగోలు చేయవచ్చు. ఒక వ్యక్తి ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా 500 గ్రాముల వరకు కొనుగోలు చేసుకునేందుకు అవకాశం ఉంది. కనీస పెట్టుబడి ఒక గ్రాము. సార్వభౌమ బంగారం బాండ్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం మొదటిసారిగా 2015 నవంబర్‌లో ప్రారంభించింది.

నష్టాల్లో మార్కెట్లు

156పాయింట్ల నష్టంతో సెన్సెక్స్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం 156 పాయింట్ల నష్టంతో ముగిసింది. ఆసియా మార్కెట్ల బలహీన సంకేతాలు, అమ్మకాల ఒత్తిడితో ఉదయం సూచీలు నష్టాలతో ప్రారంభ మయ్యాయి. చైనా ఆర్థిక వ్యవస్థ మరింత మందగిస్తుందని ఆ దేశ ట్రేడ్ డేటా వెల్లడిస్తుండటం అంతర్జాతీయ మార్కెట్లను ఒత్తిడికి గురి చేస్తోంది. ఈ ప్రభావం దేశీయ మార్కెట్లపైనా పడింది. దీనికి తోడు కంపెనీల త్రైమాసిక ఫలితాలపై మదుపర్లు దృష్టిపెట్టడం, చమురు ధరలు మళ్లీ పెరుగుతుండటం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా నేటి ట్రేడింగ్‌లో సూచీలు నష్టాలను మూటగట్టుకున్నాయి. విదేశీ నిధుల ఉపసంహరణ, పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలు 17నెలల కనిష్టానికి దిగజారడంతో సూచీలు నష్టాలు నమోదుచేసాయి. తీవ్ర ఊగిసలాటల అనంతరం 30షేర్ల ఇండెక్స్ 156.28 పాయింట్లు నమోదుచేసి 0.43శాతంతో 35,853పాయింట్లు నమోదు చేసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 57.35పాయింట్ల నష్టంతో 0.53శాతంతో 10,737.60 పాయింట్లు నమెదుచేసింది. భారతీయ జెట్ ఎయిర్‌వేస్ 18శాతానికిపైగా జంప్ చేసింది. ఎల్ అండ్ టి, ఇండస్‌ఇండ్ బ్యాంకు, పవర్‌గ్రిడ్, ఎన్‌టిపిసి, టిసిఎస్, ఐసిఐసిఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, హీరో మోటాకార్ప్, బారతి ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, 2.64శాతం దిగజారింది. మరోవైపు యస్‌బ్యాంకు అతిపెద్ద గెయినర్ కాగా 6.22శాతం ర్యాలీ నమోదుచేసింది. ఇన్ఫోసిస్ టాప్ గెయినర్‌కాగా, 2.58 శాతం లాభం నమోదుచేసింది. కాగా శుక్రవారం కంపెనీ రూ.8260 కోట్ల విలువగల షేర్లు బైబాక్ ప్రకటించింది. షేర్‌హోల్డర్లకు రూ.4పర్ షేర్ డివిడెండ్ ప్రకటించడమైంది. దీనికోసం రూ.13,000 కోట్లు క్యాపిటల్ పాలసీ కింద ప్రకటించింది. అవెన్యూ సూపర్‌మార్ట్స్ షేర్లు 8శాతంపైగా దిగజరాయి. ఆసియా, హాంగ్‌కాంగ్ హాంగ్‌శాంగ్ షేర్లు 1.43శాతంపైగా దిగజారాయి. కాస్పి 0.66శాతం, షాంఘై కాంపోజిట్ ఇండెక్స్ 0.56శాతం వద్ద ట్రేడయింది. జపాన్ నిక్కీ 0.97 శాతం లాభపడింది. జౌజోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 23,995 వద్ద నమోదైంది.

8నెలల కనిష్ఠానికి ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: చమురు ధరలు అదుపులోకి రావడం, కొన్ని ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పట్టడంతో డిసెంబరు నెల టోకు ద్రవ్యోల్బణం 8 నెలల కనిష్ఠానికి చేరి 3.80శాతానికి చేరింది. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2018 డిసెంబరులో టోకు ధరల సూచీ(డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 3.80శాతంగా నమోదైంది. అంతక్రితం నవంబరులో 4.64శాతంగా ఉంది. ఇక 2017 డిసెంబరులో ఇది 3.58శాతంగా నమోదైంది. 2018 ఏప్రిల్‌లో నమోదైన 3.62శాతం టోకు ద్రవ్యోల్బణం తర్వాత ఇదే కనిష్ఠం కావడం గమనార్హం. డిసెంబరు నెలలో కూరగాయల ధరల ద్రవ్యోల్బణం 26.98శాతం నుంచి 17.55శాతానికి తగ్గింది. ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బణం 16.28శాతం నుంచి 8.38శాతానికి తగ్గింది. దాదాపు సగం మేర తగ్గుదలను నమోదు చేసుకుంది. డిసెంబరు నెలలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుముఖం పట్టడం వల్లే ఇది జరిగింది. ఇక బంగాళదుంపల ధరలు చౌక కావడంతో కూరగాయల ద్రవ్యోల్బణం 86.45శాతం నుంచి 48.68శాతానికి చేరింది. పప్పు ధాన్యాల ధరల్లో వృద్ధి 2.11శాతంగా ఉంది. అటు భారత పారిశ్రామికోత్పత్తి సూచీ(ఐఐపీ) 17నెలల్లోనే అత్యల్ప వృద్ధి నమోదు చేసింది. నవంబరులో 0.5శాతంగా నమోదైంది. మన్నికైన వినిమయ వస్తువులు, యంత్ర పరికరాలు సహా తయారీ రంగాలు నిరాశపరచడమే ఇందుకు కారణం.

అమెజాన్‌లో మరో 1300 మందికి ఉద్యోగాలు



బెంగళూరు : ఈ కామర్స్ బిజినెస్ దిగ్గజం అమెజాన్ త్వరలో 1300 మంది ఉద్యోగులను నియమించనుంది. ప్రపంచంలోనే భారతదేశంలో ఎక్కువమంది ఉద్యోగులను నియమించాలని అమెజాన్ నిర్ణయించింది. భారతదేశంలో 1300 పోస్టులు, చైనాలో 467, జపాన్ లో 381, ఆస్ట్రేలియాలో 250, సింగపూర్‌లో 174, దక్షిణ కొరియాలో 70 పోస్టులను భర్తీ చేయాలని అమెజాన్ నిర్ణయించింది. భారతదేశంలో అమెజాన్ తన వ్యాపారాన్ని విస్తరించేందుకు వీలుగా ఈ కొత్త రిక్రూట్‌మెంట్ చేపట్టనుంది. కొత్త ఉద్యోగుల నియామకం బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాల్లో చేపట్టాలని అమెజాన్ యోచిస్తోంది. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, వివిధ ఉత్పత్తుల మార్కెటింగ్, వెబ్ డెవలప్ మెంట్, సప్లయి చైన్, కాంటెంట్ డెవలప్ మెంట్ విభాగాల్లో నిపుణులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని అమెజాన్ అధికార ప్రతినిధి వెల్లడించారు.

డిస్కంల అప్పులు రూ. 39,498 కోట్లు

న్యూఢిల్లీ : దేశ ప్రగతిలో కీలకమైన విద్యుత్ రంగంలో అంతకంతకీ రుణ భారం పెరిగిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వాల ఆదీనంలో ఉన్న విద్యుత్ పంపిణీ విభాగం (డిస్కం)లు విద్యుత్ తయారీ కంపెనీలకు చెల్లించ వలసిన రుణ భారం అక్టోబర్ 2018 నాటికి రూ. 39,498 కోట్లకు చేరిందని ప్రభుత్వం నివేదికలో తెలిపింది. అక్టోబర్ నుంచి నేటి వరకూ లెక్కగడితే అవి రూ. 50,000 కోట్లకు చేరనుందని తెలుస్తుంది. 2017 అక్టోబర్‌లో అప్పుల భారం రూ. 31,676 కోట్లు కాగా ఏడాదిలో అది 24 శాతం పెరిగిందని అధికారులు తెలిపారు. ఉత్తర్ ప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా, ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన డిస్కంలు అధిక శాతం రుణ భారం కలిగినవిగా గుర్తించారు. అలాగే ఈ డిస్కంలు అప్పులు చెల్లించేందుకు దాదాపుగా 500 పై రోజుల సమయం తీసుకుంటునట్లు తెలిపారు. డిస్కంలు ఎక్కువగా పబ్లిక్ సెక్టార్‌కు చెందిన విద్యుత్ తయారీ కంపెనీలకు అప్పులు పడినట్లు, ఎన్‌టీపీసీకి రూ. 15,661 కోట్లు, ఎన్‌హెచ్‌పీసీకి రూ. 3,011 కోట్లు, దామోధర్ వ్యాలీ కార్పొరేషన్‌కు రూ. 1,990 కోట్ల వరకూ రుణం ఉన్నట్లు తెలుస్తుంది. అయితే ప్రైవేటు రంగంలో అదానీ పవర్‌కు రూ. 6,878 కోట్లు, బజాజ్ గ్రూప్‌కు రూ.1,861 కోట్లు జీఎంఆర్‌కు రూ. 1,630 కోట్ల అప్పులు చెల్లించాల్సి ఉంది. ఈ అప్పుల భారంతో విద్యుత్ తయారీ కంపెనీల్లో ఆర్థిక ఇబ్బందులు తలెత్తున్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా ప్రైవేటు రంగ కంపెనీల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. డిస్కంల ఆర్థిక పరిస్థితి సమీక్షించేందుకు, అలాగే రుణాలను తీర్చే మార్గాలను సూచించేందుకు ప్రభుత్వం సిన్హా కమిటీని ఏర్పాటుచేసింది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలో పలు మంత్రిత్వ శాఖలు సిన్హా కమిటీ ప్రతిపాధనలను సమీక్షించనున్నాయి.

డాలర్లను అమ్మిన ఆర్బీఐ



ముంబై: నవంబర్ నెలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 644 మిలియన్ డాలర్లను స్పాట్ మార్కెట్‌లో అమ్మేసింది. రూపాయి మారకం విలువ పతనాన్ని అడ్డుకోవడానికి డాలర్లను విక్రయించినట్టు ఆర్బీఐ విడుదల చేసిన గణాంకాలు తెలుపుతున్నాయి. 2017లో రూపాయి విలువ స్థిరంగా ఉన్నందున 2.570 బిలియన్ డాలర్లను కొనుగోలు చేసి 1.706 బిలియన్ డాలర్లను విక్రయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూపాయి మారకం విలువ పతనం అవుతున్న నేపథ్యంలో కట్టడి చేసేందుకు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని ఆర్బీఐ పేర్కొంది. అక్టోబర్ నెలలో కూడా 945 మిలియన్ డాలర్లను కొనుగోలు చేసి 8.149 బిలియన్ డాలర్లను విక్రయించింది. రూపాయి మారకంలో ఎదురయ్యే ఒడిదుడుకులను కట్టడి చేసేందుకు కరెన్సీ మార్కెట్‌లో ఆర్బీఐ జోక్యం చేసుకోవడం సాధారణమే. కాగా, రూపాయి మారకం విలువ రూ. 74 కనీస స్థాయికి పడిపోయిన నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల కాలంలో 34 బిలియన్ డాలర్లను విక్రయించింది. 2018లో ఏప్రిల్-నవంబర్ మధ్య కాలంలో స్పాట్ కరెన్సీ మార్కెట్‌లో 26.51 బిలియన్ డాలర్లను విక్రయించింది. 2017లో ఇదే కాలంలో 18.017 బిలియన్ డాలర్లను కొనుగోలు చేసింది. ఏప్రిల్13, 2018తో ముగిసిన వారంతంలో ఫారెక్స్ రిజర్వులు జీవితకాల రికార్డు స్థాయిలో 426.028 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. కానీ, ఆ తర్వాత నుంచి వరుసగా ఎదురవుతున్న కరెన్సీ మార్కెట్ ఒడిదుడుకులతో రూపాయి మారకం విలువ మరింత పతనం కాకుండా ఉండేందుకుగాను రిజర్వ్ బ్యాంక్ డాలర్లను అమ్మడం ద్వారా జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

ఎఫ్ఐఐల అమ్మకాలు

విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు గత తొమ్మిది ట్రేడింగ్ సెషన్లలో రూ. 3,677 కోట్ల పెట్టుబడులను క్యాపిటల్ మార్కెట్ నుంచి విరమించుకున్నారు. దేశీయ ఆర్థిక గణాంకాలు, బడ్జెట్, సాధారణ ఎన్నికలున్న క్రమంలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అప్రమత్త ధోరణిని అవలంభిస్తున్నారు. ఈ నెల 1-12 మధ్య కాలంలో మొత్తం రూ. 3,677 కోట్ల పెట్టుబడులను ఈక్విటీ మార్కెట్ నుంచి విరమించుకున్నారు. అయితే రుణ మార్కెట్లో మాత్రం రూ. 1,872 కోట్ల పెట్టుబడులను పెట్టారు. గత నవంబర్- డిసెంబర్ మధ్య కాలంలో నికరంగా రూ. 8,584 కోట్ల పెట్టుబడులను పెట్టిన ఎఫ్ఐఐలు.. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా తిరిగి అమ్మకాలను జరుపుతున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ముక్తా థియేటర్లు

విజయవాడ : దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరణలో భాగంగా 'ముక్తాఏ2 సినిమాస్' తెలుగు రాష్ట్రాల్లో పాగా వేస్తోంది. ఇప్పటికే వైజాగ్‌లో అడుగు పెట్టిన ముక్తా...తాజాగా హైదరాబాద్ శంషాబాద్‌లోసింగిల్ స్క్రీన్ థియేటర్‌ను ప్రారంభించింది. 487 సీట్ల సామర్థ్యం ఉన్న ఈ థియేటర్‌కు డాల్బీ సరౌండ్ సౌండ్ సిస్టమ్, డిజిటల్ పిక్చర్ క్వాలిటీ వంటి ప్రత్యేకతలు ఉన్నాయి. హైదరాబాద్‌లో తమ కంపెనీకి ఇది మొదటి థియేటర్ అని, టికెట్ల ధరలు చౌకగానే ఉంటాయని ముక్తాఏ2 సినిమాస్ ఎండీ రాహుల్ పురి అన్నారు. హైదరాబాద్, ముంబై, అహమ్మదాబాద్, బరోడా, వైజాగ్, భోపాల్, ఔరంగాబాద్ వంటి 17 నగరాల్లో ఈ కంపెనీకి 51 స్క్రీన్లు ఉన్నాయి.

మార్కెట్‌లో హయర్ పల్చని ఫ్రిజ్..!

విజయవాడ : ఎలక్ట్రానిక్స్ గృహోపకరణాల ఉత్పత్తిలో గత పదేళ్లుగా ప్రపంచ నెంబర్‌వన్‌గా నిలిచిన హయర్ తన అత్యంత పల్చని సైడ్ బై సైడ్ రిఫ్రిజిరేటర్ హెచ్ఆర్ఎఫ్ 619 కెఎస్ బ్లాక్ స్టీల్ ఎడిషన్‌ను విడుదల చేసింది. ఇది వంట గదులకు ఆకర్షణీయ రూపాన్ని అందించడమే కాకుండా, తన సౌందర్యంతో అప్‌స్కేల్ ఫీల్‌ను అందిస్తుంది. ఈ రిఫ్రిజిరేటర్ 655 మిల్లీమీటర్లు.లోతును కలిగి ఉండగా, స్మూత్ టచ్ గ్లాస్ డిజిటల్ కంట్రోల్ ప్యానల్, హాలిడే, స్మార్ట్ ఫంక్షన్ కలిగి ఉండడంతో వినియోగదారులు సెలవు రోజుల్లో బయట ఉన్నప్పుడు కూడా ఉష్ణోగ్రతలను సెటింగ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇది ఫ్రీజర్ విభాగాన్ని సాధారణ స్థాయిలో ఉంచుతుంది, రిఫ్రిజిరేటర్ విభాగాన్ని 17 డిగ్రీ సెల్సియస్‌కు పరిమితం చేయడం ద్వారా దీర్ఘకాలం ఫ్రిజ్ ను వినియోగించకుండా, దుర్వాసన రాకుండా నియంత్రిస్తుంది. ఈ సందర్భంగా హయర్ అప్లయెన్సెస్ ఇండియా అధ్యక్షుడు ఎరిక్ బ్రంగా మాట్లాడుతూ "హయర్ లో మేము వినియోగదారుల అవసరాలను అర్థం చేసుకుంటాం, వరుసగా నూతన ఆవిష్కారాలను కాలానుగుణంగా పరిచయం చేయడం ద్వారా వినియోగదారులకు మహోన్నత అనుభవాలను అందుబాటులోకి తీసుకు వస్తున్నాము. ఆధునిక, సంప్రదాయక, సమకాలీన లక్షణాలను కలిగి, అన్ని రకాల వంట గదులకు ఒదిగిపోతుంది" అని తెలిపారు. నూతన హెచ్ఆర్ఎఫ్ -619 కెఎస్ బ్లాక్ స్టీల్ ఎడిషన్ సైడ్ బై సైడ్ రిఫ్రిజిరేటర్లు దేశ వ్యాప్తంగా రూ.1,05,000లకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఆక్సిజన్...ఎజోట్



ఫ్రెంచి రసాయనిక శాస్త్రవేత్త ఆంటోని లావోయి జీర్‌ను ఆధునిక రసాయన శాస్త్ర పితామహుడు అంటారు. ఆయన గాలిలో రెండు వాయువులు వుంటాయని రుజువు చేశాడు. ఒకటి-దహన ప్రక్రియలోను, శ్వాసప్రక్రియలోను ఉపయోగపడుతుందని, రెండవది దహన ప్రక్రియకు సహకరించదని ఆయన సూచించాడు. మొదటిదాన్ని 'ఆక్సిజన్'అని, రెండవదాన్ని 'ఎజోట్'అని పిలిచాడు. ఈ 'ఎజోట్' యే ప్రస్తుత నైట్రోజన్. లావోయిజీర్ ద్రవ్య పరిరక్షిత సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. 'ఎలిమెంటరీ ట్రీటైజస్ ఆన్ కెమిస్ట్రీ' అనే గ్రంథంలో తన పరిశోధనలను వివరించాడు. **1746 ఆగస్టు 26న** జన్మించిన లావోయి జీర్‌ను ఫ్రాన్స్ ప్రభుత్వం, ఆయన రాజకీయాభిప్రాయాలతో విభేదించి **1774 మే 8న** మరణశిక్ష విధించింది.

జెరంవార్ ఫేర్

వ్యాధులు కలిగించే బాక్టీరియాను, వైరస్‌ను యుద్ధాలలో వాడి శత్రుదేశాలకు చెందిన మనుషులకు, జంతువులకు, మొక్కలకు హాని కలిగించటాన్ని "బయోలాజికల్ వార్ ఫేర్" అంటారు. దీన్నే 'జెరంవార్ ఫేర్' అని కూడా పిలుస్తారు. కాగా ఈ యుద్ధ తంత్రాన్ని ఉపయోగించకూడదంటూ 1972లో ఒక అంతర్జాతీయ ఒడంబడిక జరిగినది.

మాస్‌స్పెక్ట్రోగ్రాఫ్

▶ పదార్థాలను విశ్లేషించడానికి ఉపయోగించే పరికరాన్ని 'మాస్ స్పెక్ట్రోగ్రాఫ్" అంటారు. దీన్ని బ్రిటన్‌కు చెందిన విలియమ్ ఫ్రాన్సిస్ ఆస్టన్ రూపొందించాడు. దీని ద్వారా పదార్థంలో వున్న అణువులు, పరమాణువులను గుర్తించవచ్చు. అవి ఎన్నెన్ని వున్నాయో కూడా లెక్కించవచ్చు. భూగర్భ, రసాయన, జీవ శాస్త్రాల్లోనూ, న్యూక్లియర్ ఫిజిక్స్ మొదలైన శాస్త్రాలలో దీన్ని ఉపయోగిస్తారు ఐసోటోపిక్ అధ్యయనంలో ఇది అత్యంత ఉపయుక్తం. దీనిని ఉపయోగించి 212 ఐసోటోపుల్ని ఆస్టన్ కనుగొన్నాడు. ఈ పరికరాన్ని రూపొందించినందుకు 1922లో ఆస్టన్‌కు నోబెల్ బహుమతి లభించింది. ఆ తరువాత డెంప్‌స్టర్, బెయిన్‌బ్రిడ్జ్, నియర్ మొదలైన శాస్త్రజ్ఞులు ఈ పరికరాన్ని మరింత అభివృద్ధి చేశారు.

650 రకాలకు ప్రమాదం

▶ రకరకాల కాలుష్యాలు కారణంగానూ, మానవుడు ప్రకృతి మీద విచక్షణా రహితంగా దాడి చేయడం వల్ల ఇప్పటికి 225 రకాలకు పైగా పక్షిజాతులు, నూటికి పైగా పాలిచ్చే జంతువులు పూర్తిగా అంతరించిపోయాయని శాస్త్రజ్ఞుల అంచనా. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న కాలంలో 650 రకాల జంతువులు కూడా అంతరించిపోయే ప్రమాదం వుంది.

ప్రోటీన్ అంటే... ప్రథమం

▶ ప్రతి జీవకణంలోనూ ప్రోటీన్లు వుంటాయి. ప్రోటీను అనే పదం గ్రీకు భాష నుండి వచ్చింది. గ్రీకులో ప్రోటీను అంటే "ప్రథమ" అని అర్థం. ప్రోటీన్లు శరీరంలో అనేక విధులను నిర్వహిస్తాయి. ఎంజైములు అనే ముఖ్యమైన ప్రోటీన్లు ఆహారాన్ని జీర్ణం చేస్తాయి. ఇమ్యూన్ ప్రోటీన్లు అంటువ్యాధుల నుండి రక్షిస్తాయి. ప్రోటీన్ల లోపం ఏర్పడితే శరీరంలో అలసట ఏర్పడుతుంది. రోగనిరోధక శక్తి సన్నగిల్లుతుంది. కాగా ప్రోటీన్లు అంటే అమినో ఆమ్లాల రసాయనిక చర్యల వలన ఏర్పడిన రసాయనిక సంయోగపదార్థాలే. ఈ అమినో ఆమ్లాలు 21కి పైగా వున్నాయి. ప్రతి ఆమ్లంలోనూ కర్బనము, నత్రజని, ఆక్సిజన్, హైడ్రోజన్ వుంటాయి. వేర్వేరు అమినో ఆమ్లాల సంయోగ, వియోగాల వల్ల కొన్ని వేల ప్రోటీన్లు ఏర్పడతాయన్నమాట. మనం ఆహారంగా తీసుకునే పాలు, గ్రుడ్లు, చేపలు, మాంసం మొదలైన వాటిలో ప్రోటీన్లు అత్యధికంగా వున్నాయి.

ఎడం చేతివాటం

▶ మనుషుల్లో గానీ, జంతువులలో గానీ ఎడంచేతివాటం గల వాళ్ళు చాలా తక్కువ. కానీ ధృవ ప్రాంతాల్లో వుండే ఎలుగుబంట్లు అన్నీ ఎడంచేతి వాటంవే.




ముద్రణ...

▶ అచ్చువేయడం మొట్టమొదట చైనాలో ప్రారంభమైందని అంటారు. కాని ప్రపంచంలో ప్రథమ ముద్రణాలయాన్ని జర్మనీ దేశస్థుడైన జాన్ గూటెన్‌బర్గ్ 15వ శతాబ్దం మధ్యకాలంలో స్థాపించాడు. 1476లో విజయవంతంగా ముద్రణాలయాన్ని స్థాపించిన ఖ్యాతి ఇంగ్లాండ్‌కు చెందిన విలియంకాక్స్‌టన్‌కు దక్కింది. కాగా అచ్చుపని సాంకేతికంగా అభివృద్ధి చెందినది మాత్రం 19వ శతాబ్దంలోనే.

అణుశక్తిరంగంలో నిష్ణాతుడు

విల్లార్డ్ ఫ్రాంక్ లిబ్బీ

పురావస్తుశాస్త్ర రంగంలో అంటే ఆర్కియాలజీలో విప్లవాత్మక పరిణామాలకు దారితీసిన రేడియోకార్బన్ డేటింగ్ (Radio Carbon Dating) పద్ధతి కనుగొని ప్రపంచ ప్రసిద్ధి చెందిన విలియం ఫ్రాంక్ లిబ్బీకి 1960లో కెమిస్ట్రీ రంగంలో నోబెల్ బహుమతి లభించింది. రేడియేషన్ (అణుధార్మికత)పై ఎంతో లోతైన పరిశోధనలు చేసి అణుశక్తిరంగంలో ప్రఖ్యాతిచెందాడు.





అమెరికాలోని కలరాడో రాష్ట్రంలో గ్రాండ్ వాలీలో 1908 డిసెంబరు 17న ఒక రైతు కుటుంబంలో జన్మించి, లిబ్బీ స్వయంకృషితో కెమిస్ట్రీలో అగ్రగణ్యుడు అయ్యాడు. కాలిఫోర్నియా రాష్ట్రంలో సెబస్టీపోల్‌లో చదువు ప్రారంభించి, రష్యన్ రివర్ ప్రాంతంలో ముందుకు సాగి, కాలిఫోర్నియా యూనివర్శిటీలో ప్రఖ్యాత బర్క్‌లీ కాంపస్‌లో 1933లో కెమిస్ట్రీలో డాక్టరేటు పొంది, తన అసమానశక్తిసా మర్థ్యాలను నిరూపిం చుకొన్నాడు. 1941లో మరింత పరిశోధన కొనసాగిం చడానికి ప్రిన్స్‌టన్ యూనివర్శిటీ నుండి ఒక విశిష్టమైన స్కాలర్‌షిప్ కూడా పొందాడు. ఇంతలో రెండవ ప్రపంచయుద్ధం రావడంతో, దానిలో అమెరికా కూడా పాలుపంచుకోవడంతో కొలం బియా యూనివర్శిటీకి వెళ్లి అణుశక్తిపై పరిశోధనలు ప్రారంభించారు. మెన్‌హాటన్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్‌లో భాగస్వామి అయ్యాడు. యురేనియం-235పై ఎంతో విలువైన పరిశోధన కొనసాగించాడు. అతని పరిశోధన హిరోషిమాపై ఆటంబాంబు ప్రయోగానికి మార్గం సుగమం చేసింది.

1945లో చికాగో యూనివర్శిటీ ప్రొఫెసర్ అయ్యాడు. 1954లో అమెరికన్ యాటమిక్ ఎనర్జీ కమిషన్ సభ్యుడయ్యాడు. కాలిఫోర్నియా యూనివర్శిటీలో జియోఫిజిక్స్, ప్లానిటరీ ఫిజిక్స్ డైరెక్టర్ అయ్యాడు. చంద్రమండలంపై మానవులు కాలుమోపడానికి తోడ్పడ్డాడు. లాస్ ఏంజిలిస్‌లోని కాలిఫోర్నియా యూనివర్శిటీలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ విభాగాన్ని 1972లో ప్రప్రథమంగా ప్రారంభించాడు.

లిబ్బీ తన సహచరులు, విద్యార్థుల సహకారంతో మరింత పరిశోధన కొనసాగించి Carbon-14 Dating విధానాన్ని కనుగొన్నాడు. తన పరిశోధన ద్వారా Tritium కూడా కనుగొని తద్వారా Dating of water, wine కూడా కనుగొన్నాడు. ఈ Carbon dating ద్వారా ఆర్కియాలజీ రంగంలో పరిశోధనలను ఎంతో సుగమం చేసి, పురాతనవస్తువుల కాలనిర్ణయం చేయడంలో ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందాడు. అమెరికాలో ఎన్నో ప్రఖ్యాత పరిశోధనాసంస్థలలో ప్రముఖపాత్ర వహించాడు. 72 సంవత్సరాల వయస్సులో 1980సెప్టెంబరు 8న ఈ ప్రఖ్యాత Physical Chemist కన్నుమూశాడు. లిబ్బీ ఎన్నో ప్రామాణిక అణుశాస్త్ర గ్రంథాలు రచించాడు. "Radiocarbon Dating" (1955), "Radio active Fall out" (1958), "History of Radio Active Dating", (1972) వాటిలో కొన్ని ముఖ్యమైనవి. అణుశక్తిని యాటంబాంబు నిర్మాణానికే కాక, శాంతియుత ప్రయోజనాలకు అణుశక్తిని వినియోగించడానికి అతని పరిశోధనలు ఎంతో దోహదకారి అయ్యాయి.

వాస్తవాన్ని ప్రతిబింబించే కథ 'ఉత్తర'



లైవ్ ఇన్ సీ క్రియేషన్ అండ్ గంగోత్రి ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై శ్రీరామ్, కారుణ్య హీరోహీరోయిన్లుగా అజయ్ ఘోష్ ప్రధాన పాత్రలో వస్తున్న చిత్రం 'ఉత్తర'. శ్రీపతి గంగదాస్‌తో కలిసి ఎస్ఆర్ తిరుపతి నిర్మిస్తూ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ చిత్ర పోస్టర్ రిలీజ్ చేశారు యూనిట్ సభ్యులు. టిల్లు వేణు, అదిరే అభి, అభయ్ నటిస్తున్న ఈ చిత్రానికి 'నీది నాది ఒకే కథ' ఫేం సురేష్ యువన్ సంగీతాన్ని అందిస్తున్నారు. 'అర్జున్ రెడ్డి' చిత్రానికి అసోసియేట్ కెమెరామెన్‌గా పనిచేసిన చరణ్ బాబు సినిమాటోగ్రఫిని అందిస్తున్నారు. సమకాలీన గ్రామీణ నేపథ్యంతో.. వాస్తవాన్ని ప్రతిబింబించే కథ, సన్నివేశాలతో అత్యంత సహజంగా రూపుదిద్దుకొన్న అంశాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ అని చిత్ర యూనిట్ పేర్కొంటోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రంలోని పాటలు, టీజర్‌కి మంచి రెస్పాన్స్ లభించింది. దాంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ భారీగా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తోందట. ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందించడానికి ఈ సినిమాను అమెరికాలోని సోని స్కోరింగ్ స్టూడియోలో రీరికార్డింగ్ చేశారు. చెన్నైలో గ్రాఫిక్ పనులు జరుగుతున్నాయి. ఏప్రిల్‌లో అత్యుత్తమ క్వాలిటీతో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని దర్శకుడు తిరుపతి వెల్లడించారు.

మిస్టర్ మజ్ను' జ్యూక్ బాక్స్ విడుదల



'తొలిప్రేమ' ఫేం వెంకీ అట్లూరి దర్శకత్వంలో అఖిల్ అక్కినేని హీరోగా తెరకెక్కిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ మజ్ను'. శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పీ పతాకంపై భారీ నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకొని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి జనవరి 25న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించి విడుదలైన పాటలకు, టీజర్‌కు చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. 'ఏమైనదో... ఏమైనదో', మిస్టర్ మజ్ను టైటిల్ సాంగ్, 'హార్ట్ బ్రేక్' పాటలకు మంచి ఆదరణ లభిస్తోంది. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన జ్యూక్ బాక్స్‌ను విడుదల చేయబోతున్నారు. అఖిల్ అక్కినేని సరసన నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.

మానుషిని వెండితెరకు పరిచయం చేయనున్న ఫరాఖాన్



బాలీవుడ్ నిర్మాత, దర్శకురాలు, కొరియోగ్రాఫర్, నటి ఫరాఖాన్ గతంలో దీపికా పదుకొనెను 'ఓం శాంతి ఓం'తో వెండి తెరకు పరిచయం చేశారు. చూస్తుండగానే దీపిక టాప్ రేంజ్‌కు వెళ్లిపోయింది. ఇప్పుడు ఫరాఖాన్ మరో నటిని బాలీవుడ్‌కు పరిచయం చేయను న్నారు. మీడియాకు అందిన సమాచారం ప్రకారం మిస్ వరల్డ్ మానుషి ఛిల్లర్, ఫరా ఖాన్‌లు కలుసుకుని ఒక సినిమా గురించి చర్చించారు. మానుషికి ఆ సినిమాకు సంబం ధించిన స్క్రిప్ట్ నచ్చిందని తెలియవచ్చింది. దీంతో వీరిద్దరూ గోవా చేరుకుని, స్క్రిప్ట్‌కు మరింతగా మెరుగులు దిద్దనున్నారని సమాచారం. కాగా మానుషి ఛిల్లర్ 2017లో మిస్‌వరల్డ్‌గా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఆమె బాలీవుడ్ ఎంట్రీ గురించి వివిధ వార్తలు వినిపిస్తున్నాయి.

టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు కె.రంగారావు కన్నుమూత



టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు కట్టా రంగారావు (62) కన్ను మూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడు తున్న ఆయన నేడు హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. 1957 మే 5వ తేదీ జన్మించిన రంగారావు ఇంద్రధనస్సు, నమస్తే అన్న, ఉద్యమం, చెప్పుకోండి చూద్దాం, బొబ్బిలి బుల్లోడు తదితర చిత్రాలకు దర్శకత్వం వహించారు. దర్శకుల సంఘంలో కూడా రంగారావు కీలక బాధ్యతలు నిర్వహించారు. రంగారావు మృతికి సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

ఆసక్తిరేపుతున్న నందితాశ్వేత 'అక్షర' మోషన్ పోస్టర్



నందితాశ్వేత ప్రధాన పాత్రలో రూపొందుతున్న'అక్షర' మూవీ మోషన్ పోస్టర్ భోగి సందర్భంగా విడుదల చేసింది చిత్రయూనిట్. హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాగా.. సినిమా హాల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ సినిమాకు చిన్నికృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. సమాజంలో విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే కంటెంట్‌తో ఈ సినిమా రూపొందిందని తెలుస్తోంది. తాజాగా విడుదలైన మోషన్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేసేలా ఉంది. ఈ సందర్భంగా దర్శకుడు బి. చిన్నికృష్ణ మాట్లాడుతూ.."విద్య సమాజాన్ని మార్చే బలమైన ఆయుధం. కానీ విద్యావ్యవస్థ ఫక్తు వ్యాపారంలా మారిపోయింది. అలాంటి వ్యవస్థ పై అక్షర చేసే పోరాటం వినూత్నంగా ఉంటుంది. నందితాశ్వేత అక్షర పాత్రకు ప్రాణం పోస్తుంది. ఆమె కెరియర్‌లోనే ఈ పాత్ర బెస్ట్‌గా నిలుస్తుంది. సురేష్ బొబ్బిలి అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ హైలెట్ అవుతుంది. ప్రస్తుతం ఫస్ట్ షెడ్యూల్ కంప్లీట్ చేసుకుంది. శరవేగంగా మిగతా షూట్‌ని కంప్లీట్ చేసి సమ్మర్‌లో విడుదలకు ప్లాన్ చేస్తున్నాం" అన్నారు. చిత్రంలో నందితా శ్వేతా, సత్య, అభినవ్, శ్రీ తేజ్, అజయ్ ఘోష్, సంజయ్ స్వరూప్, శ్రీకాంత్ అయ్యర్, అప్పాజీ అంబరీష, మాణిక్యం రెడ్డి తదితరులు నటిస్తున్నారు.



'రౌడీ భాయ్' ఫస్ట్‌లుక్



భీమవరం టాకీస్ పతాకంపై నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ నిర్మించిన చిత్రం 'రౌడీ భాయ్'. ఈ సినిమాకు ఉదయ్ దర్శకత్వం వహించగా.. అర్జున్ సంగీతం అందించారు. కాగా తాజాగా ఈ రౌడీ భాయ్ ఫస్ట్‌లుక్‌ని మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ శ్రీ కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ కొణిజేటి రోశయ్య గారు మాట్లాడుతూ.. "నిర్మాత రామ సత్యనారాయణ గారికి సినిమా పట్ల ఉన్న ప్రేమ.. ఇప్పటివరకు దాదాపు వంద సినిమాలుకు చేరువకి తీసుకొచ్చింది. అన్ని సినిమాల్లోనూ డిఫరెంట్ డిఫరెంట్ కాన్సెప్ట్‌తో సినిమాలు నిర్మిస్తూ కొత్త కొత్త నటీ నటులను, సాంకేతిక నిపుణులను సినీ పరిశ్రమకి పరిచయం చేస్తూనే ఉన్నాడు. ఈ పోటీ ప్రపంచంలో ఇన్ని సినిమాలు నిర్మించిన ఆయన మరెన్నో మంచి సినిమాలు నిర్మించాలని, ఆయన ప్రతి ఒక్క సినిమా మంచి విజయాన్ని సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అన్నారు. అనంతరం నిర్మాత రామ సత్యనారాయణ గారు మాట్లాడుతూ.. "హీరో మానస్, షిప్ర కౌర్, స్మైల్ శ్రీను, సంగా తదితరులు నటించిన ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను లాంఛనప్రాయంగా మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ శ్రీ కొణిజేటి రోశయ్య గారి చేతుల మీదుగా ఆవిష్కరించడం ఆనందంగా ఉంది. అతిత్వరలో నిర్మాణాంతర కార్యక్రమాలు పూర్తి చేసి విడుదలకు సిద్ధం చేస్తున్నాం" అన్నారు.

చైతూ- సమంత నటిస్తున్న 'మజిలీ' సెకండ్ లుక్..



టాలీవుడ్ క్యూట్ కపుల్ నాగచైతన్య, సమంత కలిసి నటిస్తున్న చిత్రం 'మజిలీ'. పెళ్ళికి ముందు "ఏ మాయ చేశావే, మనం, ఆటోనగర్ సూర్య" చిత్రాలు చేసిన ఈ జంట.. పెళ్ళైన తర్వాత మొదటిసారి ఈ సినిమా ద్వారా స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా నుంచి తాజాగా సెకండ్ లుక్ రిలీజ్ చేశారు. ఇందులో క్రికెట్ బ్యాట్ పట్టుకొని నాగచైతన్య కనిస్తుండగా.. అతన్ని ఆలింగనం చేసుకొని దివ్యాంశ కౌశిక్ కనిపించింది. చిత్రంలో సమంత మొదటి హీరోయిన్‌గా, రెండో హీరోయిన్‌గా దివ్యాంశ కౌశిక్ నటిస్తున్నారు. కాగా తాజాగా విడుదలైన ఈ పోస్టర్‌ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్న సమంత.. "ఏప్రిల్ 5వ తేదీన విడుదల కాబోతున్న ఈ సినిమా చాలా ప్రత్యేకంగా ఉండబోతోంది. జీవిత ప్రయాణాన్ని ఎంతో అద్భుతంగా చిత్రీకరించారు. జీవితంలో అన్నీ మనం అనుకున్నట్లుగా జరగవు" అని పేర్కొంది. ఈ చిత్రంలో నాగచైతన్య మాజీ క్రికెటర్‌గా, సమంత రైల్వే ఉద్యోగినిగా కనిపించనుందని తెలుస్తోంది.

'సుబ్రహ్మణ్యపురం' దర్శకునితో సందీప్ కిషన్..

'సుబ్రహ్మణ్యపురం' చిత్రంతో విమర్శకుల మెప్పుపొందిన సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో కొత్త సినిమా రూపొందనుంది. క్రీడా నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ సినిమాలో యువ కథానాయకుడు సందీప్ కిషన్ హీరోగా నటించనున్నారు. భారతంలో తన బొమ్మను గురువుగా భావించి విద్య నేర్చుకున్న ఏకలవ్యుడి నుంచి బొటనవేలు గురుదక్షిణగా తీసుకున్నాడు ద్రోణాచార్యులు. ఈ ఆధునికకాలంలో అలాంటి ఒక గురువు ఎలాంటి గురుదక్షిణ అడిగాడు అనే ఉత్సుకత రేకెత్తించే కథాంశంతో రూపొం దించే ఈ చిత్రాన్ని 'కార్తికేయ' సినిమాను నిర్మించిన వెంకట శ్రీనివాస్ బొగ్గరమ్ నిర్మిస్తున్నారు. మిగిలిన నటీనటులు మరియు సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెలువడనున్నాయి.

కేజీయఫ్ మరో సంచలనం.!



విడుదలైన అన్ని భాషల్లోనూ కనకవర్షం కురిపిస్తున్న 'కేజీయఫ్' మరో సంచలనం సృష్టించింది. పాకిస్థాన్‌లో విడుదలైన తొలి కన్నడ సినిమాగా రికార్డులకెక్కింది. ఈ సినిమా హిందీ వెర్షన్‌ను లాహోర్, ఇస్లామాబాద్‌లలోని మల్టిప్లెక్స్‌లలో శుక్రవారం విడుదల చేశారు. అక్కడ కూడా ప్రజాదరణ పొందడం విశేషం. కన్నడ సూపర్ స్టార్ యశ్ హీరో కాగా.. ప్రశాంత్ నీల్ డైరెక్ట్ చేశాడు. మొత్తం రెండు భాగాలుగా ఈ సినిమా రూపొందింది. తొలి భాగం గత డిసెంబర్‌లో రిలీజ్ చేయగా.. రెండో భాగాన్ని వచ్చే నెలలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాతో యశ్ ఒక్క దక్షిణాదిలోనే కాక.. ఉత్తరాదిలోనూ సూపర్ క్రేజ్ సంపాదించాడు. కన్నడ సినీ చరిత్రలోనే భారీ బడ్జెట్ సినిమా 'కేజీయఫ్'. దేశవ్యాప్తంగా 2400 థియేటర్లలో సినిమా రిలీజ్ అవ్వగా.. 200 కోట్ల రూపాయల పైబడి వసూళ్లు రాబట్టింది. యూఎస్‌లోనూ మంచి వసూళ్లు సాధించింది. హిందీ డబ్బింగ్ సినిమాల్లో అత్యధికంగా వసూళ్లు రాబట్టిన నాలుగో చిత్రంగా 'కేజీయఫ్' నిలిచింది.

విశాలాంధ్ర

ఆవు పేరుతో ఓట్లా... : కేజ్రీవాల్



సోనిపట్ (హర్యానా) : ఆవు పేరుతో ప్రజలను ఓట్లు అడగటం దురదృష్టకరమని ఆమ్ అద్మీ పార్టీ (ఆప్) చీఫ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. బీజేపీ నేతృత్వంలోని హర్యానా ప్రభుత్వం పశువుల మేతకు తగినన్ని నిధులు కేటాయించకపోవటం శోచనీయమన్నారు. హర్యానాలోని సైదాపూర్ సమీపంలోని సోనిపట్ గ్రామంలోని ఆవుల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆవు పేరుతో రాజకీయం చేయటం ముమ్మాటికీ తప్పేనన్నారు. దురదృష్టవశాత్తు బీజేపీ ఆవు పేరుతో ఓట్లు అడుగుతోందని విమర్శించారు. ఢిల్లీ ప్రభుత్వం బావనాలో దేశంలోనే అత్యుత్తమ ఆవుల వసతి గృహాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. కానీ, బీజేపీ నేతృత్వంలోని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) అందుకు తగినన్ని నిధులు మంజూరు చేయటంలేదన్నారు. మేత కోసం ఢిల్లీ ప్రభుత్వం రోజుకు రూ.5, కార్పొరేషన్ రూ.20 కేటాయించాల్సి ఉండగా, కార్పొరేషన్ మూడేళ్లగా నిధులను విడుదల చేయటంలేదన్నారు. ఆవు పేరుతో ఓట్లు అడిగేముందు వాటి మేతకు నిధులు విడుదల చేయాలని డిమాండు చేశారు.

ముస్లిం మైనార్టీలపై అసహన ప్రభావం : ఫరూఖ్ అబ్దుల్లా



శ్రీనగర్ : దేశంలో పెరుగుతున్న అసహనం ముస్లిం మైనార్టీలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ తీరు దేశ లౌకిక వ్యవస్థ, ఉదాత్తతను ధ్వంసం చేస్తోందని విమర్శించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక అధికార ప్రకటనను విడుదల చేశారు. బీజేపీ వైఖరిని గుర్తించిన ప్రజలు, ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ప్రభుత్వానికి దూరంగా ఉంచారన్నారు. దేశ ప్రజల్లో పెరుగుతున్న అసహనం, ముస్లిం మైనార్టీలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని తెలిపారు. సమాజాన్ని విభజించే ందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ వైఖరిపై ముస్లింలు ఐక్యంగా ఉండి పోరాడాలన్నారు. ఇస్లాం అంటే ప్రేమ, శాంతి, దయాభావమని చెప్పారు.

గవర్నర్‌తో పీడీపీ నాయకుల భేటీ

జమ్ము : ఇద్దరు సభ్యులతో కూడిన పీపుల్స్ కాన్ఫరెన్స్ ప్రతినిధులు జమ్మూకాశ్మీర్ గవర్నర్‌తో భేటీ అయ్యారు. ప్రతినిధుల చైర్మన్ సజ్జద్ అధ్వర్యంలో వారు గవర్నర్ సత్యపాల్ మాలిక్‌ను కలసుకొని జేకే రిజర్వేషన్ సవరణ బిల్లుకు హర్షం తెలిపారు. పీడీపీ-బీజేపీ కూటమి ప్రభుత్వం గతేడాది అసెంబ్లీలో దీనికి ఆమోదం తెలిపింది. ఇమ్రాన్ రాజ అన్సారీ చాలకాలం తర్వాత గవర్నర్‌ను కలుసుకొని రాష్ట్ర అభివృద్ధిపై చర్చించారని అధికార ప్రతినిధి వెల్లడించారు. రాష్ట్రంలో పహారీ మాట్లాడే వారికి 3 శాతం రిజర్వేషన్లు కల్పించారు. పరిహాస్పోరా, ఇమాంబర, జైడిబల్ నీటిపంపిణీ పథకం చేపట్టాలని, హంద్వారా అగ్నిప్రమాద బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలని వారు డిమాండు చేశారన్నారు. ప్రజా సంక్షేమ పనులను కొనసాగించాలని గవర్నర్ లోన్, అన్సారీలను కోరారు. బౌద్ధుల కర్మ పీఠం నాల్గవ అంతర్జాతీయ సమావేశాలకు నిధులను విడుదల చేయాలని, లడక్ ప్రాంతంలోని బోటీ భాషా పాఠశాలలను 8వ షెడ్యూల్‌లో చేర్చి టీచర్ నియామకాలు జరపాలని పీడీపీ ప్రతినిధులు గవర్నర్‌ను కోరారు.

యోగి ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లో పోలీసు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. యూపీలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లను తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని సుప్రీం సోమవారం అభిప్రాయపడింది. ఎన్‌కౌంటర్లపై సవివరమైన పరిశీలన జరపడానికి అంగీకరించింది. ఎన్‌కౌంటర్లపై విచారణకు ఫిబ్రవరి 12వ తేదీని ఖరారు చేసింది. రాష్ట్రంలో జరుగుతున్న ఎదురుకాల్పులపై కోర్టు పర్యవేక్షణలో సీబీఐ లేదా సిట్‌తో విచారణ జరపాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన పటిషన్‌పై యోగీ ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు పంపింది. నిబంధనల ప్రకారమే ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయని యోగి ప్రభుత్వం గతంలో కోర్టుకు తెలిపింది.

థానేలో 8 వాహనాలు దహనం

థానే : లోకమాన్య నగర్ ప్రాంతంలో పార్క్ చేసిన 8 వాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారని అధికారులు వెల్లడించారు. బస్సుస్టాపు నుంచి పొగలు రావడం గమనించిన ప్రయాణీకులు పోలీసులకు సమాచారమిచ్చారు. సోమవారం తెల్లవారుజామున ఆటోలకు నిప్పంటించారని ప్రాంతీయ విపత్తు నిర్వహణా సంస్థ (ఆర్‌డీఎంసీ)కు ఫోన్ వచ్చిందని సంతోష్ కాదమ్ వెల్లడించారు. ఆర్‌డీఎం అధికారులు, అగ్నిమాపకదళం ఘటనాస్థలికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టామని, ఇంతవరకు ఎవరినీ అరెస్టు చేయలేదన్నారు. గతనెల్లో నౌపాడలో దుండగులు ద్విచక్రవాహనాలను దహనం చేసిన విషయం తెలిసిందే.

విభేదాలు, ఘర్షణలు సృష్టించే రాజకీయపార్టీలపై అప్రమత్తంగా ఉండండి

శ్రీనగర్ : ప్రజల్లో విభేదాలు సృష్టించి ఘర్షణలు రేపే బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయాలపై అప్రమత్తత వహించాలని జమ్మూకాశ్మీర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (జేకే పీసీసీ) అధ్యక్షుడు జీఏ మిర్ ప్రజలను కోరారు. కాంగ్రెస్ ఒక్కటే లౌకికత్వాన్ని పెంపొందిస్తుందన్నారు. అనంతనాగ్ జిల్లాలోని ఖనాబల్‌లో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన పై విధంగా తెలిపారు. దేశంలో లోక్‌సభ ఎన్నికలు జరగనుండగా, విభేదాలు సృష్టించే రాజకీయపార్టీలను రాష్ట్రం, దేశం నుంచి తరిమికొట్టాలన్నారు. జమ్మూకాశ్మీర్‌ను కేంద్రం దెబ్బతీసిందని, అక్కడి శాంతి సుహృద్భావాలను అంతరింపచేసిందని ఆయన దుయ్యబట్టారు. దీంతో ఆపార్టీపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఇంతకుముందు రెండుసార్లు యూపీఏ ప్రభుత్వం ఉండగా ఈ తరహా విభేదాలను సృష్టించలేదని ఆయన స్పష్టం చేశారు. రాబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మంచి మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్, కులం, మతం, రంగు, రూపులకు అతీతంగా అభివృద్ధి చేపడుతుందని మిర్ వివరించారు.

కుంభమేళా క్యాంప్‌లో అగ్నిప్రమాదం

ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్) : ఉత్తరప్రదేశ్‌లో కుంభమేళా ఆరంభానికి ముందే అపశృతి దొర్లింది. ప్రయాగ్‌రాజ్‌లోని (అలహాబాద్) క్యాంప్‌లోని టెంట్‌లో సోమవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. దిగంబర్ అనిఅఖడాలోని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన క్యాంపులో వంట గ్యాస్ సిలిండర్ పేలటంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ ఘటనలో పలు టెంట్‌లతోపాటు రెండు వాహనాలు, టెంట్‌లోని మెటీరియల్ దగ్ధమైంది. కాగా, ఎవరికీ ఎలాంటి గాయాలుకాలేదని పోలీసులు తెలిపారు. సమాచారం అందటంతోనే ఆరు అగ్నిమాపక శకటాలు ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశాయి. ఈ నెల 15 నుంచి ప్రారంభంకానున్న కుంభమేళాకు సుమారు 12 కోట్ల మంది వస్తారని ప్రభుత్వం అంచనా వేసింది. 50 రోజులపాటు జరగనున్న కుంభమేళాలో మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

కోదండ ఎస్టేట్ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

చెన్నై : కోదండ ఎస్టేట్ కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనతో తమిళనాడు సీఎం కె పళనిస్వామికి సంబంధం ఉన్నట్లు ఆరోపించిన ఇద్దరు నిందితులను పోలీసులు న్యూఢిల్లీలో అరెస్టు చేసి సోమవారం చెన్నై తీసుకువచ్చారు. నిందితుల ఆరోపణలను సీఎం పళనిస్వామి తీవ్రంగా ఖండించారు. కోదండ ఎస్టేట్ కేసులోని నిందితులు వీకే సాయన్, వాలయార్ మనోజ్‌ను ప్రత్యేక విమానంలో చెన్నై తీసుకువచ్చి రహస్య ప్రదేశంలో ఉంచి విచారణ చేస్తున్నారు. ఈ కేసులో సీఎంకు సంబంధాలున్నాయనే ఆరోపణలను అన్నా డీఎంకే తీవ్రంగా ఖండించింది. సాక్షాత్తు సీఎం కూడా ఖండించటంతోపాటు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. పోలీసులు నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇదిలావుండగా, ఈ ఆరోపణల వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని అన్నా డీఎంకే నాయకులు విమర్శించారు.

షార్జా రాజును కలిసిన రాహుల్‌గాంధీ

షార్జా : కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆదివారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పర్యటనకు వెళ్లారు. పర్యటనలో భాగంగా ఆయన షార్జా రాజు సుల్తాన్ బిన్ మహ్మమ్మద్ ఏ1 క్వాజీమీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య పలు అంశాలపై చర్చ జరిగింది. అందులో ప్రధానంగా రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. దుబాయ్, అబుదబీలో రాహుల్ గాంధీ రెండు రోజులపాటు పర్యటించనున్నారు. ఆయా దేశాల కీలక నేతలను కలవటంతోపాటు భారతీయులు నిర్వహించే సమావేశాలలో పాల్గొననున్నారు. అలాగే యూఏఈలోని వ్యాపారవేత్తలు, విద్యార్థులతోనే రాహుల్ భేటీకానున్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ, షార్జా రాజును కలవటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రెండు దేశాల మధ్య మైత్రిని పెంపొందించే దిశగా చర్చలు జరిపినట్లు తెలిపారు.

ఎస్పీ-బీఎస్పీకూటమితో గట్టి పోటీ : రాజ్‌భర్

బల్లియా : ఉత్తరప్రదేశ్‌లోని అధికార బీజేపీ గట్టిపోటీని ఎదుర్కొనబోతోందని బీజేపీ మిత్రపార్టీ సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్బీఎస్పీ) అధ్యక్షుడు, కేబినెట్ మంత్రి ఓమ్ ప్రకాష్ రాజ్‌భర్ వెల్లడించారు. దేశంలో కూటమిల హవా నడుస్తోందని, అందుకు ఎస్పీ-బీఎస్పీ కూటమి ఒక ఉదాహరణని ఆయన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎస్పీ-బీఎస్పీతో పొత్తుకోసం చర్చలు జరిపారన్నదానిపై నిజం లేదన్నారు. రాష్ట్రంలో కాషాయ పార్టీ 60 శాతం మంది ప్రజల మద్దతు ఉందన్న భ్రమలో ఉందన్నారు. లోక్‌సభ ఉప ఎన్నికల్లో గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్, ఖైరానాల్లోనూ, నూర్‌పూర్ అసెంబ్లీల్లో ఓటమి చెందిన విషయం తెలిసిందేనన్నారు. బీజేపీతో మిత్రత్వం కొనసాగితే వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లను వెనుకబడిన, తీవ్ర వెనుకబడిన, అత్యంత వెనుకబడిన తరగతులుగా విభజిస్తామన్నారు.

జేడీఎస్ కుటుంబ పార్టీ కాదు



బెంగళూరు : జనతాదళ్ (సెక్యులర్ - జేడీ-ఎస్) పార్టీని కుటుంబ సంస్థగా మార్చి వేస్తున్నార్న విమర్శలను ఆ పార్టీ అధినేత, మాజీ ప్రధాన మంత్రి హెచ్‌డీ దేవగౌడ త్రోసిపుచ్చారు. ఈ అభిప్రాయం తప్పని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో సహా ఎందరో ఎదుగుదలకు తమ పార్టీ దోహదపడిందని చెప్పారు. కర్ణాటకలో జేడీఎస్‌కు మంచిపట్టున్న హసన్ జిల్లాలో ఆదివారం రాత్రి జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "జేడీ(ఎస్) దేవగౌడ కుటుంబ రాజకీయ పార్టీ అని మన విమర్శకులు చెపుతున్నారు. ఇది వాస్తవమా, ఒక సారి పరిశీలించండి" అని అన్నారు. "ఏహెచ్ విశ్వనాథ్‌ను రాష్ట్ర పార్టీ అధ్యక్షుడుగా చేశాం. ఇంతకు ముందు నేను కృష్ణప్ప ఇంటికి వెళ్లి పార్టీలో చేరమని ఆయనను కోరాను. ఇది (జేడీ-ఎస్) దేవగౌడ కుటుంబం కాదు. సిద్ధరామయ్య, సీఎం ఇబ్రహీం, మిరాజుద్దీన్ వంటి వారికి మేము ప్రాధాన్యత కలిగిన పదవులు ఇవ్వలేదా?" అని ప్రశ్నించారు. తన కుమారుడు హెచ్‌డీ కుమారస్వామిని ముఖ్యమంత్రిని చేయడంతో జేడీ(ఎస్) కుటుంబ పార్టీ అన్న భావన కలిగేలా ప్రచారం చేస్తున్నారని అన్నారు. తన కుమారుడు ముఖ్యమంత్రి అయ్యేలా కాంగ్రెస్ పార్టీనే ఒత్తిడి చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి అయ్యేందుకు నేనేమి సహాయం చేయలేదు, అందరి ఆశీశులే అలా చేశాయని దేవగౌడ చెప్పారు. "ఇది తండ్రీ కొడుకుల సంస్థ అనేది పెద్ద వార్తగా మారిపోయింది. ఆయన (కుమారస్వామి)ని ముఖ్యమంత్రిగా చేయమని 37 మంది ఎమ్మెల్యేలకు నచ్చచెప్పడం తెలికేనా? వారు (కాంగ్రెస్) ఢిల్లీ నుంచి వచ్చి నా ఆమోదం కోసం ఒత్తిడి తీసుకువచ్చారు. అందుకు నేను ఒప్పుకోకపోవడంతో దాదాపు గంటపాటు చర్చలు జరిపారు. చివరికి అంగీకరించేలా నాపై వారు ఒత్తిడి తీసుకువచ్చారు" అని దేవగౌడ వివరించారు. జేడీ(ఎస్)ను బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని పార్టీ కార్యకర్తలకు దేవగౌడ పిలుపునిచ్చారు.

కన్నడనాట ఆపరేషన్ లోటస్

- బీజేపీ నేతలతో ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల భేటీ
- కమలం పట్ల సీఎం కుమారస్వామి మెతక వైఖరి
- కర్ణాటకమంత్రి శివకుమార్ ఆరోపణ





బెంగళూరు : కర్ణాటకలో 'ఆపరేషన్ లోటస్' వాస్తవమేనని ఆ రాష్ట్ర మంత్రి డీకే శివకుమార్ స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని కుప్పకూల్చడానికి బీజేపీ ఈ ఆపరేషన్ చేపట్టిందని ఆరోపించారు. ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ముంబైలోని ఓ హోటల్‌లో కొంతమంది బీజేపీ నాయకులతో మంతనాలు జరపడం నిజమేనని అంగీకరించారు. 'కర్ణాటకలో పార్టీ ఫిరాయింపులకు తెరలేస్తోంది. కొంతమంది బీజేపీ ఎమ్మెల్యేలు, నాయకులతో మా పార్టీ శాసనసభ్యులు ముగ్గురు ముంబైలో సమావేశమయ్యారు. అక్కడ ఏమి జరిగిందో, మా వాళ్లకు ఎంతమొత్తం ఆశ చూపారో మాకు పూర్తిగా తెలుసు' అని శివకుమార్ చెప్పారు. 2008లో కర్ణాటకలో బీఎస్ యడ్యూరప్ప నాయకత్వంలోని మైనారిటీ ప్రభుత్వాన్ని కాపాడుకోవడం కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు పదవులు, డబ్బు ఆశచూపారన్న ఆరోపణ బీజేపీపై ఉంది. ఇది బీజేపీ ఆపరేషన్ లోటస్. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో ట్రబుల్ షూటర్‌గా శివకుమార్‌కు పేరుంది. ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి బీజేపీ పట్ల మెతకవైఖరి అవలంబిస్తున్నారని శివకుమార్ సుతిమెత్తగా నిందించారు. 'మా ముఖ్యమంత్రి బీజేపీ పట్ల కొంత మెతక వైఖరి అవలంబిస్తున్నారు. అంటే ఆయన వాస్తవాలు బహిర్గతం చేయరు. ఈ విషయం ఆయనకూ తెలుసు. బీజేపీ కుట్రలను ఎమ్మెల్యేలంతా సీఎంకు వివరించారు. దీని గురించి సిద్ధరామయ్యకూ చెప్పారు. వేచిచూసే ధోరణిని కుమారస్వామి అవలంబిస్తున్నారు. నేను సీఎం స్థానంలో ఉంటే 24 గంటల్లోనే ఈ విషయాన్ని బహిర్గతం చేసేవాడిని' అని శివకుమార్ వివరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ నాయకులతో భేటీ కావడం మాజీ సీఎం సిద్ధరామయ్య, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు దినేష్ గుండూరావుకు సైతం తెలుసన్నారు. అయితే, ఈ ప్రయత్నంలో బీజేపీ విజయం సాధించలేదని శివకుమార్ ధీమాగా చెప్పారు. 'మకరసంక్రాంతి తర్వాత రాష్ట్రంలో ఓ విప్లవం వస్తుంది. మనం చూస్తాం. ఫిరాయింపుల వ్యతిరేక చట్టం ఇప్పటికే ఉన్నందున ఇది అంత తేలిక కాదు. అయితే, దానిని ఎలా అధిగమించాలో మాకు బాగా తెలుసు' అని ప్రతిపక్ష బీజేపీ చెప్పిన విషయాలను శివకుమార్ ప్రస్తావించారు. దీనిపై దినేష్ గుండూరావు చేసిన ఫిర్యాదుపై ఆదాయపన్నుశాఖ, అవినీతి నిరోధక శాఖ ఎందుకు చర్యలు తీసుకోలేదో అర్థం కావడం లేదని రాష్ట్ర మంత్రి ఆశ్చర్యం వెలిబుచ్చారు.

ఫిర్యాయింపు వార్తలకు కుమారస్వామి ఖండన

ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీనాయకులతో కలిసి ముంబై వెళ్లారన్న వార్తలను కుమారస్వామి ఖండించారు. ముంబై పర్యటన విషయాన్ని వారు తనకు ముందే తెలిపారని, వారు నిత్యం తనతో సంప్రదింపులు జరుపుతున్నారని వెల్లడించారు. 'ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు నిత్యం నాతో మాట్లాడుతున్నారు. నాకు చెప్పే వారు ముంబై వెళ్లారు. నా ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీ లేదు. పార్టీ ఫిరాయింపులకు బీజేపీ నిత్యం ప్రయత్నిస్తోంది. అధికార పక్ష ఎమ్మెల్యేలకు ఎలాంటి వరాలు ఇస్తుందో తెలుసు. దీనిని నేను ఎదుర్కోగలను. మీడియాకు ఎందుకు ఆందోళన?' అని కుమారస్వామి వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై వస్తున్న వార్తల గురించి కుమారస్వామి సోమవారం మీడియాతో మాట్లాడారు.

దేశంలో రాజకీయ మార్పు తప్పదు

ఉత్తరాఖండ్ మాజీ సీఎం రావత్



డెహ్రాడూన్ : దేశంలో 2019లో రాజకీయ మార్పు సంభవిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హరీష్ రావత్ చెప్పారు. సీజన్లలో మార్పునకు చిహ్నమైన 'ఉత్తరాయణం' నుంచి దేశంలో మార్పు వస్తుందని, ఆ ప్రభావం లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై కూడా ఉంటుందని రావత్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్తరాఖండ్ అసెంబ్లీకి గత ఏడాది జరిగిన ఎన్నికలలో కిచ్చా, హరిద్వార్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఓటమి చవిచూసిన తరువాత ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అయిన రావత్ తన సమయాన్ని ఎక్కువగా తనకు నూతనంగా అప్పగించిన బాధ్యతలపైనే దృష్టిని కేంద్రీకరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా అసోం రాష్ట్ర ఇన్‌ఛార్జి బాధ్యతలను ఆయన నిర్వర్తిస్తున్నారు. ప్రజలతో సంబంధాలకే ఆయన ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. శనివారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో రావత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ, ఉత్తరాయణం నుంచి సీజన్లు మారుతాయని, అదేవిధంగా ఈ ఏడాది రాజకీయ మార్పు కూడా సంభవిస్తుందని తెలిపారు. ఈ కాలంలో సూర్యుడు దక్షిణం నుంచి ఉత్తరానికి ప్రయాణిస్తాడు. చలి గాలులు తగ్గి ఎండలు పెరుగుతాయి. కొత్త సూర్యుడి ఉదయానికి చిహ్నం ఉత్తరాయణం, ఉత్తరాది నుంచి ప్రయాణం సాగిస్తాడు. అలాగే, రాజకీయాలలో కూడా కొత్త సూర్యుడు ఉదయిస్తాడు" అని రావత్ చెప్పారు. ఉత్తరాఖండ్‌లో ప్రజల మద్దతు కలిగిన నాయకుడిగా రావత్ ఉన్నారు. స్థానికంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన చేపట్టారు. లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రజల మద్దతు కూడగట్టేందుకు ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. ఓటర్లతో సంబంధాలు ఏర్పర్చుకునేందుకు రాష్ట్ర అగ్రనాయకులకు వేదికను ఏర్పర్చేందుకు రావత్ ప్రయత్నిస్తున్నారని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.

ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్ రద్దు

పుదుచ్చేరి ముఖ్యమంత్రి



పుదుచ్చేరి : ఒక్కసారి మాత్రమే (యూజ్ అండ్ త్రో) వినియోగించే ప్లాస్టిక్ ఉత్పత్తి, అమ్మకం, వినియోగాన్ని రద్దు చేయడానికి కేబినెట్ నిర్ణయించిందని ఆరాష్ట్ర ముఖ్యమంత్రి వి. నారాయణసామి వెల్లడించారు.

వ్యాపారులు, ప్రజలకు దీనిపై అవగాహన కల్పించడం కోసం పెద్ద ఎత్తున చర్యలు చేపడతామన్నారు. రానున్న తరాలకు ప్లాస్టిక్ రహిత ప్రపంచాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన మీడియాకు తెలిపారు. పొరుగున ఉన్న తమిళనాడు ప్రభుత్వం ఈ ఏడాది మొదటి నుంచి ప్లాస్టిక్‌ను రద్దు చేస్తున్నామని గతేడాది జూన్‌లోనే ప్రకటించిందన్నారు. ప్లాస్టిక్ వినియోగంపై ఆకస్మికంగా నిర్ణయం తీసుకుందని బీజేపీ నామినేటెడ్ ఎమ్మెల్యే డిసెంబరు 31న అసెంబ్లీ ప్రాంగణంలో ధర్నా చేపట్టారు. పురుచ్చేరి టెక్స్‌టైల్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వందేళ్ల చరిత్రగల ఆంగ్లో ఫ్రెంచ్ టెక్స్‌టైల్స్, మరోరెండు టెక్స్‌టైల్స్ భారతి, స్వదేశీ స్వచ్ఛంద పదవీవిరమణ పథకాన్ని మరో ఆరునెలల్లో దశలవారీగా చేపడుతున్నామని నారాయణసామి వివరించారు. మద్యం వ్యాపారం, ఆగ్రో, పారిశ్రామిక కార్పొరేషన్ లిమిటెడ్ (పీఏఎస్‌ఐసీ) సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ (పీఏపీఎస్‌సీవో)లకు వేలం నిర్వహించి ప్రైవేటుపరం చేస్తామన్నారు. ప్రభుత్వ అధ్వర్యంలోని పుదుచ్చేరి ఇండస్ట్రియల్ ప్రమోషన్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్వెస్టిమెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (పీఐపీడీఐసీ), డిస్టిలరీ అండ్ పవర్ కార్పొరేషన్‌లు లాభదాయకంగా నడుస్తున్నాయని, ఇరులర్, విల్లి, వెటాయికరణ్ వర్గాలకు 1శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని సీఎం వెల్లడించారు.

యూపీలో బీజేపీ ఫినిష్

- ఎస్పీ-బీఎస్పీ పొత్తుపై తేజస్వి అభినందనలు
- దేశరాజకీయాలకు ఇదో సంకేతమని వ్యాఖ్య
- అటు మాయావతి, ఇటు అఖిలేష్‌తో భేటీలు



న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ-బీఎస్పీ కూటమికి ఆర్‌జేడీ ఉపాధ్యక్షుడు తేజస్వి యాదవ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ రెండు పార్టీల కలయికతో బీజేపీకి యూపీలో కాలం చెల్లినట్టేనని వ్యాఖ్యానించారు. ఎస్పీ, బీఎస్పీ కూటమి కట్టడం చాలా గొప్ప పరిణామమని పేర్కొన్నారు. భారతదేశ రాజకీయాల్లో ఇదో ముందడుగని తేజస్వి అభిప్రాయపడ్డారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో ఎస్పీ, బీఎస్పీ కూటమి విజయదుందుభి మోగిస్తుందని స్పష్టంచేశారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌తో కలిసి సోమవారం తేజస్వి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'యూపీ, బీహారుల్లో బీజేపీ తుడిచిపెట్టుకుపోతుంది. అందులో ఎలాంటి సందేహం లేదు. ఎస్పీ-బీఎస్పీ కూటమి దేశానికి స్పష్టమైన సంతకేతం పంపింది. దేశ ప్రయోజనాల కోసమే మాయావతిజీ, అఖిలేష్‌జీ పొత్తుకు ముందుకొచ్చారు. ఇప్పుడు దేశంలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా ఇది అత్యవసరం. బ్రిటీషర్లకు తొత్తులుగా ఉన్న వారే ఇప్పుడు అధికారంలో కొనసాగుతున్నారు' అని తేజస్వి బీజేపీపై విమర్శల వర్షం కురిపించారు. కలిసి ఎన్నికలను ఎదుర్కొంటున్నందుకు మాయావతి, అఖిలేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి పొత్తుల గురించే ఆర్‌జేడీ అధినేత లాలు ప్రసాద్ నిరంతరం కలలు కన్నారని గుర్తుచేశారు. సీబీఐ వివాదాన్ని ప్రస్తావిస్తూ సీబీఐ, ఈడీ ఇప్పుడు బీజేపీ భాగస్వామ్యపార్టీలుగా మారాయని తేజస్వి విమర్శించారు. లాలు నుంచి ముప్పు ఉందని భయపడటం వల్లే ఆయనను జైలుకు పంపారని ఆయన అన్నారు. ఎస్పీ-బీఎస్పీ కూటమిలో కాంగ్రెస్ లేకపోవడంపై స్పందిస్తూ 'మోడీని గద్దె దించడానికి, దెబ్బకొట్టడానికి సమాజ్‌వాదీపార్టీ, బీఎస్పీ చాలు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. యూపీలో బీజేపీకి సీట్లు రాకూడదు, ఎవరు ఎవరితో పొత్తు పెట్టుకున్నారన్నది ముఖ్యం కాదు అని రాహుల్‌గాంధీ చేసిన ప్రకటన చూడండి' అని తేజస్వి గుర్తుచేశారు. కేంద్రంలో తదుపరి ప్రభుత్వాన్ని ఎవరు ఏర్పాటు చేయాలో యూపీ, బీహారు నిర్ణయిస్తాయని ఆర్‌జేడీ నేత స్పష్టంచేశారు.

సిక్కుల ఊచకోత కేసులో సీబీఐకు సుప్రీంకోర్టు నోటీసు

న్యూఢిల్లీ : సిక్కుల ఊచకోత కేసులో తీర్పుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ సీనియర్ నేత సజ్జన్ కుమార్ (70) అపీల్‌పై సుప్రీంకోర్టు సీబీఐకు సోమవారం నోటీసులు జారీ చేసింది. చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ అశోక్ భూషణ్ , ఎస్కే కౌల్‌లతో కూడిన ధర్మాసనం ఈ నోటీసును జారీ చేసింది. డిసెంబరు 31న కుమార్ సుప్రీంకోర్టులో లొంగిపోయిన విషయం తెలిసిందే. జీవితకాల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంది. ఇందిరాగాంధీ హత్యానంతరం ఢిల్లీకంటోన్మెంట్ రాజ్ నగర్ పార్టు1 ప్రాంతంలో 1984 నవంబరు 1,2 తేదీల్లో జరిగిన అల్లర్లలో గురుద్వారాను దహనం చేసి సిక్కు మతాచార్యుల హత్యలకు పాల్పడ్డారన్న కేసులో ఆయనకు ఈ శిక్ష విధించారు. దీంతో ఆయన కాంగ్రెస్‌పార్టీకి రాజీనామా చేశారు. రెండు వర్గాలకు మధ్య ఆయన కుట్రతో అల్లర్లు రేపారని కోర్టు స్పష్టం చేసింది. ఆయనతోపాటు కాంగ్రెస్ కౌన్సిలర్ బల్వాన్ ఖోఖర్, విశ్రాంత నౌకదళ అధికారి కెప్టెన్ భగ్మాల్, గిరిధరి లాల్ , మాజీ ఎమ్మెల్యే మహేందర్ యాదవ్, కిషన్ ఖోఖర్ ఉన్నారు. ఈ హత్యలు మానవత్వానికి మచ్చగా నిలిచాయని కోర్టు పేర్కొంది.

సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ నియామకంపై సుప్రీంలో సవాల్

న్యూఢిల్లీ : సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం. నాగేశ్వరరావును నియమించడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ద్వారా ఒక స్వచ్ఛంద సంస్థ ఈ పిటిషన్‌ని దాఖలు చేసింది. సీబీఐ తాత్కాలిక చీఫ్‌గా నాగేశ్వరరావు కొనసాగడాన్ని అనుమతిస్తూ జనవరి 10వ తేదీన కేబినెట్ నియామకాల కమిటీ జనవరి 10వ తేదీన జారీ చేసిన ఆదేశాలను కొట్టివేయాలని ఆ పిటిషన్ కోరింది. ఢిల్లీ స్పెషల్ పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు, 1946 సెక్షన్ 4ఎ పేర్కొన్న క్రమం, లోక్‌పాల్, లోకాయుక్త చట్టం, 2013 సవరణ ప్రకారం సీబీఐ రెగ్యులర్ డైరెక్టర్‌ని నియమించాలని కేంద్రాన్ని ఆదేశించాలని ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)లో స్వచ్ఛంద సంస్థ కోరింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని అత్యున్నత స్థాయి ఎంపిక ప్యానెల్ సీబీఐ మాజీ చీఫ్ అలోక్ వర్మను తొలగించి రెండో దఫా నాగేశ్వరరావుని తాత్కాలిక డైరెక్టర్‌గా నియమించింది. వర్మను డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ సివిల్ డిఫెన్స్, హోంగార్డులకు బదిలీ చేశారు. అయితే, ఈ ప్రతిపాదనను వర్మ తిరస్కరించి ఇండియన్ పోలీసు సర్వీసెస్ (ఐపీఎస్)కి రాజీనామా చేశారు. సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా తిరిగి నియమించిన గంటల్లోనే గత వారం వర్మ చేసిన నియామకాల ఆదేశాలను నాగేశ్వరరావు రద్దు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో గత వారం సీబీఐ డైరెక్టర్‌గా తిరిగి నియమితులైన తరువాత వర్మ కొన్ని బదిలీలు చేశారు. జాయింట్ డైరెక్టర్ స్థాయిలో నలుగురు అధికారులను బదిలీ చేస్తూ కూడా నాగేశ్వరరావు ఆదేశాలు జారీచేశారు.

యువతను సత్కరించిన జేకే ప్రభుత్వం

జమ్ము : యువతకు ఆదర్శంగా నిలిచిన 13 మంది, పురుషులు, మహిళలను జమ్మూకాశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ సత్కరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వారంతా రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చారన్నారు. పారామిలటరీ దళాల ప్రత్యేక డైరెక్టర్ జనరల్ (జేఅండ్ కేజోన్) వీఎస్‌కే కౌముది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంచుకున్న రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకొని అందరికీ ఆదర్శంగా ఉండటంతోపాటు యువతను ప్రభావితం చేసే వారికి ఈ సత్కారాన్ని నిర్వహించారు. 13 మందిలో 9 మంది క్రీడారంగ ప్రముఖులు కాగా, మిగిలిన వారు వ్యవసాయం, విద్య, సామాజిక సేవారంగాల్లో ప్రముఖంగా పాటుపడిన వారు. సన్మానం పొందినవారిలో హనన్య నిసార్, రాఫిక్ సల్మాన్ దర్, రిషబ్ వర్మ, బిలిక్విస్ మిర్, నూర్ ఉల్ హయ, జగ్మోహన్ సింగ్, దియా దేవి, జైనాబ్ ముస్తక్, సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండర్ రిగ్జిన్ అంగ్మోలు క్రీడారంగానికి చెందినవారు కాగ, ధర్మపాల్ ,తుఫైల్ ఫయాజ్, షబీర్ ఖాన్‌లు వ్యవసాయ, విద్య,సామాజిక సేవలకు మన్ననలను అందుకున్నారు. వివిధ రంగాల్లో సామర్థ్యం చూపిన మరికొంతమందిని గౌరవిస్తామని గవర్నర్ వెల్లడిచారు. సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ దర్శన్ ద్వారా కుగ్రామాలకు చెందిన యువత వివిధ రంగాల్లోని ప్రముఖులతో సంభాషించారు.

బాధితులకు బొమ్మరిల్లు ఆస్తులు


మాట్లాడుతున్న బుచ్చిబాబు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: బొమ్మరిల్లు ఫామ్స్ అండ్ విల్లాస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ స్థిరాస్తుల వేలం ద్వారా బాధిత ఖాతాదారులందరికీ సమానంగా పంపిణీ చేయాలని కోర్టు ఆదేశాలిచ్చినట్లు సీఐడీ ఇన్‌స్పెక్టర్ మునుకోటి బుచ్చిబాబు తెలిపారు. శ్రీకాకుళంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బొమ్మరిల్లు సంస్థ డైరెక్టర్లు రాయల రాజారావు, రాయల స్వాతి, రాయల లక్ష్మీనారాయణ, వెంకటరావు, బాపూజీ, ఎర్రయ్య తదితరులు 2010లో హైదరాబాద్‌లో సంస్థను స్థాపించారన్నారు. ఎక్కువ వడ్డీ ఆశచూపి సుమారు 19 బ్రాంచీల ద్వారా ప్రజల నుంచి డిపాజిట్ల రూపంలో సుమారు రూ.95,11,96,254 సేకరించారు. దీనిలో రూ.47,67,40,840 సొమ్మును దారిమళ్లించి 45 వేల మంది డిపాజిట్‌దారులను మోసంచేసి సంస్థను ఎత్తివేశారన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఖాతాదారులు ఆయా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయడంతో ఏడు కేసులు నమోదు అయ్యాయి. శ్రీకాకుళం జిల్లాలో 2014లో నాలుగు కేసులు నమోదయ్యాయని తెలిపారు. కంపెనీ స్థిరాస్తులను రాష్ట్ర ప్రభుత్వం వివిధ జీవోల ద్వారా ఆటాచ్ చేస్తూ బాధితులందరికీ సమానంగా పంచాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినట్లు బుచ్చిబాబు వివరించారు.


14 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



విశాలాంధ్ర-రాజానగరం : తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలో సోమవారం సాయంత్రం 14 లక్షల విలువైన గంజాయిని పోలీసులు పట్టుకు న్నారు. రాజానగరం ఎస్ఐ బి.జగన్మోహనరావు కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని మల్కాజ్‌గిరి జిల్లా కోరుకొండ గ్రామానికి చెందిన బోడో నాయక్ కిషోర్ పట్నాయక్ ఏజెన్సీ ప్రాంతంలోని దారకొండ నుంచి హైదరాబాద్‌కి వ్యాన్‌లో గంజాయి తరలిస్తున్నాడు. రాజమహేంద్రవరం అర్బన్ ఎస్పీ ఇచ్చిన ముందస్తు సమాచారంతో రాజానగరంలోని జాతీయ రహదారిపై పోలీసులు తనిఖీలు చేపట్టారు. వ్యాన్‌లో 20 కేజీల చొప్పున ప్యాక్ చేసిన 14 బస్తాలు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలో జి.శివ బాలాజీ, ఈవోఈఆర్డీ జాన్ మిల్టన్ పాల్గొన్నారు.

రాష్ట్రంలోని అర్చకుల అభివృద్ధే ధ్యేయం

రాష్ట్ర దేవాదాయశాఖ సలహాదారుడు రామకోటయ్య



విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాష్ట్రంలోని దేవాలయాలు, అర్చకుల అభివృద్ధే ధ్యేయంగా తన వంతు కృషిచేస్తానని రాష్ట్ర దేవాదాయశాఖ సలహాదారు చెరువు రామకోటయ్య అన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలయాల్లోని గర్భగుడుల అభివృద్ధి, అర్చకుల ఆర్థిక స్థితిగతులను క్షేత్ర స్థాయిలో తెలుసుకునేందుకు ఈనెల 18వ తేదీ నుండి నెల రోజులపాటు రాష్ట్రంలోని 13 జిల్లాలో పర్యటిస్తానన్నారు. లక్ష మందికి పైగా ఉన్న అర్చక కుటుంబాలకు మేలు చేయడమే లక్ష్యమన్నారు. పూరాతన దేవాలయాల్లోని గర్భగుడి ఇరుగ్గా ఉండటంతో అర్చకులు ఆక్సిజ్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర పర్యటనలో సమస్యలను స్వయంగా పరిశీలించిన అనంతరం నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రామకోటయ్య అన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న జిల్లావైద్యశాఖాధికారి జేవీవీఆర్‌కే ప్రసాద్

పల్స్ పోలియో వ్యాక్సిన్‌కు నష్టం లేదు

విశాలాంధ్ర - కర్నూలు కలెక్టరేట్ : కర్నూలులోని శీతలీకరణ సముదాయ భవనంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో పల్స్‌పోలియో వ్యాక్సిన్, డైల్యూంట్‌లకు నష్టం వాటిల్లలేదని డీఎంఅండ్‌హెచ్‌వో జేవీవీఆర్‌కే ప్రసాద్, తెలిపారు. సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్‌లో వ్యాక్సిన్‌ను భద్రపర్చామన్నారు. ఫిబ్రవరి మూడవ తేదీన సాధారణ టీకాలు, పల్స్‌పోలియో వ్యాక్సిన్‌కు ఆటంకాలు ఉండబోమని స్పష్టం చేశారు. భవన సముదాయాన్ని సోమవారం రాష్ట్ర కోల్డ్‌చైన్ ఆఫీసర్ దేవానంద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జేవీవీఆర్‌కే ప్రసాద్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వెంకటరమణ తదితరులు పరిశీలించారు. ఎలక్ట్రిసిటీ అధికారులు, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లతో కలిసి నష్టంపై ప్రాథమిక నివేదిక తయారుచేశారు. ఈ సందర్భంగా డీఎంఅండ్ హెచ్‌వో మాట్లాడుతూ తమ కార్యాలయం పక్కనున్న ప్రాంతీయ పురుషుల శిక్షణా కేంద్రంలోని జిల్లా వ్యాక్సిన్ కేంద్రం ఈ నెల 14వ తేదీ నుంచి నిరాటంకంగా పనిచేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతం మరమ్మతుల కోసం రూ.46 లక్షలు అవసరమవుతుందని తెలిపారు. ప్రాథమిక అంచనాలను తక్షణ అనుమతుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు.



మాట్లాడుతున్న రూరల్ సీఐ వంశీధర్

'అక్షయపాత్ర' మాయగాళ్లు అరెస్టు

- రూ.51 లక్షల సొమ్ము రికవరీ
- గూడూరు రూరల్ సీఐ వంశీకృష్ణ

విశాలాంధ్ర - గూడూరు : అక్షయపాత్ర పేరుతో ఇటీవల నలుగురు అమాయకులకు కుచ్చుటోపీ పెట్టి లక్షల రూపాయలు స్వాహా చేసిన ఐదుగురు మోసగాళ్లను నెల్లూరు జిల్లా గూడూరు రూరల్ సీఐ వంశీకృష్ణ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఐ వంశీధర్ కేసు వివరాలు వెల్లడిస్తూ చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి మండలం బహుదూర్పేట గ్రామానికి చెందిన ఐకాన్, కొత్తపేటకు చెందిన సుబ్రమణ్యం రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో నష్టపోయారు. వీరికి నెల్లూరు నగరానికి చెందిన ప్రసాద్, రమేష్(విశాఖపట్నం), దేవుడుబాబు(విజయనగరం)తో పరిచయం ఏర్పడింది. కొద్ది సమయంలో డబ్బు కూడబెట్టాలన్న ఆత్యాశతో అక్షయపాత్రను తెరమీదకు తీసుకొచ్చారు. నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలంలోని పెంటపాడు గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన శేషగిరిలను నమ్మించి 25 లక్షల రూపాయల వరకు వసూలు చేశారు. బాధితుల ఫిర్యాదుతో చిల్లకూరు, గూడూరు ఎస్సైలు శ్రీనివాసరావు, ఎం. బాబి కలిసి నిందితులను పట్టుకున్నట్లు సీఐ వంశీధర్ వివరించారు. వీరి వద్ద నుండి రూ. 26 లక్షలతో పాటు బ్యాంకు ఖాతాలోని మరో 26 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో పోలీసులు చిరంజీవులు, నరేష్, భాస్కర్, పి. ఆదినారాయణ, మాధవరావ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్ ఆత్మహత్యాయత్నం



విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : పోలీసుల అదుపులోని గంజాయి స్మగ్లర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం తెల్లవారు జామున రాజమహేంద్రవరంలోని బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. గంజాయి కేసులో పట్టుబడిన మరో ఇద్దరు నిందితులను రిమాండ్ కోసం కోర్టుకు తరలించారు. 240 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తూర్పు జోన్ డీఎస్పీ యు.నాగరాజు కథనం ప్రకారం జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి తనిఖీ చేస్తుండగా అనకాపల్లి నుంచి హైదరాబాద్‌కు వ్యానులో తరలిస్తున్న 240 కేజీల గంజాయి పట్టుబడింది. గంజాయితోపాటు కారులోని నెల్లూరుకు చెందిన షేక్ బాషా, పశ్చిమ గోదావరి జిల్లా ఉంద్రాజవరం గ్రామానికి చెందిన నడుంపల్లి సీతారామరాజు, నల్లజర్ల మండలం సింగరాయపాలెంవాసి నెక్కలపూడి రాంబాబులను అరెస్ట్ చేసి బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సోమవారం తెల్లవారుజామున సీతారామరాజు మూత్ర విసర్జనకు వెళతానని సెంట్రీ కానిస్టేబుల్‌కు చెప్పి మరుగుదొడ్డి శుభ్రం చేసేందు వినియోగించే చిన్న రేకుతో కంఠంపై బలంగా కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కానిస్టేబుల్ వెంటనే స్టేషన్ అధికారులకు తెలియజేయడంతో దానవాయిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శస్త్రచికిత్స చేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడినట్టు తెలుస్తోంది. సీతారామరాజు గతంలో పలు గంజాయి కేసుల్లో నిందితుడు. 2011లో పెద్దాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసుకు సంబంధించి రాజమహేంద్రవరం కేంద్రకారాగారంలో పదిహేనేళ్ళ జైలు శిక్ష అనుభవిస్తూ అత్యున్నత న్యాయస్థానం ద్వారా పెరోల్‌పై బయటకు వచ్చాడు. మళ్ళీ గంజాయి రవాణాచేస్తూ పట్టుబడ్డాడు.

ఈ-చలానా వాత

- నిబంధనల పేరుతో పోలీసుల వసూళ్లు
- పార్కింగ్ సౌకర్యాలు లేకుండా అమలుపై ఆగ్రహం
- వాహనదారుల నిరసన స్వరం


ప్రధాన కూడళ్ళలో ఇలా కానిస్టేబుల్స్ ఫొటో తీయడంతో ఈ చలానాలు ఇంటికొస్తున్నాయి

విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో : ఈ చలానా నోటీసులతో వాహనదారులు లబోదిబోమంటున్నారు. రోడ్డెక్కని వాహనాలకు ఈ-చలానాలు ప్రత్యక్షం కావడం గందరగోళానికి దారితీస్తోంది. మహా విశాఖ నగరంలో ఇరుకు రోడ్లు, పార్కింగ్ చోటులేక అవస్థలు పడుతున్నా ఈ-చలానా విధానం వాహనచోదకులను ఇబ్బందుల పాల్జేస్తోంది. తప్పు చేయకపోయినా ఆన్‌లైన్‌లో దోషులుగా చూపించే ప్రక్రియ అయోమయానికి గురిచేస్తోంది. ప్రజలతో సత్సంబంధాలను కొనసాగిస్తున్నట్టు ప్రకటనలిచ్చే పోలీసు ఉన్నతాధికారులు ఈ-చలానా పేరుతో మానసికంగా వేధిస్తున్నారనే విమర్శలు సర్వత్రా ఎదురవుతున్నాయి. ఎక్కడ పడితే అక్కడ నచ్చిన రీతిలో ఫొటోలు తీస్తూ అపరాధ రుసుము చెల్లిస్తారా.. చస్తారా అనడం సరికాదని వాపోతున్నారు. చట్టాలు సక్రమంగా అమలుచేయాల్సిన పోలీసులే చేతిలోకి తీసుకుంటే ఎలా అనే వాదనలు వినిపిస్తున్నాయి. విశాఖపట్నం, విజయనగరం మున్సిపాల్టీల్లో అమలు చేస్తున్న ఈ-చలానా వ్యవహారం వాహనదారులకు ముచ్చెమటలు పట్టిస్తోంది. ఈ-చలానా విధానం మంచిదైనా అమలు చేస్తున్న తీరుపై అనుమానాలకు తావిస్తోంది. ట్రాఫిక్ పోలీసులకు కేసుల టార్గెట్ నేపథ్యంలో ఎక్కడ పడితే అక్కడ అటకాయించి నమోదు చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసు ఉన్నతాధికారుల మెప్పుకోలు కోసం తాపత్రయ పడుతున్నట్టు తెలుస్తోంది.

ఈ-చలానా తీరు ఇలా..

సాధారణంగా వాహనదారులు చేసే తప్పిదాలకు ట్రాఫిక్ పోలీసులు అక్కడికక్కడే అపరాధరుసుం వసూలు చేస్తుంటారు. పదే పదే నిబంధనలను అతిక్రమిస్తే చిన్న కేసులు నమోదుచేసి బెంచ్ కోర్టులో హాజరుపరుస్తారు. మోటారువాహనాల చట్టంలోని నియమ, నిబంధనల ఉల్లంఘనలు ఈ కోవలోకి వస్తాయి. రాంగ్ పార్కింగ్, వన్‌వే డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, నంబర్ ప్లేట్ లేకపోవడం తదితర అంశాలుంటాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తరించడంతో పోలీసు వ్యవస్థలోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. దీనిలో ఈ-చలానా ఒకటి. అంటే పోలీస్ కానిస్టేబుళ్ల చేతికి సెల్‌ఫోన్‌లు ఇస్తున్నారు. పట్టణ పరిధిలో, రహదారుల వెంట కలియతిరుగుతూ నిబంధనలను ఉల్లంఘించే వాహనం నంబర్‌ను ఫొటో తీయడం ద్వారా ఈ-చలానా సిద్ధం చేస్తారు. ఈ విషయం ఫోన్‌లో సమాచారం అందేంతవరకు వాహన యజమానికి అపరాధ రుసుము విషయం తెలియదు. ఈ-చలానాలో పేర్కొన్న అపరాధ రుసుంను మీ సేవలో చెల్లించాల్సి ఉంటుంది. ఇలా మూడు అవకాశాలు ఇస్తారు. అపరాధ రుసుం చెల్లించకపోతే వాహనం సీజ్ చేస్తారు. వాహనదారుని డ్రైవింగ్ లైసెన్స్‌ను స్వాధీనం చేసుకుంటారు. ఇందుకోసం అక్కడక్కడా ఆకస్మికంగా వాహనాలను తనిఖీ చేస్తారు. వాహన నంబరు ప్లేటును స్కాన్ చేసిన వెంటనే ఎన్ని ఈ-చలానాలు పెండింగ్‌లో ఉన్నదీ తెలిసిపోతుంది. దాన్ని బట్టి పోలీసులు చర్యలు చేపడతారు.

ఇదెక్కడి చోద్యం!

ఈ-చలానా మంచిదే అయినా అమలు తీరు ఆందోళనకరంగా ఉందని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. సెల్‌ఫోన్‌లను కానిస్టేబుల్‌కు ఇవ్వడంతో వారికున్న అవగాహన మేరకు వాహనం ఎక్కడ కనపడితే అక్కడ ఫొటోలు తీసి పంపించేస్తున్నారు. విజయనగరం పట్టణ పరిధిలో నేటికీ నిర్దిష్టంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ఏర్పాట్లు లేవు. పాదచారుల రాకపోకలకు ఫుట్‌పాత్‌లు లేవు. ట్రాఫిక్ నియమాలకు సంబంధించి గుర్తింపులు కానరావు. పార్కింగ్‌కు స్థలాలు లేవు. వాహనం ఎక్కడ నిలిపి ఉంచాలో తెలియని పరిస్థితి. సూచన బోర్డుల జాడ లేదు. అలాంటపుడు వాహనం ఎక్కడ పెట్టినా అది తప్పే అవుతుంది. ఒక వ్యక్తి కుటుంబంతో షాపింగ్‌కు వచ్చి లోపలికి వెళ్లిన తరువాత బయట ఏం జరుగుతుందో తెలియదు. షాపు ముందున్న స్థలంలోనే వాహనాన్ని పార్కింగ్ చేస్తారు. ఈలోగా కానిస్టేబుల్ వచ్చి ఫొటో తీసి పంపుతారు. సరైన సౌకర్యాలు కల్పించకుండా, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోకుండా ఈ-చలానా అమలు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దీనికితోడు ఈ-చలానా పేరుతో ఫోన్‌లకు వస్తున్న సమాచారం మరింత ఆశ్చర్యకరంగా ఉంటోందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

శాటిలైట్ పద్ధతిలో ఇంటింటికీ గ్యాస్

- దక్షిణ భారతదేశంలో తొలిసారి డోకిపర్రులో ప్రారంభం
- స్వగ్రామంలో మేఘా అధినేతలు పీపీరెడ్డి, కృష్ణారెడ్డి శ్రీకారం
- సిలెండర్ ధరలో 40 శాతం తక్కువకు సరఫరా


డోకిపర్రు గ్రామంలో గ్యాస్ సరఫరా రేగ్యూలేటర్ ఆన్ చేస్తున్న పీపీ రెడ్డి

విశాలాంధ్ర - గుడివాడ : దక్షిణ భారతదేశంలోనే తొలిసారి సొంతూరులో అత్యాధునిక టెక్నాలజీతో వంట గ్యాస్ సరఫరాకు శ్రీకారం చుట్టారు మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(ఎంఈఐఎల్) అధినేతలు పీపీ రెడ్డి, పీపీ కృష్ణారెడ్డి. శాటిలైట్ విధానంలో ఇంటింటికీ పైపుల ద్వారా మేఘా గ్యాస్ సరఫరాకు సంబంధించి సోమవారం కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామంలో గ్యాస్ సరఫరా కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రత్యేక శాటిలైట్ కేంద్రంలో పీపీ రెడ్డి సతీమణి రమారెడ్డి, పీపీ కృష్ణారెడ్డి సతీమణి సుధారెడ్డి రెగ్యులేటర్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా పీపీ రెడ్డి, కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని మహిళలకు వంట గ్యాస్ ఇబ్బందులను తొలగించేందుకు పైపుల ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. తమ సంస్థ చేపట్టే ప్రతి నూతన ప్రాజెక్టును స్వగ్రామమైన డోకిపర్రులో ప్రారంభించటం ఆనవాయితీగా వస్తోందని, శాటిలైట్ పద్ధతిలో గ్యాస్ సరఫరాను మొట్టమొదటిగా డోకిపర్రులో ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకూ ఎక్కడా ఈ విధానం లేదన్నారు. తమ కంపెనీలో ప్రవేశపెట్టే నూతన సాంకేతిక విధానాలకు స్వగ్రామం నుంచి శ్రీకారం చుడుతున్నందుకు గర్వంగా ఉందన్నారు. మేఘా గ్యాస్ కేంద్రం నుంచి గ్రామంలోని ప్రతి ఇంటికి 24 గంటలపాటు గ్యాస్ సరఫరా అవుతుందన్నారు. ఎలాంటి అవరోధాలు లేకుండా సిలిండర్ ధరకన్నా 40 శాతం తక్కువకు సరఫరా చేసేందుకు గ్రామంలో 20 కిలోమీటర్ల పైప్‌లైన్ వేశామన్నారు. లీకులు రాకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. ప్రస్తుతం గ్రామంలో 250 మంది గ్యాస్ కనెక్షన్‌కు పేర్లు నమోదు చేసుకున్నప్పటికీ 125 ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చామన్నారు. మిగిలిన ఇళ్లకు మూడు నుంచి నాలుగు నెలల్లో కనెక్షన్లు ఇస్తామన్నారు. రాష్ట్రంలోనే డోకిపర్రును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు సహకారం అందిస్తామని చెప్పారు. తొలుత పీపీరెడ్డి, కృష్ణారెడ్డి కుటుంబాలను గ్రామస్తులు ఊరేగింపుగా గ్యాస్ ప్రారంభ వేదిక వద్దకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మేఘా అధినేతలు పీపీ రెడ్డి, కృష్ణారెడ్డిలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి గ్రామస్తులు అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు రామిరెడ్డి, శివబాబు మేఘా ఇంజనీరింగ్ సీఈవో పి.వి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏరో స్పోర్ట్స్‌ఫెస్ట్‌లో పర్యాటక కాంతి

విశాలాంధ్ర-సీతంపేట : శ్రీకాకుళం జిల్లా సీతంపేటలో ఏరో స్పోర్ట్స్ ఫెస్టివల్‌కు సోమవారం రెండవ రోజు పర్యాటకులు పోటెత్తారు. సంక్రాంతి పండగ సెలవుల్లో సొంతూళ్లకు వచ్చిన జిల్లావాసులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి సాహస క్రీడాలను వీక్షించేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు. రెండవ రోజు 80 పారా మోటరింగ్ రైడ్లు, 55 పారా సైలింగ్ రైడ్లు, 30 హాట్ ఎయిర్ బెలూన్ రైడ్లు జరిగాయి. ఎన్టీఆర్ సాహస ఉద్యానవనం, ఏరో స్పోర్ట్స్ వీక్షణకు వేలాది మంది పర్యాటకులు వచ్చారు. దేశం నలుమూలలకు చెందిన 15 మంది పైలట్లు భాగస్వామ్యం అయ్యారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో పారా మోటరింగ్‌లో శిక్షణ పొందిన ఇద్దరు గిరిజన పైలట్లు పాల్గొన్నారు. పారా సెయిలింగ్‌లో పాల్గొనేందుకు రూ.200, హాట్ ఎయిర్ బెలూన్‌కు రూ.500, పారా మోటారింగ్‌కు వెయ్యి రూపాయల చొప్పున టికెట్ ధర నిర్ణయించారు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్, పార్వతీపురం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. రాష్ట్రంలో తొలిసారి ఏరో స్పోర్ట్స్ ఫెస్టివల్‌ను సీతంపేటలో నిర్వహించడం ముదావహమని పర్యాటకులు కొనియాడారు.

కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో

ఎన్నికల.. బదిలీలు

- పోలీస్ శాఖలో ప్రక్రియ ప్రారంభం
- రెవెన్యూశాఖలో జాబితా సిద్ధం
- విజయనగరం జిల్లాలో బదిలీలు



విశాలాంధ్ర-విజయనగరం : త్వరలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో విజయనగరం జిల్లాలో వివిధ శాఖల అధికారుల బదిలీల ప్రక్రియ మొదలైంది. ఇప్పటికే పోలీస్‌శాఖలో తొలి విడత 29 మంది ఎస్ఐలను బదిలీ చేశారు. త్వరలో మరికొంత మంది బదిలీలకు కసరత్తు కొనసాగుతోంది. రెవెన్యూ శాఖలోనూ ఎన్నికలతో సంబంధాలు కలిగిన తహశీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేయనున్నారు. బదిలీలకు నిబంధనలను జారీ చేసిన కేంద్ర ఎన్నికల సంఘం 2018 నవంబర్‌ను గడువు తేదీగా నిర్ణయించింది. ఈ తేదీనాటికి ఏ పోస్టింగ్‌లోనైనా మూడేళ్ళు పూర్తిచేసుకున్న అధికారులను తప్పనిసరిగా బదిలీచేయాల్సి ఉంది. రెవెన్యూ శాఖలో ఎన్నికల ప్రక్రియతో తహశీల్దార్ కేడర్ అధికారులు సంబంధం కలిగివుంటారు. జిల్లాలోని 34 మండలాల్లో ప్రస్తుతం 33 మండలాలకు తహశీల్దార్లు ఉన్నారు. ఆర్డీవో కార్యాలయాలు, కలెక్టరేట్‌లో మరో పది మంది వరకు పనిచేస్తున్నారు. వీరితో సగం మంది జిల్లా వాసులు ఉన్నట్టు తెలుస్తోంది. మూడేళ్ళపాటు పనిచేస్తున్న వారితోపాటు స్థానిక జిల్లావాసులను తప్పనిసరిగా ఇతర జిల్లాలకు బదిలీ చేయాల్సి వుంటుంది. కొందరు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లను బదిలీచేసే అవకాశం ఉంది. రెవెన్యూ ఉన్నతాధికారుల్లో అత్యధిక శాతం జిల్లాకు వచ్చి ఇంకా రెండేళ్ళు కూడా పూర్తికాకపోవడంతో వారే కొనసాగే అవకాశం ఉంది. తహశీల్దార్ క్యాడర్‌లోనే బదిలీలు జరుగుతాయనే ప్రచారం సాగుతోంది. రెవెన్యూ శాఖ వద్ద జాబితా సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. పోలీస్‌శాఖలో ఎస్ఐలు బదిలీ కావడంతో త్వరలో సీఐ, డీఎస్పీ క్యాడర్‌లో బదిలీలు ఉంటాయని భావిస్తున్నారు. బదిలీలకు మానసికంగా సిద్ధమైన ఏ జిల్లాలో పోస్టింగ్ ఇస్తారోననే ఆందోళన అధికారుల్లో నెలకొంది.


రైతు పప్పుశెనగ పంటను పొలంలోనే వదిలివేయడంతో మేస్తున్న గొర్రెలు

పప్పుశెనగ పంటను వదిలేశారు

- 20 వేల ఎకరాల్లో పంట నష్టం
- కరవు కాటుకు 'అనంత' రైతు విలవిల
- ప్రభుత్వం ఆదుకోవాలని విన్నపాలు

విశాలాంధ్ర -ఉరవకొండ: పెట్టుబడులు కూడా తిరిగొచ్చే పరిస్థితులు కానరాకపోవంతో పప్పుశెనగ పంటను రైతులు గొర్రెల మేతకు వదిలేసిన దుస్థితి అనంతపురము జిల్లాలో కరవు తీవ్రతకు అద్దంపడుతోంది. రబీ సీజన్‌లో అరకొర వర్షాలకు జిల్లాలోని విడపనకల్లు, ఉరవకొండ మండలాల్లో రైతులు సుమారు 20 వేల ఎకరాల్లో పప్పుశెనగ పంట సాగుచేశారు. విత్తనం వేసినప్పటి నుంచి వర్షాలు రాకపోవడంతో పైరు మెట్టవేసుకుపోయింది. దిగుబడిపై రైతులు ఆశలు వదులుకున్నారు. పంట తొలిగించినా కూలీలకు ఖర్చులు రావని గ్రహించిన విడపనకల్లు మండలంలోని కొన్ని గ్రామాల రైతులు గొర్రెల మేతకు వదిలేశారు. ఈ పరిస్థితిపై కొట్టాలపల్లి గ్రామ రైతులు కొందరు స్పందిస్తూ ఎకరం పప్పుశెనగ పంట సాగుకు రూ.10 వేల వరకు పెట్టుబడి పెట్టామని, ఒకటి, రెండు బస్తాల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. పంట తొలగించినా కూలీల డబ్బు కూడా వచ్చే అవకాశం లేకపోవడంతో పొలంపైనే వదిలేశామని వాపోయారు. పొలాలకు సమీపంలో హంద్రీనివా కాలువ నీరు పారుతున్నప్పటికీ వాడుకొనే సౌకర్యం లేకపోవడంతో దారుణంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ చేజారినా రబీలోనైనా పంట వస్తుందన్న ఆశతో ఉన్నా వర్షాల జాడ కానరాకపోవడంతో రెండు పంటలు కోల్పోయినట్టేనన్నారు. లక్షలాది రూపాయలు అప్పులు మిగిలాయన్నారు. తమ పంట పొలాలను ఉన్నతాధికారులు పరిశీలించి పంటనష్ట పరిహారం, బీమా సౌకర్యం కల్పించాలని వేడుకొంటున్నారు.

హైకోర్టులలో మహిళలకు తగిన ప్రాతినిధ్యమేది?

670 మంది జడ్జిల్లో వారున్నది 73 మందే..! - కేంద్ర గణాంకాల్లో వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలోని వివిధ హైకోర్టుల్లో న్యాయమూర్తులుగా మహిళలకు తగిన ప్రాతినిధ్యం దక్కడంలేదు. ఆయా హైకోర్టులలో వారి సంఖ్య ప్రస్తుతం చాలా తక్కువగా ఉన్నది. కేవలం 11శాతం మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. ఈ విషయం పార్లమెంటరీ కమిటీకి కేంద్ర న్యాయమంత్రిత్వశాఖ అందించిన సమాచారంలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా మొత్తం 24హైకోర్టులు ఉన్నాయి. వీటికి 1079 జడ్జి పోస్టులు మంజూరు కాగా కేవలం 670 మంది మాత్రమే ప్రస్తుతం విధుల్లో ఉన్నారు. అంటే 409 పోస్టులు ఖాళీగానే ఉండిపోయాయి. ఇక గతేడాది మార్చి 23 నాటికి ఈ 670 మందిలో మహిళా న్యాయమూర్తులు మాత్రం 73 మంది మాత్రమే ఉన్నారు. న్యాయమూర్తులుగా మహిళలు, అట్టడుగు వర్గాల ప్రజల ప్రాతినిధ్యంపై పార్లమెంటరీ ప్యానెల్ ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన కేంద్రం.. జడ్జిల నియామకాలపై ప్రతిపాదనలు పంపే క్రమంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, మహిళలలో తగినవారికి స్థానం ఇవ్వాలని దేశంలోని హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను కోరినట్టు న్యాయ మంత్రిత్వశాఖ తెలిపింది. సమాజంలోని వివిధ వర్గాలకు ఉన్నత న్యాయస్థానాల్లో సముచిత స్థానం కల్పించడానికి ఇది దోహదం చేస్తుందని కమిటీకి వివరించింది. ఉన్నత న్యాయస్థానాల్లో రిజర్వేషన్లను అనుమతించడానికి వీలు కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 124, 217లను సవరించే ప్రతిపాదన లేదని స్పష్టం చేసింది. కమిటీ తన నివేదికను రూపొందించే నాటికి దేశంలో 24హైకోర్టులు ఉండగా.. జనవరి 1నుంచి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లకు వేర్వేరు హైకోర్టులు లభించడంతో ఆ సంఖ్య 25కు చేరింది.

హేతువాద పితామహుడు త్రిపురనేని



విశాలాంధ్ర - ఒంగోలు : తెలుగుసాహిత్యంలో ప్రజాకవి వేమన తర్వాత సమాజంలో పాతుకుపోయిన మూఢనమ్మకాలను ఛీప్పించెండాడిన కవిరాజు త్రిపురనేని రామస్వామి. పురాణాలు,రామాయణ భారతాలు, భగవద్గీతా ప్రభావం సామాజంపై వుంది. వాటి ప్రభావం నుంచి బయటపడనిదే మూఢ నమ్మకాలు పోవని భావించిన త్రిపురనేని,ఆ పునాదులను బద్దలుకొట్టేందుకు వాటిలోని మురికిని, కాలుష్యాన్ని దుర్గంధాన్ని ఎత్తిచూపారు. కృష్ణజిల్లా అంగలకుదురులో 1887 జనవరి 15న రైతుకుటుంబంలో జన్మించారు. శూద్రునికి సంస్కృతం నేర్పరాదన్న నియమాన్ని దిక్కరించి ఎదుర్కొన్నారు. పట్టుదలతో సంస్కృతం నేర్చుకొని బాల్యంలోనే చెల్లపిళ్ల వెంకటశాస్త్రి గార్లతో కలసి శతావధానాలు చేశారు.1914 లో డబ్లిన్ వెళ్లి బారిస్టరుచేసారు .

1922 లో తెనాలిలో లాయర్‌గా ప్రాక్టీసు మొదలు పెట్టి,1925 నుంచి తెనాలి మునిసిపల్ చైర్మన్‌గా రెండుసార్లు ఎన్నికయ్యారు. సమయస్ఫూర్తి,చతురత ఆయన సొంతం. 1926 నుంచి మూడు సార్లు ఆంధ్ర వర్సిటీకి సెనేట్ సభ్యునిగా ఎన్నికయ్యారు.1929లో ఆంధ్రమహాసభ,బెజ్జోడాల నాగేశ్వరరావు పంతులు ప్రతిపాదించగా ,కడప కోటిరెడ్డి అధ్యక్షతన త్రిపురనేని రామస్వామికి 'కవిరాజు' బిరుదు ప్రదానం చేసారు.1942 ఏప్రిల్ 25న గుడివాడలో కవిరాజుకి గజారోహణంతో పురవీధులలో ఊరేగింపు జరిగింది. ఈయన రాసిన గ్రంధాలలో 'సూతపురాణం' ప్రముఖంగా చెప్పుకోదగ్గ,దేవుళ్ళకే కూడులేదని సూతపురాణం రెండవ పద్యంలో చాలాస్పష్టంగా పేర్కొన్నారు.

'ఇళ్లిల్లు దిరిగెడు ఇల్లాలు కోసమై రైతాంగపురహరకాలుండ, పొట్టకూడును లేక కట్టుబట్టయులేక త్రిపురారి మున్షిపై తిరుగుచుండ,పెండ్లిపేరంటం పెద్దరికంబులేక క్రీస్తు సిలువపై ట్రెక్కుచుండ, క్రమ్మించి రేగు శత్రువులగారు మహమ్మదుగురికి గుదారవెత్తుచుండ,వీరిపాల్చటి నేను మొరపెట్టుకొన్న, చెంతకుచేరి నాగోడు చెప్పుకున్న,అద్దరా ! తీర్తురా !అడియాసగాక జడ్డెవారికి కోతలుపెట్టు టేట' అని చాలా చక్కగా దేవుళ్లదీన గాథను వివరించారు. ఇంకా పౌరోహిత్యానికి మరణశయ్య అన్నట్లుగా మంత్రాల రహితంగా వివాహాలను ప్రవేశపెట్టారు. కురుక్షేత్ర సంగ్రామం,ఖూనీ ,కుప్పుస్వామిశతకం, భగవద్గీత, మొదలైన ఎన్నో గ్రంథాల రూపకర్త. అతితక్కువ వయసులో 1943 జనవరి 16న మృతి చెందారు. నేడు ఆయన జయంతి సందర్భంగా ఒంగోలు ప్రెస్‌క్లబ్‌లో హేతువాదసంఘం ఆయన స్మృత్యర్థం సభ నిర్వహిస్తోంది. అందరూ ఆహ్వానితులే.

సమ్మోహనం.. ప్రకృతి సేద్యం

ఐరాస ప్రశంసలు -సీఎంకు లేఖ

రాష్ట్రాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రోత్సాహం



విశాలాంధ్ర బ్యూరో -అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రకృతి సేద్యానికి అంతర్జాతీయంగా ప్రశంసలు లభిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి పర్యావరణ విభాగం సైతం ప్రశంసిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబుకు లేఖరాసింది. "పర్యావరణం, ఆర్థిక, సామాజిక అంశాలపై ఎంతో సానుకూల ప్రభావాన్ని చూపగల జీరో బడ్జెట్ ప్రకృతి సేద్యం పద్ధతులను మీ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. 2024 నాటికి 60 లక్షల మంది రైతులు ఈ విధానాన్ని అవలంబించేలా చేయాలన్న మీ అత్యుత్తమ ఆకాంక్షకు మద్దతు పలకటం, సహాయకారిగా నిలబడటం మాకు గౌరవప్రదం" అని ఆ లేఖలో ఐక్యరాజ్య సమితి పర్యావరణ విభాగం పేర్కొంది.

ధనాశతో పరుగెత్తే మనిషి సహజ జీవితం సాగించలేడన్నది తాత్వికుల మాట. బహుశా ...ఇది అక్షరమయ్యే కాబోలు.. కాంక్రీటు కీకారణ్యంలో డబ్బు యావతో గడిపేసే యాంత్రిక మనుషులు పచ్చని పల్లెలకు పరుగులు పెడుతున్నారు. వ్యవసాయమే జీవితంగా బతుకుతున్న రైతు చెంతకు చేరుతున్నారు. ఇంతలోనే అంత మార్పున్నది ...ప్రకృతి వ్యవసాయానికి పచ్చటి తివాచీ పరిచిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాధించిన ఘనతే.

ప్రకృతి సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం : ఆరోగ్య వంతమైన నేల, అందులో పండే పంట, దాని ద్వారా వచ్చే ఆహారం.. ఇదే మన లక్ష్యం అంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సేంద్రియ సేద్యం దిశగా రైతుల్ని ప్రోత్సహిస్తోంది. రాష్ట్రాన్ని పచ్చదనంతో నింపడంతోపాటు ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా జీవించేలా ఆహార ఉత్పత్తులు ఉండేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రజలంతా ఆరోగ్యంగా జీవించడానికి ప్రకృతి సాగును ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగానే 2018ని ప్రకృతి వ్యవసాయ సంవత్సరంగా ప్రకటించింది. ప్రకృతి సేద్యాన్ని పెద్దఎత్తున అమలు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ దిశగా రైతులను చైతన్య పరచడంలోనూ విజయవంతమైంది. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం వల్ల లాభాలను, వాతావరణానికి చేసే మేలును గమనించిన అజీం ప్రేమ్‌జీ ఫిలాంత్రోపిక్ ఇనిషియేటివ్ వారు ఈ పథకం అమలుపై రూ. 100 కోట్లు సహాయం చేయడానికి ముందుకు వచ్చి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంలో విప్లవం : ఏపీలో భవిష్యత్ అంతా సేంద్రియ వ్యవసాయానిదే అనడంలో సందేహం లేదు. ఇందుకు ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో సాధించిన సహజ ప్రగతే నిదర్శనం. ఒక విధంగా ప్రకృతి వ్యవసాయంలో ఏపీ రైతులు విప్లవమే తీసుకొచ్చారు. ఇక ప్రకృతి సిద్ధమైన సేద్యం కోసం ఏపీ ప్రభుత్వం రూ. 2500 కోట్లు వెచ్చిస్తోంది. ఇప్పటికే సుమారు లక్ష మంది రైతులు జీరో బడ్జెట్‌తో సహజసిద్ధంగా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది చివరికి 5 లక్షల మంది రైతులు సేంద్రీయ వ్యవసాయానికి మొగ్గు చూపుతారని అధికారుల అంచనా. రాబోయే ఐదేళ్లలో 60 లక్షల మంది రైతులు సేంద్రీయ విధానం ద్వారా సాగు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇతర రాష్ట్రాలు ఏపీని ఆదర్శంగా తీసుకుని.. జీరో బడ్జెట్ ఫార్మింగ్‌ను ప్రయత్నాలు చేస్తున్నాయి. 2016-17 సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 116 మండలాల్లో, 704 గ్రామాల్లో 40,656 మంది రైతులు ప్రకృతి సేద్యం చేశారు. 2017-18 సంవత్సరం నాటికి 331 మండలాల్లో, 971 గ్రామాల్లో 1.63 లక్షల మంది రైతులు సేద్యం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3015 గ్రామాల్లో 5.23 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. సేంద్రియ విప్లవ పితామహుడు సుభాష్ పాలేకర్ విధానాలను అనుగుణంగా ఆయన సలహాలు, సూచనలతో కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. స్వయంగా పాలేకర్ తో అధికారులు పలుచోట్ల శిక్షణ శిబిరాలు నిర్వహించారు.

రసాయనాల వాడకంతో అన్నీ ఇబ్బందులే : నేడు వ్యవసాయం చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఓ వైపు తీవ్ర వర్షాభావ పరిస్థితులు, మరోవైపు అధిక వ్యయంతో రైతు దిగాలు చెందుతున్నారు. కష్టాలు ఓర్చి పంట చేతికొచ్చే సరికి సరైన గిట్టుబాటు ధర దొరకని పరిస్థితి. ఒక్కో ఎకరాకి సగటున లక్ష వరకు పెట్టుబడి పెడుతున్న రైతు... అధిక దిగుబడి వస్తుందనే భ్రమతో రసాయన ఎరువులను ఆశ్రయిస్తున్నారు. ఎరువులు, పురుగుమందులు అధికంగా వినియోగించడం వల్ల... ఉత్పత్తి పెరగడం మాట అటుంచి...పర్యావరణం, ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోంది. అశాస్త్రీయ వ్యవసాయ పద్ధతులతో జీవరాసులు అంతరించిపోతున్నాయి. ప్రకృతి వ్యవసాయానికి మళ్లకపోతే మరో 200 ఏళ్లకు భూసారం పూర్తిగా దెబ్బతింటుందని పలు పర్యావరణ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ప్రస్తుత పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుందని స్పష్టం చేస్తున్నాయి. సేంద్రియ వ్యవసాయం కారక మంత్రంగా మారిన నేటి కాలంలో పుడమి తల్లితో పాటు ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు ప్రకృతి సేద్యమే ఏకైక మార్గం. ఈ విషయాన్ని గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ దిశగా భూసార కార్యాచరణ రూపొందించి అమలు చేసింది. విషపూరితమైన కృత్రిమ ఎరువులు, క్రిమిసంహారక మందులకు దూరంగా సహజ పద్ధతుల్లో వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహించింది. రాష్ట్రంలో భవిష్యత్ అంతా సేంద్రీయ వ్యవసాయానిదే అనడంలో సందేహం లేదు. ఇందుకు ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో సాధించిన సహజ ప్రగతే నిదర్శనం. ఒక విధంగా ప్రకృతి వ్యవసాయంలో ఏపీ రైతులు విప్లవమే తీసుకొచ్చారు.

రసాయనిక ఎరువులవల్ల భూసారం రోజురోజుకు పడిపోతోంది. అదే సేంద్రియ వ్యవసాయం చేస్తే పుడమి మరింత సారవంతమవుతుంది. సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రియ ఉత్పత్తుల వినియోగం పెరగాలి. సేంద్రియ ఉత్పత్తుల ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం మన చేతిలోనే ఉంటుంది. నాలుగున్నరేళ్లుగా సేంద్రియ వ్యవసాయం వైపు అన్నదాతను ప్రోత్సహించడంలో వ్యవసాయ శాఖ అధికారుల కృషి అభినందనీయం. ఇదే ఉత్సాహంతో పనిచేస్తే నూరు శాతం పచ్చని ఆంధ్రప్రదేశ్ కలసాకారమవుతుంది.

ఎస్సీ, ఎస్టీల కోటా తొలగించడం..

ఆరెస్సెస్-బీజేపీ ప్రధాన ఎజెండా

దళిత నేత జిగ్నేశ్ మేవానీ



కోల్‌కతా: ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు తొలగించడమే ఆరెస్సెస్-బీజేపీ ప్రధాన ఎజెండా అని గుజరాత్ ఎమ్మెల్యే దళిత నేత జిగ్నేశ్ మేవానీ వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని రద్దు చేయడం, కుల ఆధారిత రిజర్వేషన్లను మాగింపు పలకాలనేవి ఆరెస్సెస్- బీజేపీల దీర్ఘకాలిక లక్ష్యాలని అన్నారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన ప్రజలకు ప్రాతినిధ్యం కల్పించే ఉద్దేశ్యంతో దేశంలో రిజర్వేషన్ విధానాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. అంతేకానీ, ఇది పేదరికాన్ని అంతం చేసే లక్ష్యంతో అమలు చేస్తున్నది కాదని తెలిపారు. బెంగాల్‌లోని కోల్‌కతాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకున్న నైనం.. కుల ఆధారిత రిజర్వేషన్లను పూర్తిగా తొలగించాలనే ఆరెస్సెస్-బీజేపీ ఎజెండాను నిజం చేస్తున్నట్లుగా ఉన్నదని తెలిపారు. సామాజిక, విద్యాపరమైన వెనుకబాటు ఆధారంగా కల్పించే రిజర్వేషన్లకు సస్తి చెప్పేందుకు ఇది తొలి అడుగు ఉన్నదని, ఈ నిర్ణయంవల్ల తనతోపాటు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇతర కులాల పేదలు లబ్ధి పొందడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే రిజర్వేషన్ పేదరికాన్ని తొలగించేందుకు కాదన్న విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. కుల వ్యవస్థ వల్ల సామాజికంగా, విద్యారంగంలో వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను ఆయా రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించడమే రిజర్వేషన్ లక్ష్యమని తెలిపారు. అలాగే, ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి వ్యతిరేకంగా పొత్తుపెట్టుకున్నందుకు బీఎస్పీ చీఫ్ మాయావతి, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌లకు అభినందనలు తెలిపారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలకుండా ఇతర విపక్ష పార్టీలు పొత్తు పెట్టుకోవాలని అన్నారు.

ద్రవ్యలోటు లక్ష్యసాధన కష్టమే

నిపుణుల అంచనా



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19) దేశ జీడీపీలో ద్రవ్యలోటును 3.3 శాతానికి కట్టడి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోవచ్చని నిపుణులు అంటున్నారు. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు పడిపోతుండటం, ఖర్చులు పెరిగిపోతుండటం, పార్లమెంటు ఎన్నికలు కీలకమైన మధ్య ఈసారి లక్ష్యసాధన సర్కారుకు సవాలేనని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి పెద్ద ఎత్తున సంక్షేమ పథకాల ఫలాలను అందించే దిశగా మోదీ సర్కారు అడుగులు వేస్తుండటంతో ఈ దఫా ద్రవ్యలోటు నియంత్రణ గగనమేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ సారి జీడీపీలో ద్రవ్యలోటు 3.5 శాతానికి పెరగవచ్చని అంచనాలు వేస్తున్నారు. 2018-19 జీడీపీలో ద్రవ్యలోటును 3.3 శాతం లేదా రూ.6.24 లక్షల కోట్లకు కట్టడి చేస్తామని గతేడాది ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో వార్షిక బడ్జెట్ ప్రకటన సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ ఏప్రిల్-నవంబర్ వ్యవధిలోనే ద్రవ్యలోటు రూ.7.16 లక్షల కోట్లకు చేరిపోయింది.

మరో నాలుగు నెలలు మిగిలి ఉండగానే లక్ష్యానికి దాదాపు లక్ష కోట్లు మించి ద్రవ్యలోటు నమోదు కావడం ప్రభుత్వ వర్గాల్లోనూ కలవరమే వ్యక్తమవుతున్నది. అందుకే ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాన్ని పెంచుతున్న మోదీ సర్కారు. మధ్యంతర డివిడెండ్లను పెద్ద మొత్తంలో కోరుతున్నది. ఎన్నికల ఏడాది కావడంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి భారీగా మధ్యంతర డివిడెండ్‌ను ఆశిస్తున్నది. ఈ క్రమంలో మూడీస్, ఇండియా రేటింగ్స్, క్రిసిల్, ఎల్అండ్‌టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి దిగ్గజాలు ద్రవ్యలోటు లక్ష్యసాధన కష్టమేనని అంటున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2017-18) జీడీపీలో ద్రవ్యలోటును 3.5 శాతానికి ఆదుపు చేసిన ప్రభుత్వం.. ఈసారి దాన్ని 3.3 శాతానికి కుదించి లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. గత నెల ఆర్థిక మంత్రి జైట్లీ సైతం లక్ష్యాన్ని సాధిస్తామన్న ధీమాను వ్యక్తం చేయగా, తాజా పరిస్థితులు నరియు అంత సులభం కాదన్న సంకేతాలు బలంగా కనిపిస్తున్నాయి.

ఎన్పీఏ వాటాలపై ఆశ

యాక్సిస్ బ్యాంక్, ఐటీసీల్లో స్పెసిఫైడ్ అండర్‌టేకింగ్ ఆఫ్ యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (ఎస్‌యూయూటీఐ) ద్వారా నిర్వహిస్తున్న వాటాలను కొంతమేర అమ్మేయాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ యోచిస్తున్నది. రాబోయే కొద్ది నెలల్లో విక్రయం ఉండొచ్చని ఓ అధికారి సంకేతాలిచ్చారు. కాగా, గతేడాది సెప్టెంబర్ 30 నాటికి యాక్సిస్ బ్యాంక్‌లో దాదాపు 9.63 శాతం, ఐటీసీలో 7.97 శాతం, ఎల్అండ్‌టీలో 1.80 శాతం చొప్పున వాటాలను ఎస్‌యూయూటీఐ కలిగి ఉన్నది. అయితే ఎల్అండ్‌టీ వైజాక్ ఆఫర్‌కు వచ్చే వీలుండటంతో దానికోసం ఎదురుచూస్తున్న కేంద్రం.. యాక్సిస్ బ్యాంక్, ఐటీసీల్లో వాటాలను బల్క్ లేదా బ్లాక్ డీల్స్ ద్వారా అమ్మనుకుంటున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా ఖజానాకు రూ.80,000 కోట్ల నిధులను తరలించాలని మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే ఇప్పటిదాకా రూ.34,000 కోట్లకుపైగానే సమీకరించింది.

ప్రమాదాల నివారణకు నీలం రంగు లైటు



న్యూఢిల్లీ: కదులుతున్న రైలు ఎక్కడం వల్ల జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు భారతీయ రైల్వే కొత్త పద్ధతిని ప్రవేశపెడుతోంది. బోగీకు ఉన్న ప్రతి ద్వారం వద్ద నీలం రంగు లైట్లను అమర్చుతోంది. రైలు కదులుతున్న సమయంలో ఇవి మిణుమిణుకుమనేలా ఏర్పాటు చేస్తున్నారు. ఈ లైట్లు వెలిగితే, రైలు కదులుతోందని, ఎవరూ ఎక్కే ప్రయత్నం చేయొద్దని అర్థం. ప్రస్తుతం ఈ విధానాన్ని ముంబయి లోకల్ రైళ్లకు మాత్రమే ప్రయోగాత్మకంగా అమర్చారు. రైలు కదిలే ముందు రైలు పొడవునా ప్రతి ద్వారం వద్ద ఉన్న నీలం రంగు లైట్లు వెలిగేలా, దీని నియంత్రణ గార్డు చేతిలో ఉండే ఏర్పాటు చేశారు.

"ఈ నీలం రంగు లైట్లను ప్రమాదాలను నివారించేందుకే ఏర్పాటు చేస్తున్నాం. రైలు కదులుతున్న సమయంలో ఈ లైటు నుంచి వచ్చే కాంతి కిరణం ప్లాట్‌ఫారంపై పడుతుంది. దాన్ని దాటి వస్తే ప్రమాదమని హెచ్చరించడమే దీని ఉద్దేశం." అని ఓ రైల్వే అధికారి సోమవారం తెలిపారు. రైలు కదులుతున్న సమయంలో ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాలను పరిశీలించిన రైల్వే మంత్రి దీనిని నివారించడానికి సూచించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ముంబయిలోనే ఎక్కువ ప్రమాదాలు జరిగిన దృష్ట్యా తొలుత ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఆ ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు అధికారి తెలిపారు.ముంబయిలో లోకల్ రైళ్లకు చాలా ప్రాధాన్యం ఉంది. నగరంలో రోజూ సరాసరి 75 లక్షల మంది వీటి ద్వారా ప్రయాణిస్తుంటారు. లోకల్ రైల్వే లైన్లు 427.5 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. అత్యంత రద్దీతో తిరుగుతుండే రైళ్ల నుంచి ఎక్కువ మంది రైలు కదులుతుండగా ఎక్కడం.. దిగడం వంటివి చేస్తుంటారు. గతేడాది జనవరి-జులై మధ్య కాలంలో కదులుతున్న రైలు నుంచి కింద పడి సుమారు 871 మంది గాయాల పాలైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

ప్రధానికి ఫిలిప్ కొట్లర్ పురస్కారం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీని మొట్టమొదటిసారి ఫిలిప్ కొట్లర్ (ప్రెసిడెన్షియల్ పురస్కారం వరించింది. 'పీపుల్-ప్రాఫిట్-ప్లానెట్' అంశాల ప్రాతిపదికన ఈ అవార్డు లభించింది. సోమవారం ఢిల్లీలో మోదీ ఈ పురస్కారం అందుకున్నారని ప్రధాని కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రాతిపదికల కింద ఏటా ఓ దేశ నాయకుడిని ఎంపిక చేసి ఫిలిప్ కొట్లర్ పురస్కారాన్ని అందిస్తారని ప్రకటనలో తెలిపారు. దేశానికి అత్యుత్తమంగా నాయకత్వం వహిస్తున్నందుకు గానూ ఈ అవార్డు లభించినట్లు పురస్కార పత్రంలో పేర్కొన్నారు. "మోదీ దేశానికి చేస్తున్న నిస్వార్థ సేవ ఫలితంగా ఆర్థిక, సామాజిక, సాంకేతిక రంగాల్లో మంచి వృద్ధి కనిపించింది. విస్తృత అభివృద్ధులు, తయారీ, ఐటీ ఇతర ప్రొఫెషనల్ సేవలకు కేంద్రంగా భారత్‌కు గుర్తింపు లభించడం మోదీ నాయకత్వంలోనే జరిగింది." అని పురస్కార పత్రంలో వివరించారు."మోదీ దూర దృష్టితో కూడిన పాలన దేశంలో డిజిటల్ విప్లవానికి దోహదపడింది. భారత్‌లో తయారీ, స్వచ్ఛ్ భారత్, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి నినాదాలు దేశానికి ఎంతో తోడ్పడ్డాయి. ప్రపంచంలోనే లాభదాయకమైన, వ్యాపార అనుకూల ప్రాంతంగా దేశం నిలిచేందుకు ఇవి దోహదం చేశాయి," అని పురస్కార పత్రంలో వివరించారు. అమెరికాకు చెందిన ప్రొఫెసర్ ఫిలిప్ కొట్లర్ పేరుపై ఈ పురస్కారాన్ని అందజేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఫిలిప్ కొట్లర్ నార్తర్న్ విశ్వవిద్యాలయంలోని కెలాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో మార్కెటింగ్ విభాగంలో సీనియర్ ఆచార్యులుగా ఉన్నారు.

రైలుకు ఎదురెళ్లి ప్రమాదాన్ని ఆపారు!



బెళగావి: ఇద్దరు యువకులు ప్రాణాలకు తెగించి చేసిన సాహసం కొన్ని వందల మంది ప్రయాణికుల ప్రాణాలను నిలబెట్టి పెను ప్రమాదాన్ని జరగనివ్వకుండా ఆపింది. సదరు యువకులు చేసిన ప్రయత్నం వల్ల కొల్హాపూర్-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ త్రుటిలో పెను ప్రమాదం నుంచి బయటపడింది. శుక్రవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉగార్ స్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై పెద్ద చెట్టు విరిగి పడి ఉండటాన్ని ఆరిఫ్ రియాజ్ నదాఫ్, అతని స్నేహితుడు తౌఫిక్ అబ్బల్ గమనించారు. ఆ చెట్టును తొలగించేందుకు అక్కడ వారికో కలిసి ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ రావడాన్ని రియాజ్, అబ్బల్ గమనించారు. వెంటనే రైలుకు ఎదురుగా పరిగెత్తుకుంటూ వెళ్లి కేకలు వేసుకున్నారు. ప్రమాదం గురించి హెచ్చరిస్తూ వాళ్లిద్దరూ రైలుకు ఎదురుగా పరిగెత్తుకుంటూ వెళ్లారు. వాళ్ల దగ్గరకు రైలు రాగానే ట్రాక్ మీద నుంచి పక్కకి దూకి మళ్లీ రైలు వెంటే పరిగెత్తి ఆపేందుకు ప్రయత్నించారు. గమనించిన లోకో పైలెట్ ఏదో ప్రమాదం ఉందని గ్రహించి ఎమర్జెన్సీ బ్రేకులు ఉపయోగించి రైలును ఆపివేశారు. చెట్టు పడిన ప్రదేశానికి కేవలం 15 మీటర్ల దూరంలోనే రైలు ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎంతో సాహసంతో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఆ ఇద్దరు యువకులు చేసిన పనిని అందరూ మెచ్చుకున్నారు. వారి సమయస్ఫూర్తితో ఎంతో మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడినందుకు లోకో పైలెట్ కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయ రంగంలో వృద్ధి గణనీయం

ఏటా పెరుగుతున్న బడ్జెట్

రైతుల ఆదాయం పెరిగేందుకు ఒప్పందాలు

విశాలాంధ్ర బ్యూరో -అమరావతి : రాష్ట్రంలో వ్యవసాయ రంగం చెప్పుకోదగ్గ స్థాయిలో అభివృద్ధి సాధిస్తోంది. గత నాలుగేళ్లుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో వర్షాలు తగినంతగా కురవకపోయినా వ్యవసాయ రంగంలో ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుతోంది. వ్యవసాయంలో మన రైతుల నైపుణ్యాన్ని ఇది ప్రతిబింబిస్తోంది. రాళ్ల భూముల్లో సైతం పంటలు పండించగల సమర్థులు, వ్యవసాయంలో కొత్త అంచెస్తే అలుపుకుపోగల దిట్టలు. అన్ని రకాల పంటల సాగులో అనుభవం ఘడించినారు మన రైతులు. సాగునీరు, సూక్ష్మ నీటి పారుదల వ్యవస్థ, సాంకేతిక అంశాలలో ప్రభుత్వం అందించినవేటిని అందిపుచ్చుకొని ఎక్కువ భూమిని సాగులోకి తీసుకురాడడానికి, పంట దిగుబడులు ఎక్కువ సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచే స్థాయికి ఎదిగారు మన రైతులు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రెండంకెల స్థిరమైన వృద్ధి రేటు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికలతో తీవ్రంగా కృషి చేస్తోంది. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో స్థిరమైన వృద్ధిరేటు సాధించేందుకు, వ్యవసాయంపై ఆధారపడి జీవించేవారి ఆదాయం పెరిగేందుకు ప్రభుత్వం వివిధ అంశాలకు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో పలు సంస్థలు, విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలు చేసుకుంటోంది. భూసార పరీక్ష, విత్తన శుద్ధి, వర్షపాతం, విత్తనాలు నాటే సమయం, డ్రోన్ల ఉపయోగం, ఉత్పాదకత పెంచడం, వ్యవసాయంలో సాంకేతికత, వ్యవసాయ, సముద్ర ఉత్పత్తుల నిల్వ, ప్యాకింగ్, మార్కెటింగ్...... వంటి అనేక అంశాలలో సహకారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంటోంది. బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్, సస్టెయినబుల్ ఇండియా ఫైనాన్స్ ఫెసిలిటీ వంటి సంస్థలతోపాటు ఆహారఉద్ది రంగంలో ప్రసిద్ధి చెందిన దాదాపు 25 సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది.



అమెరికాలోని న్యూ మెక్సికో స్టేట్ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకోవడానికి సంప్రదింపులు జరుపుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికేడాది వ్యవసాయ రంగం బడ్జెట్ పెంచుతోంది. 2013-14లో రూ.6,128 కోట్లు ఉన్న వ్యవసాయ బడ్జెట్‌ను 2018-19 నాటికి రూ.19, 070 కోట్లకు పెంచింది. వ్యవసాయ అనుబంధ రంగాల్లో రైతుల ఆదాయం రెట్టింపు అయింది. 2013-14కు రూ.1.28 లక్షల కోట్లు రాగా, 2017-18లో అది 2.53 లక్షల కోట్ల(18.97%)కు పెరిగింది. 2016-2017లో ప్రాథమిక వ్యవసాయ రంగం వృద్ధి రేటు దేశంలో 7.11 శాతం కాగా, రాష్ట్రంలో 14.03 శాతం ఉంది. గత నాలుగేళ్లుగా వర్షపాతం తక్కువగా ఉన్నా వ్యవసాయ రంగం వృద్ధి రేటు 2017-18లో 17.18 శాతంగా నమోదైంది.

పట్టిసీమ ద్వారా నాలుగేళ్లలో రూ. 44 వేల కోట్ల విలువైన పంట పండింది. ఇదే సమయంలో రాయలసీమకు కృష్ణా జలాలు తీసుకెళ్లి చెరువులు నింపారు. పట్టిసీమ ద్వారా జూన్ 17న ముందస్తుగా కృష్ణా డెల్టాకు నీరు విడుదల చేయడం వల్ల 11 లక్షల ఎకరాల విస్తీర్ణాన్ని స్థిరీకరించడమే కాక, రైతులు పది శాతం అధిక దిగుబడులు సాధించారు. ముందస్తుగా నీరు విడుదల చేయడం వల్ల రబీలో అదనంగా 75 వేల ఎకరాలలో వివిధ పంటలు సాగు చేశారు. విషపూరితమైన కృత్రిమ ఎరువులు, క్రిమి సంహారక మందులు లేకుండా సహజసిద్ధ వ్యవసాయం ద్వారా ప్రజలకు మంచి ఆహారోత్పత్తులు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోంది. ఈ రకమైన ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. వర్షాభావ పరిస్థితులను తట్టుకుంటుంది. రాష్ట్రంలో 2015 సెప్టెంబరులో జడ్ బీఎన్ఎఫ్(జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్)ని ప్రవేశపెట్టి 2016 ఖరీఫ్ లో అమలు చేయడం మొదలుపెట్టారు. రెండేళ్లలో మంచి ఫలితాలు సాధించారు.

ప్రస్తుతం రాష్ట్రం లోని 13 జిల్లాల్లో 6 లక్షల ఎకరాల్లో జడ్‌బీఎన్ఎఫ్ కింద సాగుచేస్తున్నారు. 2018ని ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ సంవత్సరంగా ప్రకటించింది. ప్రకృతి వ్యవసాయంలో రాష్ట్రం దేశంలో నెంబరు 1 గా నిలిచింది. 2021-22 నాటికి 1.5 లక్షల మంది రైతులు, 2023-24 నాటికి 60 లక్షల మంది రైతు కుటుంబాలను ఈ కార్యక్రమం కిందకు తీసుకురావాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే వ్యవసాయ, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి జీవించేవారి ఆదాయం ఆశించిన స్థాయిలో పెరగడంలేదు. ప్రతి వ్యక్తి ఆదాయం కనీసం నెలకు రూ.10వేలకు అయినా చేరేలా చూడాలి.

క్రీడలు



నిలవాలంటే.. గెలవాలంతే..

చారిత్రక టెస్టు సిరీస్ గెలిచిన ఊపులో వన్డే సిరీస్ ఆరంభించిన టీమిండియాకు తొలి వన్డేలో అనూహ్య పరాజయం ఎదురైంది. ఇన్నాళ్లూ టాపార్డర్ ప్రతిభపై ఆధారపడుతూ వచ్చిన టీమిండియా సిసలైన సవాల్ ఎదురైన వేళ సమష్టిగా చేతేలెత్తేశారు. బౌలర్లు కూడా నిరాశపరచడంతో... మంగళవారం జరిగే మ్యాచ్‌తో సిరీస్‌లో నిలవాలంటే.. తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- నేడు భారత్ ఆసీస్ రెండో వన్డే
- కలవర పెడుతోన్న బ్యాటింగ్ వైఫల్యం
- ధోనీ ఫిట్‌నెస్‌పైనా అనుమానాలు

విశాలాంధ్ర స్పోర్ట్స్ డెస్క్ : వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్‌ను కోల్పోయిన భారత్‌కు రెండో వన్డే చావో రేవో అన్నట్లు తయారైంది. మిడిలార్డర్ వైఫల్యం, ధోనీ ఫిట్‌నెస్ భారత్ ఎదురుకానున్న ప్రధాన సమస్యలు. హార్దిక్ పాండ్యా సస్పెన్షన్ కూడా జట్టుపై భారంగా తయారైంది. పాండ్య లోటు బ్యాటింగ్, బౌలింగ్ విభాగంలో స్పష్టంగా కనిపించనుంది. ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌పైనా అనిశ్చితి నెలకొంది. రాయుడిని కోహ్లి నాలుగో స్థానంలో పంపుతుండగా.. ఆ స్థానంలో ధోనీ ఆవశ్యకత ఉందని వైస్ కెప్టెన్ రోహిత్ చెప్పడం చర్చనాయాశమైంది. టీమిండియా బ్యాటింగ్‌లోని డొల్లతనం సిడ్నీ వన్డేలో బయటపడింది. టెస్టుసిరీస్ జరుగుతుండగా స్వదేశంలో ధావన్, ధోనీ, రాయుడు ఎటువంటి దేశవాళీ మ్యాచ్‌ల్లోనూ ఆడలేదు. ఆ ప్రాక్టీస్ లోటు తొలి వన్డేలో కనిపించింది. ధోనీ స్ట్రైక్ రేట్ కూడా చర్చనీయాంశమైంది. ఒకవైపు రోహిత్ స్ట్రైక్ రొటేట్ చేస్తున్నా... ధోనీ 51 పరుగుల చేయడానికి 96 బంతులు తీసుకోవడం అతడి ఫామ్, ఫిట్‌నెస్‌పై సందేహాలు కలిగిస్తున్నాయి. ఇక బౌలింగ్‌లోనూ వైఫల్యం కనబడింది. ముగ్గురు పేసర్‌ల్లో షమీ ఒక్కడే పర్వాలేదనిపించాడు. భువి తొలి ఓవర్లలో వికెట్లు తీసినా తరువాత ధారాళంగా పరుగులు ఇచ్చేశాడు. ఖలీల్ విఫలమైయాడు. స్పిన్‌కు సహకరించని పిచ్‌పై జడేజా, కుల్దీప్ రాణించలేకపోయారు. హార్దిక్ లేకపోవడంతో పేస్ ఆల్‌రౌండర్ లేని లోటు తెలుస్తోంది. పాండ్య స్థానంలో విజయ్ శంకర్ సోమవారం ఆస్ట్రేలియా చేరడంతో రెండో వన్డేకు అతడు అందుబాటులో ఉండకపోవచ్చు. జట్టులో ఆల్‌రౌండర్‌గా జడేజానే కొనసాగించే అవకాశం ఉంది. రాయుడుపై బౌలింగ్ యాక్షన్ ఆరోపణ వచ్చింది. విచారణ ఎదుర్కొనే వరకూ బౌలింగ్ చేసే అవకాశమున్నా, మేనేజ్‌మెంట్ ఆ సాహసం చేయకపోవచ్చు. ఖలీల్ స్థానంలో సిరాజ్‌ను ఆడించే అవకాశం ఉంది. రాయుడితో పాటు ధోనీ, ధావన్ ఫామ్‌పై అనుమానాలు ఉండడంతో వారి ఆట తీరుపై అందరి చూపు ఉండనుంది. సెంచరీతో మంచి ఫామ్‌లో ఉన్న రోహిత్‌కు తోడు కోహ్లి కూడా రాణిస్తే భారీ స్కోరుకు అవకాశాలు ఉన్నాయి. ఆస్ట్రేలియా బ్యాటింగ్ గాడిలో పడటం, యువ పేసర్లు రాణించడంతో ఆ జట్టు ఆత్మవిశ్వాసంతో ఉంది. కానీ వారిని కలవరపరుస్తున్న అంశం ఆల్‌రౌండర్ మాక్స్‌వెల్ బ్యాటింగ్ స్థానం ఒక్కటే. భారత పిచ్‌లను పోలి ఉండే అడిలైడ్ పిచ్‌పై భారీ స్కోరులు వచ్చే అవకాశం ఉండడంతో టాస్ కీలకంగా మారనుంది.

యార్కర్లు సాధన చేస్తున్నా : భువి



అడిలైడ్: జస్ప్రీత్ బుమ్రా. భారత యార్కర్ల నిపుణుడు! ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు అతడికి విశ్రాంతినివ్వడంతో ఆ బాధ్యతను ఇప్పుడు భువనేశ్వర్ కుమార్ తీసుకున్నాడు. ప్రస్తుతం అతడు బ్యాట్స్‌మెన్ పాదాలకు తగిలేలా యార్కర్లు విసరడం సాధన చేస్తున్నాడు. మంగళవారం ఆసీస్‌తో రెండో వన్డే జరగనుంది. ఈ నేపథ్యంలో అతడు నెట్స్‌లో తీవ్రంగా యార్కర్లు విసురుతూ సాధన చేస్తున్నాడు. బుమ్రా లేని లోటు పూడ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. 'యార్కర్ వేయాలంటే ప్రత్యేక నైపుణ్యం కావాలి. బ్యాట్స్‌మెన్ పాదాల వద్ద బంతులు విసిరేందుకు సాధన చేస్తున్నా. డెత్ ఓవర్లలో పరుగులు నియంత్రించేందుకు, వికెట్లు తీసేందుకు ఈ అస్త్రం ఉపయోగపడుతుంది. చాన్నాళ్లుగా నేనీ బంతులు విసరడం లేదు. నెల రోజులుగా టెస్టులు జరిగాయి. సుదీర్ఘ ఫార్మాట్‌లో యార్కర్లు తరచూ విసరరు. నేను టెస్టుల్లో ఆడలేదు. ఇప్పుడు వన్డేలు, టీ20లు ఆడుతున్నా కాబట్టి యార్కర్లు సాధన చేస్తున్నా. కొత్త బంతిని స్వింగ్ చేసి వికెట్లు తీయొచ్చు. బంతి పాతబడ్డ తర్వాత యార్కర్లు లేదా స్లో బంతులు విసిరితే వికెట్లు లభిస్తాయి. కొత్త బంతితో బౌలింగ్ చేస్తున్నప్పుడు అంతర్వృత్తం బయట ఇద్దరు మాత్రమే ఫీల్డర్లు అవసరం అవుతారు. అదే పాత బంతి వేస్తున్నప్పుడు ఎంత మంది ఫీల్డర్లు ఉన్నా బ్యాట్స్‌మెన్ భయపడరు' అని భువి అన్నాడు.

ద్రవిడ్‌తో చర్చించిన తర్వాతే.. : ఎమ్మెస్కే



న్యూఢిల్లీ: భారత జాతీయ క్రికెట్ జట్టులో చోటు దక్కించుకునే అన్ని అర్హతలు యువ క్రికెటర్ శుబ్‌మన్ గిల్‌కు ఉన్నాయని సెలక్షన్ కమిటీ చీఫ్ ఎమ్మెస్కే ప్రసాద్ స్పష్టం చేశాడు. అతనిలో విశేషమైన టాలెంట్ దాగి ఉన్నందువల్లే జాతీయ జట్టులో తొందరగా స్థానాన్ని సాధించాడన్నాడు. ప్రధానంగా జట్టు పరిస్థితులకు తగ్గట్లు బ్యాటింగ్ చేసే సత్తా శుబ్‌మాన్ సొంతమన్నాడు. అటు ఓపెనర్‌గా, ఇటు మిడిల్ ఆర్డర్‌లో కూడా శుబ్‌మన్ విశేషంగా రాణించగలడన్నాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో రెగ్యులర్ ఓపెనర్లు శిఖర్ ధావన్, రోహిత్ శర్మల స్థానంలో శుబ్‌మన్‌ను పరీక్షిస్తామన్నాడు. అయితే శుబ్‌మాన్‌కు వరల్డ్‌కప్‌లో చోటు దక్కుతుందా? లేదా ? అనే విషయంపై ఇప్పుడేమీ మాట్లాడదలుచుకోలేదన్నాడు. భారత్ జట్టులో శుబ్‌మన్‌కు అవకాశం కల్పించే సందర్భంలో భారత యువ జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో చర్చించామన్నాడు. ద్రవిడ్‌తో శుబ్‌మాన్ అంతర్జాతీయ అరంగేట్రంపై చర్చించిన పిదప అతనికి చోటు కల్పించే విషయంలో ఒక స్పష్టతకు వచ్చామన్నాడు. దేశవాళీ మ్యాచ్‌ల్లో యువ క్రికెటర్ల ఆట ఎలా ఉందనే విషయంపై ద్రవిడ్‌తో చర్చిస్తుంటామన్నాడు. అలాగే సీనియర్ క్రికెటర్ల ఆట తీరుపై కోచ్ రవిశాస్త్రిని అడిగి తెలుసుకుంటామన్నాడు. ఇది రెగ్యులర్‌గా జరిగే ప్రక్రియ అని ఎంఎస్‌కే తెలిపాడు. అలా వచ్చిన అవకాశాల్ని పృథ్వీ షా, మయాంక్ అగర్వాల్, హనుమ విహారిలు సద్వినియోగం చేసుకోవడం కచ్చితంగా భారత జట్టుకు శుభపరిణామని సెలక్షన్ కమిటీ చీఫ్ అన్నాడు.

జింబాబ్వే పర్యటనపై ఐపీఎల్ ఎఫెక్ట్



హైదరాబాద్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2019 సీజన్‌కి ముందు భారత్‌లో పర్యటించాలని ఆశించిన జింబాబ్వే జట్టు పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా తయారైంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా గడ్డపై మూడు వన్డేల సిరిస్ ఆడుతున్న కోహ్లిసేన జనవరి 18న ఆ పర్యటనను ముగించుకుని న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనున్న సంగతి తెలిసిందే. న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా టీమిండియా ఐదు వన్డేలు, మూడు టీ20ల సిరీస్ ఆడనుంది. ఈ పర్యటన జనవరి 23 నుంచి ప్రారంభమై ఫిబ్రవరి 10న ముగుస్తుంది. అనంతరం కోహ్లిసేన భారత్‌కి వస్తుంది. ఆ తర్వాత వెంటనే ఫిబ్రవరి 24 నుంచి మార్చి 13 వరకూ మళ్లీ ఆస్ట్రేలియాతో స్వదేశంలో రెండు టీ20లు, ఐదు వన్డేల సిరీస్ ఆడనుంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మార్చి 13 తర్వాత జింబాబ్వేతో భారత్ ఒక టెస్టు, మూడు వన్డేలు ఆడాలని బీసీసీఐ తొలుత షెడ్యూల్‌ని రూపొందించింది. అయితే, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఐపీఎల్ 2019 సీజన్‌ని రెండు వారాలు ముందుకు జరిపి మార్చి 23 నుంచి ఐపీఎల్ 2019 సీజన్‌ని ప్రారంభించనున్నట్లు ఇటీవలే బీసీసీఐ పాలకుల కమిటీ అధికారిక ప్రకటన చేసింది.

10 రోజులే వ్యవధి..

దీంతో ఆసీస్ పర్యటనకు ఐపీఎల్ 2019 సీజన్‌కు మధ్య కేవలం 10 రోజుల వ్యవధే ఉండటంతో జింబాబ్వేతో సిరీస్ ఆడటం కష్టం కానుండటంతో ఆ పర్యటనను రద్దు చేయాలని బీసీసీఐ యోచిస్తోంది. అయితే, ఇందుకు జింబాబ్వే బోర్డు అంగీకరించకపోవడంతో ఒక వన్డే, ఒక టీ20తో జింబాబ్వే పర్యటనని సరిపెట్టాలని కూడా చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

2002లో చివరిసారి..

భారత్ గడ్డపై 2002లో చివరిసారి జింబాబ్వే ద్వైపాక్షిక సిరీస్ ఆడింది. ఆ తర్వాత 2016లో టీ20 వరల్డ్‌కప్ కోసం భారత్‌కి వచ్చింది.

శ్రీకాంత్ జాక్‌పాట్

లీ నింగ్‌తో రూ.35 కోట్ల ఒప్పందం



న్యూఢిల్లీ : భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, తెలుగు తేజం కిదాంబి శ్రీకాంత్ జాక్‌పాట్ కొట్టేశాడు. చైనా బ్రాండ్ 'లి నింగ్'తో నాలుగేళ్లకు భారీ ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీని విలువ రూ.35 కోట్లు. మాజీ ప్రపంచ నంబర్ వన్ శ్రీకాంత్ భారత్ తరపున ఆరు సూపర్ సిరీస్ టైటిళ్లు గెలిచిన ఒకే ఒక్క ఆటగాడు కావడం విశేషం. ఇక లీ నింగ్ చైనాలో అతిపెద్ద స్పోర్ట్స్ బ్రాండ్. స్పాన్సర్‌షిప్‌తో పాటు క్రీడా సామగ్రిని అందజేస్తుంది. 'భారత్‌లో, అంతర్జాతీయంగా లీ నింగ్‌కు ప్రచారకర్తగా ఉండటం గౌరవంగా భావిస్తున్నా. వారి ఉత్పత్తులంటే నాకిష్టం. వారి సరికొత్త ఉత్పత్తులు వాడుతూ నేను నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకుంటూ దేశ ప్రతిష్ఠ పెంచేందుకు కృషి చేస్తా' అని శ్రీకాంత్ అన్నాడు. చైనా, ఇండోనేసియా, సింగపూర్, ఆస్ట్రేలియాలో బ్యాడ్మింటన్ జట్లకు లీ నింగ్ స్పాన్సర్‌షిప్ ఇస్తుంది. జకార్తాలో జరిగిన 2018 ఆసియా క్రీడల్లోనూ భారత జట్టుకు అధికారిక స్పాన్సర్‌గా వ్యవహరించింది. టోక్యోలో 2020 ఒలింపిక్స్ జరిగే వరకు టీమిండియా అధికారిక దుస్తుల స్పాన్సర్‌గానూ ఉంటుంది. లీ నింగ్ అంటే నాణ్యత, నిలకడ అని శ్రీకాంత్ ఇందుకు సరిగ్గా సరిపోతాడని లీనింగ్ ఇండియా భాగస్వామి సన్‌లైట్ స్పోర్ట్స్ డైరెక్టర్ మహేందర్ కపూర్ తెలిపారు.

స్మిత్‌కు గాయం.. ఐపీఎల్‌కు దూరం

ముంబై : బాల్ ట్యాంపరింగ్ ఉదంతంతో గత సీజన్ ఐపీఎల్‌కు దూరమైన ఆస్ట్రేలియా క్రికెటర్ స్టీవ్ స్మిత్.. ఈ సీజన్‌కు సైతం దూరం కానున్నట్లు తెలుస్తోంది. అలాగే ప్రపంచకప్ ఆడాలన్న అతడి ఆశా తీరేలా కనబడటం లేదు. ఇటీవల బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొన్న స్మిత్.. గాయంతో అర్ధాంతరంగా టోర్నీ నుంచి నిష్క్రమించాడు. ఈ లీగ్‌లో కేవలం రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడిన స్మిత్‌కు కుడిమోచేతికి తీవ్ర గాయమైంది. గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో వైద్యులు శస్త్రచికిత్స అవసరమని సూచించారు. దీంతో స్మిత్ టోర్నీ నుంచి అర్ధాంతరంగా తప్పుకున్నాడు. వైద్యులు అతడికి సర్జరీ చేయనున్నారు. అయితే సర్జరీ అనంతరం స్మిత్ ఆరువారాల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా అయితే స్మిత్ ఏప్రిల్ నెల వరకూ విశ్రాంతిలో ఉండాల్సి ఉంటుంది. ఇదే జరిగితే ఐపీఎల్-12 సీజన్ ప్రారంభ మ్యాచ్‌లకు స్మిత్ దూరం కావాల్సి ఉంటుంది. మళ్లీ టోర్నీ చివర్లో ప్రపంచకప్ సన్నాహకంలో భాగంగా ఆయాదేశాలు తమ ఆటగాళ్లను వెనక్కి పిలిచే అవకాశం ఉంది. దీంతో ఈ సీజన్‌లో స్మిత్ సేవలను చాలా మ్యాచ్‌లకు రాజస్థాన్ రాయల్స్ కోల్పోనుంది. ఇందులో భాగంగానే జట్టు యాజమాన్యం ప్రత్యామ్నాయం మార్గాలను అన్వేషిస్తోందని తెలుస్తోంది. ఇక ఈ గాయం స్మిత్ పునరాగమనంపై కూడా ప్రభావం చూపనుందని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) అధికార ప్రతినిధి ఒకరు మీడియాకు తెలిపారు. మార్చి 28తో స్మిత్ నిషేధకాలం పూర్తి కానుందని, అనంతరం అతను దేశవాళీ క్రికెట్ ఆడి జాతీయ జట్టులో చోటు దక్కించుకోవాల్సి ఉంటుందన్నారు. కానీ స్మిత్ గాయంతో బెడ్ రెస్ట్‌లో ఉంటే అతను ఆసీస్ ఆడబోయే ప్రతిష్టాత్మక ప్రపంచకప్, యాషెస్ సిరీస్‌లకు దూరమయ్యే అవకాశం ఉంటుందన్నారు.

ఫెదరర్, నాదల్ ముందంజ

- ఓటమితో ముగిసిన ముర్రే కెరీర్
- ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలి రోజు



మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియా ఓపెన్ తొలిరోజు పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఫెదరర్, రెండో సీడ్ నాదల్, ఐదో సీడ్ కెవిన్ ఆండర్‌సన్ ముందంజ వేయగా, మాజీ నంబర్ వన్ బ్రిటన్‌కు చెందని ఆండీ ముర్రే తొలి రౌండ్‌లోనే ఓటమిపాలయ్యాడు. దీంతో అతడి కెరీర్ చివరి మ్యాచ్ ముగించాడు. ఆసీస్ ఓపెన్ అనంతరం ముర్రే రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. టాప్ 10లో అమెరికాకు చెందిన జాన్ ఇస్నర్ ఇంటి ముఖం పట్టాడు. మూడో సీడ్ ఫెదరర్ తొలి రౌండ్‌లో ఉజ్బకిస్థాన్‌కు చెందిన డెన్నిస్ ఇస్టోమిన్‌పై 6-3, 6-4, 6-4 తేడాతో గెలిచి రెండో రౌండ్ చేరాడు. రెండో మ్యాచ్‌లో ఫెదరర్ డాన్ ఇవాన్స్‌ను ఎదుర్కొంటాడు. రెండో సీడ్ నాదల్ 6-4, 6-3, 7-5తో జేమ్స్ డక్‌వర్త్‌ను ఓడించి తదుపరి రౌండ్‌లో అడుగుపెట్టాడు. ఆండీ ముర్రే స్పేన్‌కు చెందిన 22వ సీడ్ బటిస్టా అగట్ చేతిలో 6-4, 6-4, 6-7, 6-7, 6-2 తేడాతో ఐదు సెట్ల మ్యాచ్‌లో పోరాడి ఓడాడు. తొలి రెండు సెట్లు ఓడినా తిరిగి పుంజుకుని తరువాతి రెండు సెట్లను టై బ్రేక్‌లో గెలుచుకున్నా చివరి సెట్‌లో ఓడిపోయాడు. తొమ్మిదో సీడ్ ఇస్నర్ 7-6, 7-6, 6-7, 7-6 తేడాతో ఒపెల్కా చేతిలో ఓడాడు. మహిళల సింగిల్స్‌లో మదో సీడ్ ఓజ్నియాకీ, 8వ సీడ్ క్విటోవా, 2వ సీడ్ కెబర్ రెండో రౌండ్‌లో అడుగు పెట్టారు.

డ్రాగన్ పడవల పోటీల్లో మహిళల సత్తా

విశాలాంధ్ర-నాగాయలంక(కృష్ణాజిల్లా) : నాగాయలంకలో జరుగుతున్న డ్రాగన్ పడవ పోటీల్లో బాలికలు తమ సత్తాను చాటారు. జల క్రీడలు నాగాయలంక ప్రాంతానికి కొత్త అయినప్పటికీ వివిధ కళాశాలలకు చెందిన మహిళలు భయం లేకుండా పోటీలో పాల్గొని పురుషులకు తామేమీ తీసిపోమని నిరూపించారు. అవనిగడ్డ ఎస్‌వీఎల్ కళాశాల విద్యార్థినులు ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించగా అవనిగడ్డ బీఈడీ కళాశాల విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు. అంతకు ముందు పురుషులకు సంబంధించి డ్రాగన్ పోటీల్లో 26 జట్లు పాల్గొనగా విశ్వనాథపల్లికి చెందిన జట్టు ప్రథమస్థాన్ని, గుల్లలమోదకు చెందిన జట్టు ద్వితీయ స్థానాన్ని సాధించాయి. సంక్రాంతి వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం నాగాయలంక ఘాట్ వద్ద డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ దంపతులు భోగి మంటలు వేసి, 100 మంది చిన్నారులకు భోగి పండ్లు పోశారు. ఈ పోటీలను చూసేందుకు సర్వోన్నత న్యాయస్థాన మాజీ చీఫ్ జస్టిస్ జాస్తి చలమేశ్వర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, ఎంపీ కొనకళ్ల నారాయణ రావు, నాగాయలంక గ్రామ ప్రముఖుడు మండవ బాలవర్ధిరావు, స్వచ్ఛ నాగాయలంక కార్యకర్తలు పాల్గొన్నారు. సాయంత్రం జబర్దస్త్ బృందం నాగాయలంక ఘాట్‌లో హాస్యవల్లరితో అలరించారు.



ఆమె కోసం 14 ఏళ్లుగా పోరాటం

సామూహిక అత్యాచారం జరిగిందని తెలిసినా పెళ్లిచేసుకున్నాడు



చండీగఢ్: పట్టపగలే ఆడపిల్లలపై అకృత్యాలు ఎక్కువవుతున్నాయి. అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేస్తే ఆమె అబద్ధాలు చెబుతోందని బాధితురాలిపై నిందలు వేసేవారున్నారు మన సమాజంలో. అలాంటిది తాను ప్రేమించిన అమ్మాయి సామూహిక అత్యాచారానికి గురైందని తెలిసీ ఆమెను పెళ్లిచేసుకోవడానికే కాదు ఆమెకు న్యాయం జరిగే వరకు పోరాడతానని నడుంబిగించాడు ఓ వ్యక్తి. హర్యానాకు చెందిన జితేందర్ ఖత్తర్ అనే వ్యక్తి కథ ఇది. జితేందర్ గురించి తెలిసి జాతీయ అవార్డు అందుకున్న దర్శకుడు విభా భక్షి తాను తెరకెక్కిస్తున్న 'సన్ రైజ్' అనే డాక్యుమెంటరీలో అవకాశం ఇచ్చారు. తన జీవితంలో ఏం జరిగిందో జితేందర్ ఓ ఆంగ్ల మీడియా ద్వారా వెల్లడించారు. 'నాది హర్యానాలోని ఛత్తర్ అనే గ్రామం. నేను పక్క గ్రామానికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమించాను. ఇద్దరం పెళ్లిచేసుకోవాలనుకున్నాం. మా పెద్దలు కూడా ఒప్పుకున్నారు. నిశ్చితార్థం జరిగింది. కానీ ఓ రోజు నా జీవితంలో మర్చిపోలేని సంఘటన గురించి వినాల్సి వచ్చింది. నా భార్య ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలని రమ్మంది. నేను వెళ్లాను. తనపై సామూహిక అత్యాచారం జరిగిందని, పెళ్లిచేసుకోవడానికి తాను అర్హురాలిని కానని కుమిలి పోయింది. అది వినగానే నా కళ్లలో నీరు. ఎవరో చేసిన తప్పుకు ఆమెను శిక్షించడం సబబు కాదని పించింది.' 'ఆమెను పెళ్లిచేసుకుంటాననే కాదు.. న్యాయం జరిగేలా చూస్తానని కూడా మాటిచ్చాను. అలా మా పెళ్లికి ముందే నా న్యాయపోరాటం మొదలైంది. హర్యానాలో అత్యాచారాలు ఎక్కువగా జరుగుతుంటాయి. కానీ బాధితుల నోళ్లు మూయించేస్తుంటారు. పరువుపోతుందని. సమాజం ఆడవారినే తప్పుబడుతుందన్న విషయం మనకు తెలిసిందే. నా స్థానంలో మరో అబ్బాయి ఉండుంటే కచ్చితంగా పెళ్లికి ఒప్పుకునేవాడు కాదు. అత్యాచార బాధితులకు సమాజంలో గౌరవం ఉండదు. నా భార్యకు మాటిచ్చినట్లుగానే అత్యాచారానికి పాల్పడిన ఎనిమిది మంది నిందితులపై కేసు పెట్టాను' 'న్యాయవాదులను మాట్లాడుకున్నాను. కానీ మాకు బెదిరింపులు ఎదురయ్యాయి. అవన్నీ తట్టుకున్నాను. కేసు గెలవడం కోసం రెండు ఇళ్ల స్థలాలు అమ్ముకున్నాను. నిందితుల్లో కొందరు పలుకుబడి ఉన్నవారట. దాంతో జిల్లా సెషన్స్ న్యాయస్థానం వారిని నిర్దోషులుగా తేల్చింది. దాంతో నేను హైకోర్టును ఆశ్రయించాను. నా భార్య నిద్రపోవడానికి కూడా భయపడేది. దాంతో ఆమె కోసం నా చిరు వ్యాపారాలను వదులుకుని ఆమె పుట్టింటికి దగ్గర్లోనే ఓ ఇల్లు తీసుకున్నాను. అలా దాదాపు 14 ఏళ్లుగా న్యాయం కోసం పోరాడుతున్నాను. ప్రస్తుతం నేను లా చదువుతున్నాను. పోలీసులు, న్యాయవాదులను నమ్ముకుంటే నాకు జరిగే మేలు ఏమీ లేదనిపించింది. అందుకే త్వరగా చదువు పూర్తిచేసి నా భార్య కేసును నేనే వాదించుకుంటాను' 'ఇప్పుడు నా భార్య కూడా లా చదువుతోంది. ఇద్దరం చదువు పూర్తిచేశాక గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళల సంరక్షణ కోసం మాకు తోచిన సాయం చేస్తాం. ఏదో ఒక రోజు మా జీవితాల్లో పెను మార్పు చోటుచేసుకుంటుందని, అన్నీ మర్చిపోయి హాయిగా జీవిస్తామని ఎదురు చూస్తున్నాను.' అని వెల్లడించారు జితేందర్.

ప్లాస్టిక్ బ్యాగుల్లో 17 కుక్కపిల్లలు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో అత్యంత అమానవీయ ఘటన చోటుచేసుకుంది. ఎన్‌ఆర్‌ఎస్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ పార్కింగ్ స్థలంలో కనిపించిన మూడు డిస్పోజబుల్ బ్యాగులు అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయి. వాటిలో 17 కుక్కపిల్లలు ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన వెలుగు చూడగా సాయంత్రానికి ఈ విషయం దావానలంలా నగరమంతా వ్యాపించింది. పిల్లలతో పాటు కుక్క కూడా ఓ సంచిలో ఉంది. బతికే ఉన్న ఆ శునకం నుంచి రక్తం ధారాళంగా కారుతోంది. స్థానికులు సంచిని చింపిన వెంటనే నొప్పికి తాళలేని కుక్క ఒక్కసారిగా బయటకు గెంతింది. మిగతా రెండు సంచులను చింపిన స్థానికులు కొన ఊపిరితో ఉన్న కుక్క పిల్లలను బయటకు తీశారు. అయితే, చికిత్స కోసం వాటిని తరలిస్తుండగా ప్రాణాలు వదిలాయి. స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

వారానికి రెండుసార్లే స్నానం



టోక్యో: జపాన్‌కు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ నిస్సాన్ మాజీ చైర్మన్ కార్లోస్ ఘోన్స్ పట్ల జైల్లో అధికారులు దారుణంగా ప్రవర్తిస్తున్నారంటూ ఆయన భార్య కరోల్ గ్లోబల్ ఎడ్వకసీ గ్రూప్‌లోని మానవ హక్కుల సంఘానికి లేఖ రాసింది. ఆయన పట్ల దురుసుగా, పాశవికంగా ప్రవర్తిస్తున్నారంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఆర్థిక మోసం కేసులో కార్లోస్‌ను నవంబరు 19న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన జైల్లో ఉంటున్నారు. విచారణ సమయంలో కనీసం తమ తరపు న్యాయవాదులు వచ్చేందుకు కూడా జైలు అధికారులు అంగీకరించడం లేదని ఆమె ఆరోపించారు. 'నా భర్తను జైలు గదికే పరిమితం చేశారు. కుటుంబసభ్యులను ఎవరినీ కలవనివ్వడం లేదు. ఏ ఖైదీ పట్ల కూడా ప్రవర్తించనంత పాశవికంగా కార్లోస్ పట్ల ప్రవర్తిస్తున్నారు. రెండువారాల్లో నా భర్త 7పౌండ్లు(3 కేజీలు) తగ్గిపోయారు. ఆయన మందులను వాడుకోనివ్వడం లేదు. రోజు 30 నిమిషాలు మాత్రమే వ్యాయామం చేసుకునేందుకు సమయమిస్తున్నారు. వారానికి రెండు, మూడు సార్లు మాత్రమే స్నానం చేసేందుకు అనుమతిస్తున్నారు' అంటూ ఆమె తన లేఖలో పేర్కొన్నారు. గతవారం కార్లోస్‌కు బాగా జ్వరం వచ్చిన సమయంలో కనీసం కుటుంబసభ్యులు కలిసేందుకు కూడా అనుమతి ఇవ్వలేదంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం న్యాయవాదులు, ఉన్నతాధికారులను మాత్రమే కలవనిచ్చారంటూ ఆమె ఆరోపించారు. కొన్నేళ్లుగా అవినీతికి పాల్పడుతూ, టోక్యో స్టాక్ ఎక్స్ఛేంజీ సెక్యూరిటీస్ నివేదికల్లో తప్పుడు లెక్కలు చూపించి తన ఆదాయాన్ని తక్కువగా ప్రకటించారని కార్లోస్‌పై అభియోగాలు ఉన్నాయి. దీంతో పాటు కంపెనీ డబ్బును తన సొంత అవసరాలకు ఉపయోగించుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే అవినీతి నిరోధక అధికారులు ఆయన్ను అరెస్టు చేశారు. దీంతో చైర్మన్ పదవి నుంచి ఆయన్ను తప్పించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.